# ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది

అరె! ఎంతాశ్చర్యంగా వుందో! కాలేజీలో బయల్దేరినప్పుడు బయట ఎండ చూస్తే భయం వేసింది. అప్పుడే ఈ మబ్బులన్నీ ఎక్కణ్ణించి వొచ్చాయి? వానొచ్చేలా వుందే! ...అప్పుడే చినుకులు! బాగా కురిసేలాగే వుంది- ఆటో పోతోంది ఖాళీగా. ఏమౌతుందిలేవోయ్ తడిస్తే-పూలజల్లులా వుందే చక్కగా ....- చిన్నప్పుడు వానలో ఎంత తడిచేవాళ్ళమో- కొన్ని కొన్ని విషయాల్లో అమ్మ బలేమంచిది. మొన్న సత్యవతిగారు బుజ్జిగాణ్ణి నీళ్ళతొట్టి దగ్గిర ఆడి వొళ్ళంతా తడుపుకున్నాడని చావబాదింది. పాపం వాడికా దెబ్బలకే జ్వరం వచ్చేసింది. పైగా నీళ్ళలో తడిసినందుకే అంటుం దావిడ- దేవుడొచ్చి చెప్పాలిక- ఆహా మట్టివాసనెంత కమ్మగా వొస్తోందో! ఏ సెంట్లు ఏ అత్తర్లు సరిపోతాయి దీనికి? చిన్నప్పుడు ఎర్రటిమట్టి పెళ్ళలు పెట్టి పళ్ళు తోముకునేవాళ్ళం. ఇప్పుడైతే? చచ్చేభయం. దాన్నిండా క్రిము లుంటాయట. గాలిలో ఏవో వుంటాయి అంతా జాగర్త. జాగర్త. ఎందు కొచ్చిన జ్ఞానమో- బాగానేవుంది ఆలోచన. అన్నిటికీ సత్యవతిగారి మూర్ఖ త్వమే బాగుంటుందా ఏమిటి? — ఎవరీయన మీదకొచ్చి ఆపుతాడు కారు?

"మీ కభ్యంతరం లేకపోతే కారెక్కండి దిగబెడతాను...." ఇంగ్లీషులో.

"థాంక్స్. వొద్దులెండి"

"ప్లీజ్! ఎక్కండి" కొంచెం పక్కకివొంగి వెనక తలుపుతీశాడు ..

"అక్కర్లేదండీ! చాలా థాంక్స్! మీరు వెళ్ళండి."

"వర్షం ఎక్కువయ్యేలా వుంది. బాగా తడుస్తారు."

కొంచెం విసుగ్గా —"వర్షంలో తడుస్తోన్నవాళ్ళు చాలామంది వున్నా రండీ! అటు చూడండి. ఆ భిచ్చగాడు.... ఎంత ముసలివాడో! ఆ వొంటి మీద పీలికలు తడిస్తే ఇంకో గుడ్డ వుండదు. స్కూళ్ళనించి వొస్తోన్న ఆ పిల్లలంతా పుస్తకాలన్నీ తడుస్తూ-"

ఆ మాటలకి ముచ్చట పడ్డట్టు అతని నవ్వు - "అందరికీ ఎట్లా హెల్ప్ చెయ్యగలం ? మీ నాన్నగారు నాకు బాగా తెలుసు."

"మా నాన్నగారి కీర్తిమీద మీ కారెక్కటం నాకిష్టం లేదులెండి"

సర్రన దూసుకుపోయింది కారు. దయా సముద్రుడు మహా విసురుగా తోలుకుపోయాడు దాన్ని. కోపం వచ్చింది కావును "ధిక్కారమున్ సైతునా?" అన్నట్టు పోతున్నాడు. ఎంత దయ ఆడపిల్లలమీద!

అవునూ! రాజారావుగారి సంగతేం చెయ్యాలి? ఈ వాన సందట్లోపడి ఆ సంగతే గుర్తులేదు. చాలా ఆశ్చర్యం! అంత చొరవగా అడిగేస్తాడనుకోలేదు. ఏదో మామూలుగా మాట్లాడుతున్నాళ్ళే అనుకుంటే.... చాలాదూరం పోయిందే వ్యవహారం! సుజాతకన్నా - కుసుమకన్నా అందమైందా తను? పోనీ విశాల? ఎంత తెలివైందో! అదేమిటో అందర్నీ ఒదిలిపెట్టి తనమీద పట్టించాడు.

అబ్బో! వర్షం ఎక్కువౌతోంది. ఆకాశం చాలా గందరగోళం పడుతోంది. శతృవులు రమ్మంటున్నారు కావును యుద్ధానికి. డోళ్ళో, భేరీలో వాయిస్తారని చెప్పేవాడు కదూ గడ్డం తాతా. కత్తులు ధగధగలాడేట్టు విసురుకుంటూ.... ఆకాశంలో యుద్ధాలెందుకు తాతా? చక్కగా తాళాలు వాయిస్తూ పాటలు పాడుకోరాదూ?" అనేవాళ్ళు పిల్లలు. తాత నవ్వి మాయచేసి ఇంకేదో చెప్పేవాడు. సూర్యుడు పూలతోటకి నీళ్ళు పోస్తోవుంటే అవన్నీ కిందపడి వానౌస్తుందట. ఎప్పుడూ నీళ్ళే కింద పడతాయి. పువ్వులూ ఆకులూ కింద పడవేం ?" అని అడ్డు ప్రశ్నలు వేసేవాడు రాముడు. ఇప్పుడెక్కడున్నాడో ! రామ్‌రావ్ అయ్యాడేమో! ఆ కథలెంత బాగుండేవో? రాముడికి తప్ప ఎవ్వరికి ఒక్క సందేహం వచ్చేదికాదు. ఆకాశంలో దేవతలు ఎగురుతున్నారంటే నమ్మటం - పాతాళంలో పిశాచాలు నిద్రపోతున్నాయంటే నమ్మటం - అలా నమ్మితే ఎంత బావుండేదో! ఇప్పుడెంత సైన్సు తెలిసినా అప్పుడొచ్చే ఆనందంలో వందోవంతు రాదేం ? అందుకేనేమో మనుషులు మూఢనమ్మకాల్ని ఒదల్లేరు.

వర్షంలో తడవడం బాగానే వుంటుంది గానీ నడవటం యిబ్బందేమో! అప్పుడే కుచ్చెళ్ళన్నీ తడిచి కాళ్ళకి అడ్డం పడుతున్నాయి. ఈపాడు చీరలూ పైటలూ ఒంటిచుట్టూ పూతరేకు మడతలమల్లే ఎవరుపెట్టారు యిలా చుట్టుకోవాలని. సోషలిష్టు దేశాల్లో ఆడా మగా అందరూ ఒకేరకం డ్రెస్సు వేసుకుంటారట. ముఖ్యంగా పనికీ స్వేచ్ఛకీ అడ్డంరావు బట్టలు. మనంకూడా అలా మార్చుకోరాదూ? అమ్మో! చచ్చిపోతాం. మన చీరకట్టు సంస్కృతి అజంతా శిల్పసుందరి వొరవళ్ళూ మన పట్టూ బెనారస్‌లూ ఏ గంగలో కలుస్తాయి?- ఆ పంజాబీ అమ్మాయి కొంతనయం. సుఖంగా నడుస్తోంది. ఆ దుప్పట్టా అవతలపారేస్తే ఆ డ్రెస్ బాగానే వుంటుంది. మొన్న ఆ డ్రెస్ కుట్టించుకోబోతే అమ్మ కేకలేసింది అమెరికావాళ్ళు కూడా మన చీరల్నే మోజుపడుతున్నారు కాబట్టి మనం మన చీరలు ససేమిరా వొదలకూడదంది. మనలాగా జిడ్డు సెంటిమెంట్లు లేవు వాళ్ళకి. ఎక్కడ ఏది నచ్చినా మోజుపడతారు. నచ్చకపోతే దానిమొహం చూడరు. మనకో? ఇష్టాలూ అయిష్టాలూ లేవు. అమ్మమ్మలు చేసినపనే మనవాళ్ళు చెయ్యాలి. రెండు తరాలకి కాదుగదా పన్నెండు తరాలకికూడా మారని అచంచల స్థిరసంస్కృతి మనది. అయినా ఎవరికో నచ్చింది కాబట్టి ఇది చాలా గొప్ప అనుకోవటం ఎంత సిగ్గుచేటు! ఈ అమ్మల్తో ప్రతి చిన్న పనికీ యుద్ధాలు చెయ్యాలి. అనవసరం శ్రమదానాలెందుకులే- చీరలే కట్టుకుంటే పోతుంది స్వేచ్ఛవొచ్చే వరకూ.

వర్షం జోరవుతోందోయ్! లాభంలేదు. చేతిలో ఈ పుస్తకాలొకటీ- లైబ్రరీవికూడా వున్నాయి. చెట్లమీదకి పక్షులూ చెట్లకిందకి మనుషులూ చేరుతున్నారు.

ఇల్లంటూ వున్నవాళ్ళు ఎలాగోపోయి తలుపులూ కిటికీలూ బిగించుకుని వెచ్చగా కూచుంటారు. పాపం ఈ పేవ్‌మెంట్లమీద చెట్లకిందా జీవించే బిచ్చగాళ్ళు.... జీవించటమా ఇది? జీవితం అనాలా దీన్ని? పక్షులకైనా లేని ఇంత దీనస్థితి .... దేవు డెవరో అన్నాట్ట—

"పిట్టలకి చెట్లున్నాయీ, నక్కలకి తొర్రలున్నాయీ. ఏమీలేని మను

షల్లారా! నా దగ్గిరకి రండి!" అని పిలిచాట్ట. పక్షులకీ జంతువులకీ కూడా అక్కర్లేని దేవుడు మనుషుల్ని వుద్దరిస్తాట్ట- "మాక్కూడా చక్కటి భవనా లున్నాయి. వానకీ ఎండకీ భయంలేని నివాసా లున్నాయి. నీ పనేదో నువ్వు చూసుకోవోయ్!" — అని బిచ్చగాళ్ళంతా చెప్పగలిగితే?....దూరపు కల అన్నారెవరో అవును. ఇంకా ఎన్ని శతాబ్దాల దూరమో!

ఇక లాభంలేదు. బట్టలూ తలా సుబ్బరంగా తడిశాయి. ఈ భారత చీర చుట్టుకుని కాళ్ళు తడబడేట్టున్నాయి. ఈ పుస్తకాల్ని రక్షించాలికదా? వాహనం ఎక్కక తప్పదు. "ఏయ్! ఆటో...."

* * *

సుధ ఆటో దిగి గేటు తీసుకుని తడిబట్టలతో నెమ్మదిగా నడుస్తూ యింట్లోకెళ్ళింది. తన గదిలో టేబుల్ మీద పుస్తకాలు ఆరపెట్టి స్టాండు మీద బట్టలు తీసుకుని బాత్‌రూంలో కెళ్ళి తలుపేసుకుంది.

మళ్ళీ ఏదో జరిగినట్టుంది. ముందుగదిలో నాన్న తలెత్తి చూశాడే గానీ మాట్లాడకుండా పేపర్లో మునిగాడు. అసలీ వేళ్ళప్పుడు నాన్న పేపరు చదవడు. పైగా ఈ వర్షంలో ఏ నవలన్నా చదువుకోక ఆ పిచ్చి రాజకీయాలు వీళ్ళకెలా నచ్చుతాయో! ఆ వియత్నాంలో అదేం యుద్ధమో .... దాని కెప్పటికన్నా అంతుందో లేదో....ఏవిటో రాస్తారు. పేపర్లనిండా సగం అబద్ధాలు. అర్థంకావు. ఏమీ తెలీకుండా తనకే యింత కోపం వస్తోంది అమెరికామీద. ఎన్నో ధర్మపన్నాలు మాట్లాడే ప్రిన్సిపాల్ అస్తమానూ స్టేట్స్ స్టేట్స్ అని పాట పాడతాడేం? వొళ్తాడు కావును ఎప్పుడో.

ఆ బంగ్లాదేశ్ వార్తలంటే చాలా యిష్టంగా వుండేది మొన్నటి వరకూ. అక్కడ ఎంతోమంది ఆడవాళ్ళని యిళ్ళల్లోంచి తరిమేశారట చెడిపోయారని. మనుషులుకూడా చెడిపోతారా పళ్లో కూరగాయలో చెడిపోయినట్టు? అన్నట్టు మనుషులంతాకాదు-ఒక్క ఆడవాళ్ళే చెడిపోతారు. శత్రువొచ్చి మీదబడి పెడరెక్కలు విరిచికట్టి బూటుకాలుతో తన్ని తుపాకీలతో పొడిచినా ఏ మొగాడూ చెడిపోడు. పైగా వీరభక్తుడో దేశభక్తుడో అవుతాడు. సరిగ్గా అలాగే అంత నిస్సహాయంగానే ఆక్రోశిస్తూ శత్రువు

చేతుల్లో పడ్డ ఆడవాళ్ళు మాత్రం చెడిపోతారు. తల్లులూ- తోబుట్టువులూ - భార్యలూ-కూతుళ్ళూ-యింకపనికి రాకుండా అయిపోతారు.

స్వతంత్రం తెచ్చుకున్నారట. ఎవరికోసం? ఏమీ తప్పులేని వాళ్ళ మీద వీళ్ళంతా చేసిన దౌర్జన్యం మాటేమిటి? స్వతంత్రం అంటే మనం లాక్కునేదేనా? యిచ్చేదికాదూ? పశువులెంత గొప్పవో?

అసలు శత్రువెప్పుడూ మన సిరిసంపదలమీదే కాదు మన నీతి మీదా పవిత్రతమీదా, మనం గొప్పగా ఆరాధించుకునే విలువలమీదా దెబ్బ తీస్తాడట. మనల్ని అవమానించి—మన ఆత్మాభిమానాన్ని గాయపరిచి మన జీవితాలు ఛిన్నాభిన్నం చెయ్యటమే వాడి లక్ష్యం అన్నమాట. అసలు మన విలువలు ఇంత అల్పమైనవికాకపోతే? ఎవరెంత కక్ష సాధించినా—బలాత్కరించినా మన పవిత్రత మాయదనుకుంటే? శత్రు సైనికుడి క్రూరత్వంతో అవమానపడ్డ స్త్రీని ఆమె భర్త ప్రేమతో అక్కున చేర్చుకుని కన్నీరు తుడిస్తే....! అబ్బో! చాలా సంస్కారం కావాలి మనుషులకి—దేశాలకి.

బాత్‌రూంలో కొస్తోంటే అమ్మ చూసినట్టేవుందే!— "అలా తడిశావేమిటి?" అనాల్సిందే. సుబ్బులుకూడా మొహం ఎత్తకుండా పనిచేసేస్తోంది. ఏం జరిగిందోమరి. ఏదో జరుగుతోనో వుంటుంది. పోట్లాటలు కల్పించుకోవటమే లక్ష్యం కొందరికి. ఏ చిన్న కారణమైనా ప్రోత్సాహం ఇస్తుంది. ఇక కష్టాలకేం కరువు?

అమ్మా నాన్నా అందర్లాంటి భార్యా భర్తలే అయితే—పెద్దవాళ్లెవరో చేసిన పెళ్ళయితే వాళ్ళదీ ఇంతాలోచించక్కర్లేదు. ప్రేమ వివాహం మరి. ప్రేమంటే మాటలా? సరిగ్గా అర్థంకాదుగానీ చాలా గొప్పదై వుండాలి—అంత గొప్పదా? ఏమో! నమ్మాలనిపించదు. అంత గొప్పదైతే ....

రాజారావుగారు భలే ఆయన. ప్రేమా గీమా ననపెట్టకుండా తిన్నగా పెళ్ళిలోకి దిగాడు — "మీలాంటి అమ్మాయికోసమే .... మీలాంటి ..." అనేశాడు. అంత చనువుందనుకో.

"నాలాంటేగానీ నేను కాదుగదా మాష్టారూ!" అని నవ్వితే.

"ప్లీజ్ సుధా. ఈ విషయం సీరియస్‌గా ఆలోచించండి మీరు. తర్వాత మనం మాట్లాడుకుందాం. ఎప్పుడు ..."

"కలుసుకుందాం?" అని కాబోలు ఆ చివర. ఎవరో వొచ్చి ఆయన్ని పిలుస్తోంటే బైటపడింది తను. కొన్నాళ్ళనించీ ఆయన ఈ ధోరణిలోనే వున్నట్టున్నాడు. అసలు తనెప్పుడూ అంత ఇష్టం అదీ చూపించలేదే! కొంచెం నవ్వి చనువుగా మాట్లాడితేనే ప్రేమ వొచ్చేసిందన్నమాట ఆయనకి. భలే ఆశ్చర్యంగా ఏమీ తొణక్కుండా అడిగేశాడు. ప్రాక్టికల్ మనిషి. అందంగా వుంటాడు. సందేహంలేదు. మంచివాడిలాగే కనిపిస్తున్నాడు. మరి అంతకోరి .... తనే ప్రేమించి .... ఛ! ఛ ప్రేమేమిటి! అబద్ధాల్లో అబద్ధం అది. ఎన్నాళ్ళు నిలుస్తుంది?—నిలుపుకోవటం చేతనైతే జీవితాంతం నిలుస్తుందేమో—పిచ్చి—నమ్మకూడదు. చేతకాకేనా ఇన్ని చికాకులుపడేది అందరూ?.... అవునోయ్! నిజంగా చేతకాకే—మరి అయితే తనకి మాత్రం ఏం చేతనౌతుంది. మహామహా వాళ్ళకే అసాధ్యం అది. రాజారావుగార్ని అడిగితే సరి—"ఏవండీ, మీకు ప్రేమ నిలుపుకోవడం చేతనవుతుందా?" అని పాపం తెల్ల మొహం వేస్తాడు మానవుడు.

ఎంత వాన కురిసినా చలెయ్యటంలేదే! వానచప్పుడు ఎంత బావుంటుందో! ఏం టిఫినో ఇవ్వాళ? దంచేస్తోంది ఆకలి.

బాత్‌రూంలోంచి బయటికొచ్చి సుధ పౌడిటవల్‌తో తల తుడుచుకుంటూ వంటింట్లోకి వెళ్ళబోయింది. భోజనాల బల్లమీద ప్లేటన్నీ మూతలు పెట్టివున్నాయి. వొక కుర్చీలో కూచుని ప్లేటు దగ్గరికి తీసుకుంది. మూత తీసి చూస్తే—ఉప్మా!

చూడ్డానికి భలే అందంగా ఉంది. రాజారావుగారిలాగ—రుచి ఎలా ఉందోగానీ. నాన్న ఇంకా పేపరేనా? గొప్ప సంగతి!

"అమ్మా! చంద్రశేఖర్ రాలేదా? వొచ్చి వెళ్ళాడా?" రెండు నిమిషాలైనా జవాబులేదు. అమ్మకి బాగానే వినిపించింది మరి. అంటే అమ్మకి మాట్లాడాలని లేదన్నమాట—పోన్లే. అదే మంచిది. ఎవ్వరూ ఎప్పుడూ

ఇష్టంలేని పనులు చెయ్యకూడదు. అతని ఇంటర్వ్యూ ఏమైందో! ఎంత ఆశతో వెళ్ళాడో! అంతంత చదువులు చదివి ఉద్యోగాలిమ్మని ముష్టి వాళ్ళమల్లే యాచించటం, ప్రతి నిరుద్యోగి ప్రతీ నిముషం ఎంత క్షోభ ఎంత ఆత్మహింస భరిస్తున్నాడో! చాలా అనుభవాలు వూహకి అందవు.

చెంచాతో ఉప్మాలోంచి పచ్చిమిరపకాయ ముక్కలు వెదుకు తోంది సుధ.

ఇల్లంతా ఇంత నిశ్శబ్దంగా .... సుబ్బులికిష్టమైన సిలోన్ తెలుగు పాటలుకూడా పెట్టకుండా... అసలేమైంది యివ్వాళ? ఫస్టుతారీఖు కూడాను. ఇద్దరికీ జీతాలు వొస్తాయి—చాలా సరదాగా ఉండేరోజు. అంత గొప్పగా ప్రేమించుకున్న వాళ్ళకి కష్టాలేనా జీవితంలో?

పోనీ ఆ వెంకట్రామయ్యగారూ పార్వతమ్మగారూ పోట్లాడుకున్నా రంటే .. ఆయనకి చాలా ఆస్తివుందని ఈవిడ పెద్దలూ, ఈవిడ బాగా కట్నం నగలూ పట్టుచీరెలూ తెస్తుందని ఆయన పెద్దలూ పెళ్ళి చేశారు. మనిషికీ మనిషికీ జరిగిన పెళ్ళికాదు అది. వీళ్ళ డబ్బుకీ వాళ్ళ డబ్బుకీ అన్నమాట ఆ డబ్బంతా తగలేస్తాడాయన. అందులో గొప్ప నేర్పరిట. ఆ నేర్పు ఆవిడకేం నచ్చదు. తిడుతుంది. కొడతాడు. ఇంకా తిడుతుంది. ఇంకా కొడతాడు. సరే! అదంతా నిత్యం సూర్యుడు తూర్పున ఉదయించి నంత సహజంగా జరిగిపోతుంది. గమ్మత్తేమిటంటే ఆవి దెబ్బ దొచ్చినా ఓ కొత్త నగ పట్టుకొచ్చి—"మావారు నాకోసం కొన్నారు" అంటుంది— "మా వారు నాకివ్వాళ కడుపునిండా అన్నం పెట్టారు. ఓ గ్లాసు మంచినీళ్లు కూడా ఇచ్చారు. అంటే ఎలా ఉంటుంది? ఆవిడ మాటలన్నీ అమ్మకి బాగానే ఉంటాయి.

రాధత్తయ్య? .... మేనత్త కొడుకేట వాళ్ళాయన. ఎంత చక్కగానో వుండచ్చునా? ఎంత ఘోరంగా వుండటానికి వీలుందో రిసెర్చి చేస్తు న్నారు. ఇంకెంత? కనిపెట్టేస్తారు. వాళ్ళ కృషి—దీక్ష అలాంటివి. జోగారావుగారూ ...గారుకూడా ఎందుకు దండగ. "ఆయనవన్నీ వెధవ దరిద్ర బుద్ధులండీ" అంటుంది వాళ్ళావిడ. ఆవిడెప్పుడూ పుట్టింట్లో

వుంటుంది. ఈయనెప్పుడూ వూళ్ళమీద తిరుగుతాడు ఆ వెధవ దరిద్రబ్బుద్ధుల గూఢార్థం ఏమిటో చాలా కాలం అర్థం కాలేదు. ఆయన గొప్ప రసికుడన్నమాట. "రసికుణ్ణి దరిద్రుడు అనొచ్చునా?" ఈసారి అడగాలి తెలుగు మాష్టార్ని! అన్నపూర్ణగారు....? అబ్బ! ఎంత మూర్ఖమో ఆవిడ! లేచింది మొదలూ—మా కులం....మా శాఖ... మా గోత్రం...." అంటూ. కుల ప్రచారానికే ఈ లోకాని కొచ్చినట్టు, కాళికా దేవి తనమీదే ఆ భారం మోపి పంపినట్టు మాట్లాడుతుంది. పోనీ యితర్ల దగ్గిర పర్వాలేదు. ఆవిణ్ణి భరించలేకపోతే స్నేహం మానేస్తారు. జీవితాంతం కలిసి ఉండాల్సిన భర్త దగ్గిరకూడా—"మా వంశంలో యిలాంటి వెన్నడూ ఎరగం సుమండీ! అసలు మా కుటుంబం....మా తాతగారు...." అని ప్రారంభిస్తుంది. పోనీ నవ్వి ఊరుకోరాదూ ఆయన. వినేవాళ్ళకి ఆసక్తి లేకపోతే ఆవిడ మాత్రం ఎన్నాళ్ళు వర్ణిస్తుంది? అసలు చాలా మందిని సినిమాలు చూసినట్టు చూసి ఆనందించాలి. ఆయనకి సినిమాలంటే యిష్టమే. అందులోనూ టిక్కెట్టులేని సినిమా. ఊరుకునేవాడేగానీ ఆవిడ వంశంకన్నా ఈయన వంశం మరీ గొప్పదైపోయాక ఏం ఊరుకుంటాడు?——"అది కాదు. మా వాళ్ళే మీ వాళ్ళ కన్నా ..." అని చిన్న అభ్యంతరం లేవదీస్తాడు. "మీరలా అంటే నేనూరుకోను సుమండీ! అసలు మా తాతగారు...."

"ఏడిశాళ్ళే మీ తాత."

"మీ తాత కూడా మా తాతతో కలిసి ఏడుస్తాళ్లెండి. నోరుముయ్యి. పళ్ళు రాలగొడతాను." వెధవ చివరికి— సర్వసాధారణంగా ఆయన తాత గొప్పవాడవుతూ వుంటాడు. ఆయన బూతుల్తో ఆవిడ నిజంగానే నోరుమూసి భోరున ఏడుస్తుంది. ఒక్కటి మాత్రం నిజం. పెళ్ళాన్ని—బూతులుతిట్టే వంశం ఆయన్ది. అవి చక్కగా అరాయించుకునే వంశం ఈవిడది. 'ఈడూ జోడూ' అంటారే అది అబద్ధం కానీ, వంశం వంశం సరిపోవాలి. తను అన్ని తిట్లు తింటోంటే తన గొప్ప వంశీకులెవరూ ఎందుకురారో....తన్నెందుకు రక్షించరో ఆవిడకి పట్టదు. మళ్ళీ రెండు రోజులు పోయాక — "మీకు తెలీదుగానీ .... మా తాతగారు ....

అబ్బో! ఆయన ఠీవి." ఈ రెండురోజుల్లో ఆ ముసలాయనకి అంత ఠీవి ఎలా మొలిచిందో అర్థంగాక ఈయన మళ్ళీ ....

భూమి తన చుట్టూ తాను తిరుగుతుంది. వాళ్ళిద్దరూ వాళ్ళలో వాళ్ళే పోట్లాడుకుంటారు. మళ్ళీ ...మళ్ళీ....మళ్ళీ....మళ్ళీ

ఈ మనుషు లెవరిమధ్యా ప్రేమబంధంలేదు. అసలు ఇవన్నీ వొట్టి వివాహ బంధాలు కట్నాల చదువుల్లాగా—పెళ్ళి సంగీతాల్లాగ సాంప్రదాయాల పుచ్చులు. అవి నానా చిక్కులూపడి కాళ్ళకీ, చేతులకీ, కంఠాలకీ బిగుసుకుంటాయి. విప్పుకోవటం చేతకాక పెనుగులాడి, మరీ చిక్కులు చేసుకుని ముళ్ళు పడేసుకుని నిస్సహాయంగా దయనీయంగా చూస్తూ వుంటారు.

కానీ అమ్మా నాన్నా అలాక్కాదే!

"అదేమిటి? జీడిపప్పంతా ఏరిపెడుతున్నావు?"

ఉలిక్కిపడి తలెత్తింది సుధ. జీడిపప్పంతా ఇంకో ప్లేట్లోకి చేరింది. అదంతా మళ్ళీ వుప్మాలో వేసుకుంది.

అమ్మ మొహం చాలా విచారంగా....నాన్నింకా రాలేదు టిఫిన్‌కి. అమ్మకూడా తినటంలేదు. మిగతా ప్లేట్లు అలాగే వున్నాయి.

"ఏమైందమ్మా?" అనాలని మనసులో కదిలింది. ఏం లాభం? ఒక్కోసారి అమ్మచెప్పదు. వాళ్ళ వ్యవహారాలు పిల్లలకి చెప్తే వాళ్ళ గౌరవానికి చాలా భంగం. మళ్ళీ పిల్లలమీద పెత్తనం చెయ్యటానికీ కేకలెయ్యడానికీ వీలుండదు. మనసువిప్పి పిల్లలకిచెప్పి వాళ్ళతో కష్టసుఖాలు పంచుకుందామని ఈ పెద్దవాళ్ళకి అనిపించనే అనిపించదు.

పోనీ అడిగితే అమ్మమనసు కొంచెం తేలికపడుతుందేమో_నిజమే గానీ తన మనసు చాలా బరువెక్కుతుంది. అమ్మ తప్పంతా నాన్నమీద చెప్తుంది. నాన్న తప్పంతా అమ్మమీద చెప్తాడు చాలాసార్లు. ఎవ్వరూ కరెక్ట్ అనిపించరు. ఆ మాటంటే ఇద్దరికీ కోపం వొస్తుంది. ఎవరికి వాళ్ళే తమపక్షానికి లాక్కోవాలని చూస్తారు. ఒక్కోసారి నాన్న చాలా మంచిగా వుండి వొక్కోసారి మహా మూర్ఖంలోకి దిగుతాడు. అమ్మకూడా అలాగే

వొకోక్కసారి దేవతలా కనపడి వొకోక్కసారి రాక్షసంగా ప్రవర్తిస్తుంది. అమ్మ ఆఫీసునించి ఆలస్యంగావస్తే నాన్నకి కోపం వచ్చేస్తుంది. ఏం ఆలశ్యంగావస్తే? ఆవిడకి స్నేహితులూ సరదాలూ ఉండవూ? నాన్న డబ్బెక్కువ ఖర్చుపెడితే అమ్మ రుసరుస లాడుతుంది. డబ్బు ఖర్చు పెట్టుకోవటానికి కాక ఇంకేం చేసుకుంటారు? ఎవరేపని ఎందుకు చేశారో శాంతంగా ఆలోచించుకోరు. ఒకరు చెప్పే కారణాలు ఇంకోరు నమ్మరు. ఆమోదించరు. అసలు ఒకరి ప్రవర్తనమీద వొకరికి గౌరవం ఉండదు. కత్తులలో శూలాలలో విసిరినట్టు మాటలు విసురుకుంటారు రెండోవాళ్ళు విలవిల్లాడేట్టు. ఒకోక్కసారి ఇద్దరూ బద్ధశత్రువుల్లాగ—వొకరి బాధ యింకోరికి ఆనందం కలిగేలాగ, ఒకర్ని వొకరు హత మార్చేలాగ.

అలాంటి వ్యక్తులు భార్యా భర్తలా?....జీవన సహచరులా?.... అంతేకాదు ప్రేయసీ ప్రియులు ఇరవై ఏళ్ళకిందట. ఇద్దరూ ఒకరికోసం ఒకరు—

"మీ నాన్న చూడు. టిఫిన్ చెయ్యకుండానే వెళ్ళినట్టున్నారు."

"ఊ?" అని పరాగ్గా తలెత్తి—"ఉఁ" అని తల దించేసుకుంది సుధ ....

అమ్మకి తనతో మాట్లాడాలని చాలా ఇదిగా వుంది ఇప్పుడు. ఒక్కమాట అడిగితే అంతా చెప్పేస్తుంది. ఇప్పుడేం వినాలనిలేదు— కొందరు మనుషులు ఎదుటివాళ్ళని రేడియోలాగ వుపయోగించుకుంటారు. తమకి వినాలని వున్నప్పుడు మాత్రమే రేడియోని ఆన్ చేసినట్టు పలక రించి....అక్కర్లేనప్పుడు ....

చంద్రశేఖర్ ఇంకా రాలేదేం? ఈపూట నించే వుద్యోగం చేసే స్తున్నాడో ఏవిటో.

తల్లకిందులుగా ఎంత చక్కగా పాకుతుందో చీమ గోడమీద— బల్లమీదికి దిగింది పాపం ఆకలేస్తోందేమో—అరె గాబరాపడి వెనక్కి తిరిగి గోడెక్కుతోంది. టేబుల్ దానికి తల్లకిందులుగా వుందిగావును

నాన్న వ్యవహారంలాగ. వీటికూడా ప్రేమలూ – వర్ణాంతరాలూ .... ఆఫీసులూ – కోపాలూ ....

వాన బాగా తగ్గిపోయిందే. నాన్న క్లబ్బుకి వెళ్ళిపోయాడన్నమాట. కోపంవాస్తే అన్నం మానెయ్యటం.... టిఫిన్ మానెయ్యటం.... అలక.... బెదిరింపు సిల్లీ దేనికి నిజంగా బాధపడాలో, దేన్ని సమస్యగా పట్టించుకోవాలో ఎంత వయస్సొచ్చినా తెలీటం లేదాయనకి.

అందర్లాంటి వాళ్ళుకారే! అదే ఆశ్చర్యం. తనకి రెండేళ్ళ కింద ఎప్పుడో అమ్మా నాన్నా ఏదో వ్రతం చేసినప్పుడు పీటలమీద కూర్చున్న వాళ్ళనిచూసి "ఆది దంపతుల్లా వున్నారు. సీతారాముల్లా వున్నారు" అని మెచ్చుకున్నారు చాలామంది. ఆది దంపతులు పోట్లాడుకుంటారో లేదో! సీత ఆఫీసునుంచి ఆలస్యంగా వాస్తే రాముడేం చేసేవాడు!—"లక్ష్మణా! ఈమెని మెయిలెక్కించిరా!" అంటాడేమో! అది చాలా నయం చెవిలో జోరీగమల్లే సాధించేకన్నా.

అసలు అమ్మని పెళ్ళి చేసుకోవటానికి వీలుగాకపోతే ఆత్మహత్య చేసుకుందాం అనుకున్నాట్ట నాన్న. ఎంత గొప్పగా ప్రేమించాడో! చాలా గౌరవం కలుగుతుంది తల్చుకుంటే. అమ్మకి మేనరికం వుందిట. నాన్నకి వేరే పెళ్ళి అయితే బాగా కట్నం వొచ్చేదిట. పైగా కులాల్లో తేడా. నూతిలో కాళ్ళు పెట్టుకూచుందిట నాన్న తల్లి. అమ్మ వెనకాల ఎన్నో హెచ్చరికలు–కాపలాలు–పాపం ఎంత క్షోభపడ్డారో యిద్దరూ. ప్రేమ అనేది నిజమేనేమో. ప్రేమకి ఏ హద్దులూ ఆంక్షలూ లాభం లేదట. లేకపోతే అంత సాహసం ఎలా ఒస్తుంది? ఆ రోజుల్లో వర్ణాంతర వివాహం అంటే ....

అసలు "వర్ణాంతర" ఏమిటి? శుద్ధ తప్పు. "వర్ణరహిత" అనాలి. కులాలూ మతాలూ పూర్తిగా లేవనుకోవాలి. లేవనే చెప్పారుపైకి. అమ్మా నాన్న చెప్పటంలేదూ? ఆ ప్రేమాకర్షణలో అవేం లేవనుకున్నారుగానీ, యిద్దరి మనసుల్లోనూ ఉన్నాయి ఆ చాదస్తాలు, అమ్మ నాన్న కులంగురించి ఎవ్వరికీ చెప్పదు. ఆమాటే మర్చిపోయింది. ఎవరికన్నా చెప్పాల్సివాస్తే

"బ్రాహ్మలం" అంటుంది. నాన్న ఒప్పుకుంటాడు. నాన్నకికూడా అదే యిష్టం. తను వెళ్ళి గొప్పకులంలో కలిసినందుకు గర్వపడుతోన్నట్టు కనిపిస్తాడు.

అమ్మ, బొత్తిగా అవసరంలేని సమయంలోకూడా ఏదో వీలుచేసుకుని—"మా బ్రాహ్మల్లో పొట్లకాయ పచ్చడి ఇలాగే చేస్తారు" అనేది.

"మా బ్రాహ్మల్లో సంగీతం అంటే పడి చస్తారు."

"మా బ్రాహ్మల్లో...." అని అమ్మ బ్రాహ్మణ పాట పాడుతోంటే నాన్న ఎంత చక్కగా వంతపాడతాడో. వొక్కొక్కసారి ఏం జరుగుతుందో చాలా విసుక్కుంటాడు. "అస్తమానూ ఎందుకా మాటలు?" అంటాడు.

ఒక్కొక్కసారి యింకా కోపం తెచ్చుకుని.

అబ్బ! ఎన్నాళ్ళు మభ్యపెట్టారో తనని.

బొంబాయి రేఖ కొత్తగా స్కూల్లోకి వొచ్చిన్నాడు....పదేళ్ళవుతుందా? ఇంకో రెండేళ్ళు ఎక్కువేనేమో....రేఖ ఎక్కడుందో....ఎంత మంచిదో!....పాపం అంత చిన్నప్పుడు "మీ కులం ఏమిటి?" అంటే—

"బొంబాయి" అంది.

"వూరుకాదు. కులం" అంటే—

"బొంబాయే." అంది.

"ఊరుకాదు మొర్రో. మీ కులం—కులం" అని పిల్లలంతా నవ్వుతోంటే తెల్లమొహం వేసింది. ఆ పిల్ల కులం తెలీకుండా పోతుందేమోనని ఎంత నిరాశపడిపోయారో పిల్లలందరూ! అప్పుడు జానకేనా? అవును దానికే అలాంటి బ్రహ్మాండమైన ఐడియాలు వొచ్చేవి. గుండెలమీద బారుకుంటూ—"ఇలా చూడు. మేము బ్రాహ్మలం," అని పక్కపిల్ల భుజం మీద పొడిచి—"వీళ్ళు నాయుళ్ళు". అని ఇంకోపిల్ల వీపుమీద చరవబోతోంటే ఆ పిల్ల తప్పుకుని—"కోమట్లం" అని చెప్పింది. ఇంకా కొందరు వుత్సాహంగా ఎవరి కులం వాళ్ళు చెప్పుకున్నారు. కొందరు చిన్నమొహాలు చేసుకుని వెనక్కి తగ్గారు. అప్పుడు తనుకూడా చాలా గొప్పగా—"మేం బ్రాహ్మలం" అంది,

ఏదో వుపద్రవం ముంచుకొచ్చినట్టు ఇద్దరో ముగ్గురో తనమీద విరుచుకు పడ్డారు-"ఏయ్ ! సుధా! మీరు బ్రాహ్మలా ? భలే అబద్ధాలు. మీరు అచ్చంగా బ్రాహ్మలే కాదు- మీ నాన్నగారు...."

"ఊఁ మా నాన్న?....ఏవిఁటి మా నాన్న....?"

"మీ నాన్న బ్రాహ్మలేం కాదు కావాలంటే అడుగు." తనకేమిటో విచిత్రంగా వుంది. తనకన్నా వాళ్ళకి తెలిసినట్టు మాట్లాడేస్తోంటే తెల్ల మొహం వేసుకు నించుంది.

అప్పటికి అర్థమైంది రేఖకి అసలు సంగతి.

"ఓహో అదా మీరడిగేదీ? మా కలాంటివి లేవు. ఎప్పుడో మా అమ్మకీ నాన్నకీ ఏవో వుండేవిట. తర్వాత అవన్నీ వొదిలేశారు. ఏమీ లేవని చెప్పేస్తారు మా అమ్మావాళ్ళు" అంది రేఖ.

ఈ సారి ఈ సంగతి మిగతా పిల్లలకి అర్థంకాలా. తనక్కూడా అర్థంకాలా. పిచ్చిపిల్లని చూసినట్టు చూస్తున్నారంతా రేఖని.

"పోనీ అలా చెప్పాలి. అంతేగానీ అబద్ధాలెందుకూ?" అంది జానకి - ప్రపంచాన్ని అబద్ధాలనించి రక్షించే భారం తనదే అయినట్టు.

తనకెంతో సిగ్గేసి ఏడుపొచ్చేసింది.

"అసలు కులం ఎందుకూ? ఏం చేస్తారు దాంతో!" అంటోంది రేఖ జానకితో. జానకేం చెప్పిందో తనేం వినలేదు. కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ పుస్తకాలు పట్టుకుని గేటు దాటింది.

ఇంటికొచ్చి అమ్మని కావలించుకుని బావురుమంది. "మనం బ్రాహ్మలంకామూ అమ్మా? మనం బ్రాహ్మలం కామూ?" అని స్వర్గలోకాల్లోంచి జారుతున్నట్టు ఏడ్చింది.

"ఛ! వూరుకో. ఎందుక్కాదూ ? ఎవరన్నారూ ?" అంది అమ్మ ఆశ్చర్యపడి.

"మా బళ్ళో జానకీవాళ్లు.... నాన్న ఎవరోటకదూ ?" అని మళ్ళీ ఏడ్చింది.

"ఏం? ఎవరో అయితే ఏం పోతుంది? బ్రాహ్మలు కాకపోతే ఏమౌతుంది?" ఇప్పుడైతే అలా ఏడుస్తుందా తను? ఎంత అజ్ఞానంలో వుంచారో తనని. తను తొందరగానే ఆ హద్దుల్లోంచి బయటపడిందిగానీ ఇప్పటికీ అమ్మ....

బాగా జ్ఞాపకం. అమ్మ చాలా చిన్నబుచ్చుకుంది. అప్పుడు- "ఏదో వో కులం అవన్నీ చిన్నపిల్లల కెందుకూ? ఇంకేం పన్లేదా వాళ్ళకి?" .... అని చాలా కోపం తెచ్చుకుంది.

నాన్నకూడా సంగతంతా విని- "అసలా వెధవ బడికి వెళ్లొద్దను" అని నిప్పులు కురిపించాడు.

నిజంగానే బడి మాన్పించాలని ప్రయత్నాలు చేశారు, తర్వాత ఆలోచించినప్పుడల్లా ఎన్ని సందేహాలో! ఎన్ని బళ్ళల్లోంచి ఎన్ని వూళ్ళల్లోంచి పారిపోతాం? అంత తప్పు పనేం చేశాం? తనకి చిన్నప్పుడే నిజం తెలిస్తే తను ఎంత గర్వంగా చెప్పి జానకి నోరు మూయించేది! "నాకు కులమతాలు లేవు. ఏ మూర్ఖత్వాలూ లేవు" అని చెప్తోంటే ఎంత ఆనందంగా వుంటుందో ఎవరికైనా. ఈ ఆలోచనలన్నీ తనకేగానీ అమ్మకీ నాన్నకీ రావా? వాళ్ళ ధోరణి మార్చుకోరేం ?

సుధ మొహం చిట్లిస్తూ కొంచెం తల తిప్పింది.

అమ్మ ఎందుకో కేకలేసి సుబ్బుల్ని చటుక్కున ఏదోతిట్టింది. సరిగ్గా వినపళ్ళేదు. తను వింటుందేమోనని భయమే కొంచెం. ఎన్నిసార్లో వాదిస్తుంది తను ఏం లాభం? మళ్ళీ ఆ తిట్టే. - "నీ శూద్రబుద్ధి పోనిచ్చుకున్నావు కావు" అనే వుంటుంది. తను పోట్లాడితే - "అబ్బ! ఏదో అలవాటై పోయింది లెద్దూ! ఏం ముంచుకు పోయింది?" అంటుంది. ఏదో ముంచుకుపోతూ ఉండాలన్నమాట ప్రతి దానికీ. ఛ! ఏం మనిషి! ఈవిడ కూడా చిన్నప్పుడు జానకిలాగ ... బళ్లో పిల్లలందరి కులాలూ అడిగి వెక్కిరిస్తూ ఉండేదేమో !

"మీ భోజనం విషయాల్లో ఏమి సమస్యలు రాలేదా ?" అని ఎవ

రన్నా అడిగితే "అబ్బే! లేదండీ! లేదండీ! మా వారు దాదాపు బ్రాహ్మణ భోజనమే" అని ఊరుకుంటుంది. నాన్న ఎందుకో మరి చాలాకాలం ప్రయత్నించాడు చేపలూ అవీ తినకూడదని. అసలు ఎందుకు ప్రయత్నించాలి? ఒకరి కిష్టమైన ఆహారం ఎందుకు మార్చుకోవాలి? - బ్రాహ్మణ భోజనం కీర్తికన్నా నాన్నని చేపలరుచి జయించింది.

తనకి చిన్నప్పట్నించీ కోడిగుడ్లవీ తినటం అలవాటు లేకపోయినా సుశీలా వాళ్ళింట్లో ఆమ్లెట్ల రుచే తన అలవాట్లని కూడా జయించింది. అమ్మకి చెప్తే అమ్మ కోపం చూడాలి. "ఆ బాబుకి తగ్గకూతురు వయ్యావు" అంది చాలా అసహ్యించుకుని.

"నీ యిష్టం నీకేది యిష్టమైతే అదే తిను" అని అమ్మ చాలా శాంతంగా చెప్తే నిజంగా తను అమ్మ యిష్టానికి వ్యతిరేకంగా చేసేది కాదు. అమ్మలకి అంత చిన్న విషయాలు తెలిస్తే పిల్లల్ని కట్టిపడేసుకోవటం ఎంతసేపు?

మళ్ళీ స్నేహితులు. ఇతర్లో ఎవరన్నా పలకరిస్తే ఎన్ని కబుర్లో — వర్ణాంతర వివాహం ... సంఘ సంస్కారం.... సింగినాదం బోలెడు. ఇదిగో అమ్మాయ్! ఇంత తలబద్దలు కొట్టుకోవటం ఎందుకు? వర్ణాంతర వివాహానికి అర్థం కులాల మూర్ఖత్వంనించి బయటపడటం కాదు. 'చిన్నకులం చాలా వినయంగా పెద్దకులం' ముందు మోకరిల్లుతుంది. పెద్దకులం అప్పుడప్పుడూ కళ్ళు దించి చూసి —"ఓహో నువ్వా? సరే అల్లా పడివుండు" అని హడావుడిగా ఏ సంఘ సంస్కార సభకో, వుద్యమానికో - ఇంకో వర్ణాంతర వివాహానికో పోతూవుంటుంది అర్థమైందా? చాలా సింపుల్. ఎవరిది సంఘంలో పెద్దకులం అయితే అది ఆ యింట్లో చలామణి అవుతూ వుంటుంది. అదన్నమాట. సరే! తెలిసింది. - మరి రేఖా వాళ్ళింట్లో.... ఆ ఎక్కడో...."అంత నిద్రొస్తోంటే ఆ పాలు తాగేసి వెళ్ళి పడుకోరాదూ? తల తడిగా వుంది. తడుచుకో బాగా."

సుధ పాలగ్లాసు అందుకుంది తలెత్తి. చంద్రశేఖర్ వుప్మా తింటున్నాడు.

"అరె! ఎప్పుడొచ్చారు మీరు?"

"ఇప్పుడే –" ముభావంగా వున్నాడు. రెండు నిమిషాల్లో కాఫీ కూడా పూర్తిచేసి వెళ్ళిపోయాడు గదిలోకి.

సుధ పాలగ్లాసు టేబుల్‌మీద పెట్టేసి తుడుచుకుంటూ వెళ్ళేసరికి అతను బట్టలు సర్దుకుంటున్నాడు.

"ఏమిటి హడావుడి పడుతున్నారు?"

"నేను వెళ్తున్నానండీ."

"ఎక్కడికి?"

మాట్లాడలేదు. ఏవేవో కాయితాలు సూటుకేసు అడుగున పెట్టాడు. దుప్పటీ మడత ప్రారంభించాడు.

"మీ ఇంటర్వ్యూ ఏమైందండీ?" సంకోచంగానే అడిగింది.

"ఏమౌతుందో అదే అయ్యింది."

"అంటే?"

"రాలేదండీ"– విసుగ్గా అన్నాడు. కానీ అది నిశాశ. దుప్పటి మడతలు ఆపి–"ఉద్యోగాలు రావని తెలిసికూడా రెండేసి మూడేసి వందల మైళ్ళనించీ ఇంటర్వ్యూల కొచ్చే మూర్ఖుల్ని ఏమనాలి? సర్లెండి బ్రతకటం సమస్యకాదు. రిక్షా లాక్కోవొచ్చు. లారీ తోలుకోవొచ్చు" దుప్పటి సర్ది చౌకా తీసుకున్నాడు మడతలకి.

సుధకి ఏమనాలో తోచలేదు. పరిస్థితి కొంచెం తేలిక పరచటానికి నవ్వి –"రిక్షా లాక్కోటానికి ఇంజనీరింగ్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చెయ్యాలా?" అంది.

"అది అప్పుడర్థం కాలేదు"- అతను పైకి ఏడవలేదు అంతే. ఎంత బాధ-దుఃఖం బిగబట్టుకున్నాడో ఆ కంఠంలోంచి పలికే వాక్కు-శబ్దం వింటే చాలు. కళ్ళు తడితడిగా మెరవటం కూడా చూసింది సుధ. మనసంతా .... పూర్తిగా అతని కోసం .... చాలా దిగులు కలిగింది. వచ్చిన్నాడు అతని బట్టలూచేతిలో పాతపెట్టీ నలిగిపోయిన చెప్పులూ చూస్తే అతని పేదతనం

స్పష్టంగా తెలిసిపోయింది. దానికతను ఏమీ సిగ్గుపడకుండా ప్రవర్తిస్తాడు. అతను తెచ్చుకొన్న దుప్పటికీ తువ్వాలుకీ ఎన్ని కుట్లో! వచ్చిం తర్వాత వరసగా నాలుగు రోజులు ఒక్క చొక్కాయే వేసుకున్నాడు - "కర్ణుడికే కాదు ఇతనికూ్కడా కవచం వుంది" అని నవ్వుకుంది తను. ఆ పేద తనం అతని బట్టలకీ చెప్పులకేగానీ స్వభావానికీ ప్రవర్తనకీ ఎంత మాత్రం లేదనిపిస్తోంది చూస్తోన కొద్దీ.

అతను సూట్‌కేస్ మూసి లేచాడు.

"అయితే నిజంగానే వెళ్తున్నారా?" అంది సుధ తనకేమీ ఇష్టం లేనట్టు.

"మరేం చెయ్యమంటారు? ఇప్పటికే వారం రోజుల్నుంచీ మీ ఇంట్లో...."

"ఎప్పుడు పోదాం అనిపిస్తోందా మా ఇల్లు?"

నిరుత్సాహంగా నవ్వాడు–"వొచ్చినపని అయిపోయింది కదండీ!"

"ఎక్కడైంది? ఇది రాకపోతే నాన్న ఇంకెక్కడో ప్రయత్నిస్తా నన్నారుగా? ఇంత తొందరపడివెళ్ళి మీ వూళ్ళోకూచుని ఏం చేస్తారు!"

"ఎప్పటికప్పుడు అర్థంలేని ఆశగానీ ఎందుకండీ, ఆయనకి ఇబ్బంది...."

"ఇబ్బందా? మనం చెయ్యగలిగే పని చేసిపెట్టడం ఏం ఇబ్బం దంట? పోనీ ఇబ్బందైతే మీకు వుద్యోగం వొచ్చినప్పుడు ఆయనకి ఎంతానందం కలుగుతుందో కూడా ఆలోచించండి."

అతను మాట్లాడలేదు.

"మీరేమైనా అనుకోండిగానీ యితర్లకి సహాయం చేసి ఆనందపడే వాళ్ళే ఇతర్లని నమ్మి సహాయం తీసుకోగలరు. నా చిన్నప్పుడు మావూళ్లో వొక గడ్డంతాత ఉండేవాడు. మమ్మల్నందర్నీ ఎప్పుడూ ఎత్తుకుంటూ నవ్విస్తూ ఆడిస్తు సంతోషపడేవాడు. కంట్లో నలకతీసి-కాల్లో ముల్లుతీసి-"బాగుందా ఇప్పుడు? నెప్పి పోయిందా ఇప్పుడు?" అని అడిగి అడిగి

సంతృప్తిపడేవాడు అసలు సహాయం అన్నమాటవస్తే నా కెప్పుడూ ఆ తాత గుర్తొస్తాడు. మనం చేసేవి కూడా సహాయాలేనా ?"

చంద్రశేఖర్ చాలా మొహమాటంగా—"రేపు వెళ్తానులెండి"అన్నాడు.

సుధ కొంచెం నవ్వి—"రేపటికి జరిగారు కదా ?" అంది.

"కాదులెండి. రేపు వెళ్ళిపోవాలి."

"అబ్బ ! రేపు సంగతి మర్చిపోండి. ముందు మీరు స్నానంచేసి రండి. మనం బయటికి వెళదాం."

"ఎక్కడికి ?"

"అలా అడగాలా? మీరు రమ్మంటే నేనలా అడగను. మనకేమీ యిబ్బందిలేని విషయాన్ని వూరికే ప్రశ్నించి తర్కించకూడదు."

"సర్లెండి. మీ ఫిలాసఫీతో నే నెక్కడ మాట్లాడగలను !" అని బట్టలు తీసుకుని స్నానానికి బయల్దేరాడు.

* * *

వానకురిసి వెలిసిన ఆకాశానికి కుంకం రంగులొచ్చాయి. ఆధ్రుత కొద్దీ బొమ్మలు వేస్తోన్న కొత్త చిత్రకారుడు ప్రయోగాలు చేసి సరికొత్త రంగులు తయారుచేసినట్టు ఆకాశం విచిత్రంగా మెరుస్తోంది—"ఈ రంగులన్నీ మీ రెప్పుడన్నా చూశారా?" అంది సుధ ఆశ్చర్యంగా.

"చాలాసార్లు వాన వెలిసిపోయిం తర్వాత ఆకాశం ఇలాగే వుంటుంది."

"ఏమో! నాకెప్పుడూ చూసినట్టు లేదు. చెట్లకీ గడ్డికీకూడా కాంతు లొచ్చాయి. ఈ మెరిసే నీరెండనీ – నీటి చుక్కల్ని కూడా ఎంత గొప్పగానో వర్ణిస్తారు కదా కవులు ? మనకా అదృష్టంలేదు."

"చూసి ఆనందించటమే మన అదృష్టం. నీరెండ పడి చెట్లన్నీ వొకవేపు తళతళ మెరుస్తున్నాయి. ఇంకా ఆకుల్లోంచి నీటి బొట్లు రాలు తున్నాయి. వాలుగాపడ్డ చెట్ల నీడల మీదనించి నడుస్తూ—"చూడండి. చెట్లన్నీ నేలమీద పడుతున్నాయి విశ్రాంతికి." అన్నాడు సుధ మొహం చూస్తూ. అలాంటి భావనలు ఆమెకి చాలా ఇష్టం అని తెలుసు అతనికి.

"అవును. అందంగా చెప్పారు" అంది సుధ— "ఈ వాన కడిగిన రోడ్లన్నీ చూస్తోంటే మీకో కథ గుర్తు రావటం లేదూ?" అని అతని మొహం చూసింది. "చాలా కథలున్నాయి. మీ కథ చెప్పండి ముందు—"

"రావణాసురుడి రాజ్యంలో రోజూ చీకట్నే గాలిదేవు డొచ్చి నేలంతా తుడిచేసే వాడంట. తరువాత వానదేవుడొచ్చి చక్కగా నీళ్ళు చల్లేవాడంట. తర్వాత...."

"ముగ్గు దేవుడొచ్చి...."

"కాదులెండి. ముగ్గులు అందంగా వాళ్ళే పెట్టుకునేవారు."

"ఇంతకీ మనం...." చటుక్కున ఆగాడు—"వెళ్తోం దెక్కడికి?" అని అతను అడగబోయిన ప్రశ్న.

"జడుసుకోకండి. మిమ్మల్ని నేనే కీకారణ్యాల్లోకి తీసుకెళ్ళను. అక్కడకూడా మనుషులుంటారు. రోడ్డు పొడుగునా లైట్లుంటాయి. బస్సు లెప్పుడూ తిరుగుతుంటాయి."

ఛః ఛః అదేంకాదు. ఇంక నేనేం అడగను. చూడండి."

"పైకి అడక్కపోవటం కాదు మనసులోకూడా ఆడగాలనిఅనుకో కూడదు" అంది సుధ తర్కంలోకి దిగటం తనకి చాలా సరదా అయినట్లు. "మనసు సంగతి మీకెందుకు? మీ వెంట నడిచి వొస్తున్నాను కదా?"

"కొందరు మనల్ని మీ కులం ఏమిటని స్పష్టంగా అడగరు. కానీ మన కులం తెలుసుకోవాలని మహా యాతనపడుతూ వుంటారు. పైకి చెయ్యకూడదని వొదిలేసినపనులకి మనసులోకూడాఘర్షణవుండకూడదు."

"చాలా అన్యాయం అండీ ఇది. ఎక్కడికో చెప్పకుండా తీసుకు పోవటం కాకుండా పైగా మనసులో అనుకోకు ఆత్మలో అనుకోకు అని ఆంక్షలు కూడానా?"

సుధ రాజీకొచ్చి—"ఇంకెక్కడికైనా తీసికెళ్తే నా పరువు పోగొడ తారు కూడాను. ఇక్కడికేనండీ బాబూ! చక్కటి పార్కువుంది. కాస్సేపు కూచున్ని మీ కేమన్నా సినిమా పిచ్చి వుంటే సెకండ్ షో చూసి...."

"మీ అమ్మగారూ నాన్నగారూ ఏమన్నా అనరూ ?"

"అంటారు. అనకపోతే అమ్మలూ నాన్నలూ ఎలా అవుతారు ? మాట్లాడకుండా పోయి పడుకుంటే సరి."

"అంతేగానీ సినిమా మానకూడదన్నమాట."

"జడిసి మానకూడదు."

"మరి తల్లిదండ్రుల్ని గౌరవించటం అదేనా ?"

"ఓస్! మీకేం తెలీదన్న మాట. తల్లిదండ్రులకి మనం గౌరవించడం అక్కర్లేదు. గౌరవిస్తోన్నట్టు కనపడ్డం కావాలి."

"చాలా అన్యాయం మీరు ?"

అన్యాయానికి అన్యాయంగాక ? ఈ చెంపమీద కొడితే ఆ చెంప ఇవ్వండి. అప్పుడన్నా వాళ్ళు మండి కలబడక తప్పదు మీరు. కాలేజీల్లో యూనివర్శిటీల్లో చదివి పరీక్షలు పాసై వుద్యోగాలు చేస్తు తమంత అయిపోయిన వాళ్ళమీద కూడా ఈ తల్లిదండ్రులు పెత్తనం సాగిస్తారు. అసలు పెత్తనం అంటే మూడుకాళ్ళ సిద్ధం మన అమ్మలూ నాన్నలూ అన్నలూ- భర్తలూ - అత్తలూ లిస్టు చాలా పొడుగు లెండి. మొన్న మా క్లాస్‌మేట్ ఒకమ్మాయి పెళ్ళికి ఇంట్లో ముసలమ్మ దగ్గర్నుంచి ఇరుగు పొరుగు పంచదార బంధువుల వరకూ వ్యతిరేకించారు. మీ దిక్కున్న చోట చెప్పుకోమని ఆ అమ్మాయి రిజిష్టర్ మేరేజ్ చేసుకుని వెళ్ళిపోయింది. అప్పుడేం చేస్తారు వీళ్ళు ! .... పిల్లలు లెక్కలేకుండా తిరస్కరించి వెళ్ళిపోయే వరకూ తెచ్చుకుంటారు. సిగ్గెయ్యదేం పెద్ద వాళ్ళకి ? అసలు పిల్లల ప్రవర్తన మీద పెద్ద వాళ్ళకి విశ్వాసం వుండదు ఎందుకండీ ?....సర్లెండి ....విసిగిస్తున్నాను మిమ్మల్ని."

"ఛ విసుగేం కాదు. చెప్పండి సరదాగా వుంది."

"సరదాగా వుందా నేనింత సీరియస్‌గా చెప్తోంటే ?"

"అందుకే సరదాగా వుంది'' అన్నాడు నవ్వుతూ.

"అధికాధ్ధండీ ! మనం సినిమాచూసి ఆలస్యంగా ఇంటికెళ్తాం అను

కోండి. కారణం అడిగి అలాగా? అని వూరుకుంటే నిజంగా ఎంత గౌరవం కలుగుతుందీ పెద్దవాళ్ళమీద! ధాం ధూంఅని గంతులేసి పోట్లాటకి దిగితే పైకి భరించినా ఎంత చీదర మనసులో, వాళ్ళ తిట్లకి వినయంగా తల వొంచుకు్కుచుంటే తమ పెద్దరికం నిలిచిందని ఎంత మురుస్తారో! దాన్ని వూడగొట్టటానికి వొక్క క్షణం పట్టదు. జాలిపడి నిలబెడతాం గాని...."—ఆగి చంద్రశేఖరం మొహం చూసింది.

సుధ ఎందుకంత తీవ్రంగా మాట్లాడుతుందో అతనికి ఆశ్చర్యంగా వుంది, మౌనంగా నడుస్తున్నాడు.

"మీరింకా ఇంటర్వ్యూ సంగతి ఆలోచిస్తున్నారా!"

"ఏ ఇంటర్వ్యూ సంగతి?....ఓహో అదా?"

"అబ్బే! లేదండీ! అలవాటైపోయింది? ఏం చేస్తాం? ఈసారి నిజంగానే ఈ ప్రయత్నాలన్నీ మానెయ్యాలి. మా ఊళ్ళో ఇంటర్వ్యూ కార్డులుకూడా రాని పి. హెచ్. డి. వున్నాడు తెలుసా?"

"నిరాశలూ, కష్టాలూ అందంగా వుంటాయని ఎవ్వరూ అనరు గానీ....భరించాలి. లేకపోతే విప్లవాలు తెచ్చుకోవాలి. అంత శక్తి మంతులం అయ్యేవరకైనా దీన్ని భరించాలి."

"భరిస్తాం. ఇంకోదారిలేదు. కాబట్టి అదే చేస్తాం. కానీ ఎంతశక్తి-ఎంత వుత్సాహం-ఎన్ని తెలివితేటలు వృధా అయిపోతున్నాయో తప్పుదారికి మళ్ళుతున్నాయో మనవూహకి అందదు. నేనే ఉన్నాననుకోండి.కొంచెమైనా ఆదర్శంగా బ్రతకాలనే ప్రయత్నిస్తాను. కానీ, ఎన్నాళ్ళు నిలుస్తుందీ పళ్ళ బిగువు? ఖండఖండాలుగా తెగిపోవాలి నేను. విలువుదోపిడీ ఇచ్చెయ్యాలి ఆదర్శాలకి. ఏ మనిషైనా ఎన్నాళ్ళు నిలబడతాడు నీతికి? ఎక్కణ్ణించి వొస్తుంది అంత ఆత్మబలం? నాకు తెలిసిన వొకాయన దొంగనోట్ల వ్యవహారంలో తిరుగుతూంటాడు. బోలెడు సంపాదించాడు. పోలీసులకి తెలిసి కూడా వూరుకుంటారు. అలాంటివన్నీ చూస్తూ ఈ ఉద్యోగాలకోసం ఎందుకు ప్రాధేయపడాలి? ఈసారి నేను ఆయన్ని కలుసుకునిమాట్లాడాలి."

"అందరికీ పనులు చూపించే పథకాలెందుకు వెయ్యదీ ప్రభుత్వం!"

"డబ్బు లేదంటారు."

"ఏమౌతోంది డబ్బంతా?"

"అదంతా అర్థంచేసుకుంటే భరించలేం. మన అసమర్థతమీద మనకే సిగ్గేస్తుంది."

ఇద్దరూ చాలా దిగులుపడుతూ మౌనంగా నడిచారు.

"ఇక వొచ్చే సంవత్సరంనించీ ఈ ఇంటర్వ్యూలూ, ఆశా నిరాశలూ నాక్కూడా అర్థమౌతాయి" అంది సుధ.

"మీరు వుద్యోగం చేస్తారా? ఎందుకూ?" అన్నా డతను ఆశ్చర్య పడుతూ.

"ఎందుకేవిటీ? బ్రతకటం ఎలాగ? దొంగనోట్ల వ్యాపారంలో నన్నుకూడా చేర్చుకుంటారా?" అని నవ్వింది.

"మీకేం ఖర్మండీ? — ఏ డాక్టర్నో — ఆఫీసర్నో పెళ్ళి చేసుకుంటే బ్రతకటాని కేం లోటు?"

"ఛీ! ఛీ! పెళ్ళిచేసుకోవటం బ్రతుకుదెరువుకోసమా? మంచివారే! — మీరుకూడా అలాంటి మాటలేనా!"

అతను నవ్వి—"రెండు చిక్కు సమస్యలు పెట్టారు మీ వాక్యంలో. 'మీరుకూడా' అంటే. "మీరు"కి ప్రత్యేక తేమిటి? అలాంటి మాటలేనా? అంటే ఆ మాటల్లో దుష్టత్వం ఏమిటి? చెప్పండి ముందు" — అన్నాడు.

సుధ దారిమార్చి విరిగిపోయిన గేటులోంచి గతుకులుపడ్డ దారిలోకి నడిచింది.

దూరంగా చాలా చెట్లు కన్పిస్తున్నాయి. చుట్టూ ఫెన్సింగ్ తెగిపోయి వుంది. అక్కడక్కడా సిమెంటు అరుగులు పెచ్చులూడి ఇటికలు బయటికి కనిపిస్తున్నాయి. వర్షంపడ్డ నేలంతా తడితడిగా నీళ్ళు నిలిచివుంది. పచ్చగడ్డి వొత్తుగా వెరిగి కాళ్ళకింద మెత్తగా వుంది.

"మొన్నొకసారి ఇటు వెళ్తూ చూసి ఇదేదో చిట్టడవి అనుకున్నానే" అన్నాడు చంద్రశేఖర్.

"ఇది సినిమాల్లో పార్కులాగ షోగ్గా వుండదని ఎక్కువమంది రారు ఇక్కడికి, అధికారులుకూడా దీని సంరక్షణ వొదిలేశారు."

"అయితే ఇదికూడా పార్కేనా? నయం ఉద్యానవనం అన్నారు కాదు. మొత్తంగా అడవిలోకి తీసుకువచ్చారు నన్ను.

"అడవుల్లో జీవితం ఎలా వుంటుందో తెలియదుగానీ - ఇక్కడ వెన్నెల రాత్రుల్లో చెట్ల కిందనించి మాట్లాడుకుంటూ నడుస్తోంటే ఎంత ఆనందంగా వుంటుందో చూడండి ఇవ్వాళ."

"పులులూ అవీ వుండవూ ఇందులో?"

"ఉంటాయి. మొన్న జ్యూ నించి ఒక సింహం తప్పించుకొచ్చి యిందులో పడిందంటున్నారు. మీరు వేటాడతారనే తీసుకొచ్చాను."

చెట్లకింద నేల కొంత పొడిగావుంది. చాలాదూరం నడిచి మంచి చోటు చూసి కూర్చున్నా రిద్దరూ. చెట్టు కొమ్మల పైనించి ఆకాశం కన పడటంలేదు. వెన్నెల అక్కడక్కడా జారుతోంది. సుధ వెన్నెల్లోకి జరిగి కూచుంది—"అసలు మీకో విషయం చెప్పాలని బయల్దేరాను!"

"మధ్యలో రావణాసురు డొచ్చాడు."

"ఒదిలేశాంగా ఆయన్ని!"

"అయితే చెప్పండి తొందరగా, నా కసలే దడగావుంది. ఈ కారడవిలో కూచోటం."

"మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు. సింహం వొస్తే ముందునన్ను తిని...."

"తర్వాతైనా నన్ను తింటుంది కదా?"

అంతలో పారిపోలేరూ మీరు?"

"అది నా వేపునుంచే ఒస్తే?"

"అప్పుడు ఇబ్బందే మరి" అని నవ్వింది.

"చూశారా? అంచేత మీ వాగ్దానాలు నమ్మి కూచున్నాననుకోండి. కానివ్వండి, ఏదో చెప్తానన్నారుగా?"

"ఉపోద్ఘాతాలూ ముందు మాటలూ ఏమీ లేకుండా చెప్పెయ్యనా?"

"చెప్పెయ్యండి. అవన్నీ నేను రాసుకుంటాను."

"అయితే సరే—మా బళ్ళో ఓ పంతులుగా రున్నారు. అంటే అర్థమైందా?"

"మీ కాలేజీలో లెక్చరర్ అన్నమాట. పాపం ఆయనేం చెయ్యబోతున్నారు?"

"ఛ! ఏమీ చెయ్యలేదండి. క్లయిమాక్స్ సీను చెప్పేస్తున్నాను. ఆయనకి నామీద చాలా ప్రేమ పుట్టిందట. పెళ్ళిచేసుకోవాలని వుందిట, అటో ఇటో తేల్చి చెప్పెయ్యమని దారికడ్డంగొట్టి అడిగాడు."

"ఎటు తేల్చారు మరీ?"

"తిన్నగా ఇంటి కొచ్చాను."

"ఏం ఇష్టంలేదా ఆయనంటే?"

"ఆయనంటే ఇష్టమే. ప్రేమంటే ఇష్టంలేదు."

"ఏవిటో తిరకాసుగా వుంది మీ వ్యవహారం."

"నాకూ అలాగేవుంది ఆయన వ్యవహారం. అసలు ఈ ప్రేమల్లో మీకేమైనా నమ్మకం వుందా?"

"అందులో మాత్రమే వుంది."

"అయితే మనం చాలా వాదించుకోవచ్చు."

"మీకు పుణ్యం వుంటుంది. అందులోకి దించకండి. మీ లెక్చెరర్‌కి ఏం చెప్పారో చెప్పండి."

"ఏం చెప్పలేదు. ఏం చెప్పాలో తేల్చుకోలేదింకా."

చంద్రశేఖర్ తర్వాతేం అడగలేదు.

సుధ కూడా ఆలోచనల్లో పడింది. కొంతసేపు వూరుకుని — "అసలు దేవదాసుకీ, పార్వతికీ పెళ్ళయితే వాళ్ళ జీవితం ఎలా వుండేదంటారు?" అంది.

చంద్రశేఖర్ తెల్లబోయాడు—అదేం ప్రశ్న అన్నట్టు ఆశ్చర్యంగా చూస్తూ "దేవదాసుకీ పార్వతికీనా? పెళ్ళా? అసలెలా అవుతుంది?" అన్నాడు.

"దేవదాసే పెద్దవాళ్ళని ధిక్కరించాడనుకోండి."

"అలా అయితే యింకేం? చాలా బావుంటుంది."

"బావుంటుందా?—అలాక్కాదు. సరిగ్గా ఆలోచించి చెప్పండి."

అతను నవ్వి—"ఏమీ బాగుండదంటే సరిగ్గా ఆలోచించినట్టా?" అన్నాడు.

సుధకూడా నవ్వి – "మీ రసలు కాస్సేపు ఆలోచించి తర్వాత చెప్పండి" అని మొరాయించింది.

"మీరిప్పుడు హఠాత్తుగా అడిగితే ఆశ్చర్యం వేసిందిగానీ, ఇందులో కొత్తగా ఆలోచించటాని కేముంది? ఈ వాదోపవాదాలన్నీ చాలాసార్లు అయిపోయాయి లెండి. వాళ్ళ ప్రేమమీద నాకేం సందేహం లేదు."

సుధ వెటకారంగా చూసింది – "అంత గొప్ప ప్రేమయితే మరి పెళ్ళెందుకు చేసుకోలేదు?"

"పెళ్ళి చేసుకోలేక పోయినంత మాత్రాన వాళ్ళ ప్రేమని శంకిస్తారా మీరు?" అని కొంచెం విసుక్కుని వెంటనే తమాయించుకుని—"ప్రేమకి సార్థకత కలిసి జీవించటమే అనుకోండి. కానీ అది అసంభవమైతే మనసుల్లో ప్రేమ అంతా అబద్ధమేనా? దేవదాసూ పార్వతీ విడిపోయారని నాకెప్పుడూ అనిపించదు" అని ఇక దానికి తిరుగులేదు అన్నట్టు వూరుకున్నాడు.

సుధ తెగ ఆశ్చర్యపడి విచిత్రంగాచూస్తూ—"వాళ్ళిద్దరూ విడిపోనే లేదూ? కలిసే ఉన్నారా?ఎక్కడా? అంతరాత్మల్లోనా? ఆహా! ఏం వేదాంతం మాట్లాడుతు న్నారండీ! శరీరాలు విడిపోయి జీవితాలే వేరయిపోయి—ఇష్టంలేని కాపరాలు చేసి మనసుల్నిండా దుఃఖంతో యౌవనం అంతా మహా అసంతృప్తితో—జన్మలే వృధా అయిపోతే—ఎవర్నో ఎక్కడో ప్రేమించాం అన్న వూహవల్ల వారిగే సుఖం ఏమిటో? మనసుల్లో చాలా గొప్ప ప్రేమ కలిగి ఏ విధానా ఒకరి జీవితంతో వొకరికి సంబంధం లేకండా బ్రతికితే వొక్క క్షణం అయినా శాంతి కలుగుతుందా? మరి దేవదాసూ పార్వతీ తమ ప్రేమనే తల్చుకుంటూ ఇద్దరం కలిసే వున్నాం

అనే వూహతో సుఖంగా వుండలేకపోయారేం? ఈ ప్రేమించుకునే వాళ్ళంతా అమ్మలమీదా నాన్నలమీదా సంఘాలమీదా తిరగబడి ఏడ్చి, గోలపెట్టి ఆత్మహత్యలకూ్కడా సిద్ధపడతారేం? కలిసి జీవించాలని అంత కొట్టుకుంటారు, అదంతా అర్ధంలేని వ్యవహారమేనా ?"

"మీ లెక్చెరర్‌ని వొదిలేసి ఇందులో పడ్డారేం?" అని నవ్వాడతను.

"మీరలా తప్పించుకోకండి మరి. ఈ ప్రేమ వ్యవహారాల్లో నాకు చాలా సందేహాలున్నాయి. దేవదాసు ప్రేమమీద నేనో వ్యాసంకూడా రాశాను."

"ఏం రాశారు!" నవ్వుతోనే అడిగాడు.

"మీకేవిటో హేళనగావుంది నా రీసెర్చిమీద, మీరు నా సందేహా లన్నీ తీర్చేస్తే నా అభిప్రాయాలు మార్చుకుంటానుగా?" అని మళ్ళీ తర్కంలోకి దిగింది.

—"అసలు పార్వతి అంత సాహసంగా అర్ధరాత్రి వొచ్చి అడక్క పోతే దేవదాసుకి ప్రేమా గీమా ఏంలేదు. ఇంకా చదువుకునేవాడు. జమీందార్ల పిల్లని పెళ్ళిచేసుకునేవాడు. ఎప్పుడన్నా పార్వతి కనిపిస్తే— 'బాగున్నావా పార్వతీ?' అని పలకరించేవాడు. అంతేనా?"

"నేనలా అనుకోను. పార్వతివొచ్చి అడక్కపోయినాసరే—పార్వతికి పెళ్ళయి వెళ్ళిపోయింతర్వాత దేవదాసు మానసికంగా చాలా బాధ పడేవాడు. ఆమెతో అతనికి ఆ రకం స్నేహం వుంది. ఆత్మీయత వుంది— ఇష్టం వుంది."

"ఎన్నివున్నా అదంతా ప్రేమకాదు. చాలా తొందరగానే మర్చిపోయేవాడు."

"సరే అలాగే అనుకోండి. పోనీ పార్వతి అడిగింతర్వాతే అతనికి ప్రేమ తెలిసింది. కొందరు చాలా చిన్నతనంనించే ప్రేమని అనుభవిస్తారు. కొందరికి కొంచెం పెద్దవయస్సులోగానీ అది అర్ధంకాదు. కొందరు జీవితంలో ఎన్నడూ దాన్ని ఎరగరు. చిన్నప్పుడే ప్రేమ కలగకపోవటం దేవదాసు తప్పా? పార్వతి ఆ ప్రసక్తి ఎత్తకపోతే—ఆమెను తొందరగా మర్చిపోతే తర్వాత ఇంకెవరిమీదన్నా అతనికి చాలా గాఢంగా ప్రేమ

కలిగేదేమో? పార్వతే అతని మనసులోకి ప్రేమ వూహ తెచ్చింది. నిజమే. అతని ప్రేమ ఎప్పుడు ప్రారంభమైతేనేం? ఎలా ప్రారంభమైతే నేం?— మీ లెక్చెరరు మిమ్మల్ని ప్రేమిస్తోన్నట్టు—మీతోనే జీవించాలనే కోరిక వున్నట్లూ చెప్పారనుకోండి. ఆ క్షణంనించీ ఎంతో కృతజ్ఞతతో మీకూ అవతలి వ్యక్తి మీద ప్రేమ కలగవొచ్చును కదా? ఆ క్షణంనించీ వొకరికోసం వొకరు తపించవొచ్చునుగదా? ప్రేమని ఎవరో ఒకరే ముందు బయట పెడతారు. రెండోవారు తర్వాత దాన్ని గురించి శ్రద్ధగా ఆలోచిస్తారు. అడిగిన వ్యక్తికి ప్రేమ వుందనీ—రెండో వ్యక్తికి లేదనీ మనం అనుకుంటామా?"

సుధ అతని మాటలన్నీ శ్రద్ధగా విని అంది. "మనం కథ ప్రకారమే మాట్లాడుకోవాలి. దేవదాసు ప్రేమ అంతా పార్వతికి పూర్తిగా దూరం అయిపోయాక ప్రారంభమైందే. కలిసి జీవించటానికి వీలున్నంతకాలమూ పార్వతే కావాలని అతనికేమీ పట్టుదలలేదు. — అలాంటి పరిస్థితిలో పార్వతి అడిగిందికదా అని—ఆ అమ్మాయితో వున్న స్నేహంవల్ల అతను తల్లిదండ్రుల్ని లక్ష్యపెట్టకుండా పార్వతిని చేసుకుంటాడే అనుకుందాం.."

చంద్రశేఖర్ మధ్యలోనే అడ్డొచ్చాడు—"పెద్దవాళ్ళని ధిక్కరించాడూ అంటే అతనికి అంతర్గతంగా ప్రేమ వున్నట్టే. ఆ ప్రేమే అంత శక్తి ఇచ్చిందనుకోవాలి."

"అయితే పెద్ద వాళ్ళని ధిక్కరించలేదు కాబట్టి అలా చేయించగలిగేంత ప్రేమ లేనట్టేనా?"

"ఉంది. అది అప్పటికి బయటపడలేదు."

"కానీ పెద్దవాళ్ళని లక్ష్యపెట్టకుండా చేసే పనులన్నీ గొప్ప ప్రేమతో విశ్వాసంతో మాత్రమే చేస్తారను కుంటున్నారా?—జూదాలాడే వాళ్ళూ—తాగి తందనాలాడేవాళ్ళూ తల్లిదండ్రుల్ని ధిక్కరించటంలేదా? వాటివల్ల హాని తెలిసి తర్వాత పశ్చాత్తాపపడటంలేదా? దేవదాసు అన్న పెద్దవాళ్ళకి అయిష్టం కలిగేటట్టు ప్రవర్తించలేదా?—మంచికో చెడ్డకో— వాళ్ళు చేసే పనులమీద వాళ్ళకే గౌరవంవున్నా, లేకపోయినా పిల్లలెప్పుడూ

పెద్దవాళ్ళని నిర్లక్ష్యం చేస్తోనే వుంటారు. సృష్టిలో అది చాలా సహజంగా జరగాల్సిన పని. లేకపోతే మానవజాతిలో శక్తి—వుత్సాహం చాలా తొందరగా నాశనం అయిపోతాయి. పెద్దవాళ్ళని ధిక్కరించినంత మాత్రాన అదే ప్రేమకి గొప్ప నిదర్శనం కాదు. 'ఏ దృష్టితో ఆలోచించి ఆ పనికి సాహసించారు?' అని మనం తేల్చుకోవాలి.

"దేవదాసు సాంఘిక దృష్టితో ఏమీ ఎదగలేదు. తాత్కాలికావేశంతో అతను పార్వతిని పెళ్ళిచేసుకున్నా తర్వాత జరిగే కష్టనష్టాలకి నిలబడలేదు. అతని తల్లిదండ్రులు పార్వతిని గౌరవించరు—పైగా కక్ష కడతారు. గొప్పింటి బంధువులతో దేవదాసు ఇంటికి రాకపోకలుండవు. దేవదాసుకి హోదాలూ, మర్యాదలూ తగినట్టుగా జరగవు. క్రమంగా అతను పార్వతిని పెళ్ళిచేసుకోవటం అప్రతిష్ట పనిలాగా భావిస్తాడు. ఎప్పుడో ఏ కోపంలోనో—ఏ తొందరలోనో—కులం తక్కువదాన్ని పెళ్ళి చేసుకున్నాననీ—తన వాళ్ళందర్నీ ఒదులుకున్నాననీ తప్పకుండా ఈసడిస్తూ ఉంటాడు. పార్వతి చాలా నొచ్చుకుని 'ఈ పెద్దింటి సంబంధం ఎందుకు చేసుకున్నాను దేవుడా!' అని ఏడుస్తూ వుంటుంది. వాళ్ళ ప్రేమ సొగసు అలా పరిణమిస్తుంది చివరికి."

చంద్రశేఖర్ కోపంగా, ఆశ్చర్యంగా చూస్తున్నాడు. సుధ మాటల్లో ఒక్కటికూడా అతనికి నచ్చలేదు. కానీ వెంటనే ఏం మాట్లాడాలో అతనికి తోచలేదు.

"ఏం మాట్లాడరేం?" అని రెట్టించింది సుధ.

"ఏంమాట్లాడను? మీ అభూత కల్పనలన్నీ వింటున్నాను మతిపోయి, ఇలాగే రాశారా మీ వ్యాసంలో?"

"మహా చక్కగా రాశాను. మీరదంతా చదివితే గుండెలు బాదుకుంటారనుకుంటాను" అని నవ్వి—"దేవదాసు మహా చాదస్తుడండీ! సంఘంలో ఏ ఆచారాలవల్ల తనూ పార్వతీ దూరమయ్యారో, ఇద్దరి జీవితాలూ ఎంత ధ్వంసమయ్యాయో అతనికి బాగా తెలుసు. ఆ ఆచారాల ఫలితాలు ప్రతీక్షణమూ అనుభవించి క్షోభపడుతూనే వున్నాడు. అయినా అతనికి సంఘానికి బానిసగావుండే గుణం పోలేదు తనని ఎంతో

ప్రేమించి, ఎంతో సేవచేసే చంద్రముఖిని పనిమనిషిగా పెట్టుకునేపాటి సంఘధిక్కారం కూడా అతనికి చేతకాలేదు. పరువు ప్రతిష్ఠల కోసం భయ పడతాడు-అవి ఎంత హీనమైనవో- మనిషికి వాటివల్ల ఎంత అశాంతి కలుగుతుందో జీవితం సర్వనాశనం అయినా అతనికి అర్థంకాలేదు. పార్వతిని 'నాతో లేచి రాగలవా?' అని అడిగాడేగానీ నిజంగా వొచ్చేస్తా నంటే ఈ ధీరుడు తీసికెళ్ళ గలడా?"

"సంఘాన్ని ఏం చేసి?"

"దాని ఏడుపు దాన్ని ఏడవనిచ్చి, ఏం? చెయ్యలేడా? అప్పటికి పార్వ తికి దూరమై చాలాక్షోభపడ్డాడు. ఇతరస్త్రీలతో ఉండలేకపోయాడు. పార్వతే తన జీవితానికి కావాలని స్పష్టంగా తెలిసిపోయింది, జీవితంలో ఇంకో లక్ష్యం ఇంకో ఆదర్శం లేవు. తప్పతాగి మురుగ్గుంటల్లో దొర్లుతుంటే అందరూ ఏమనుకుంటారో పట్టించుకోలేదు. తన జీవితాన్నే అంత నిర్ల క్ష్యంగా వొదిలేసుకున్నవాడికి సంఘ ధర్మాల మీద ఎందుకు గౌరవం వుండాలి? పార్వతిని తనతో వొచ్చెయ్యమని ఎందుకు ప్రార్థించలేదు?— పోనీ దేవదాసు అలా ఎవరికోసం అయిపోయాడో పార్వతికి తెలుసుకదా? అతన్ని రక్షించి సుఖపెట్టటంకన్నా పార్వతి జీవితానికి సార్థకత ఏముంది? 'మనం ఎక్కడికైనా వెళ్ళిపోయి సుఖంగా బ్రతుకుదాం' అని పార్వతైనా ఎందుకు అనలేదు? వొకరికోసం వొకరు ఏ త్యాగాలూ చేసుకోరు. మర్యాద ముసుగుల్లోంచి బయటపడరు. అయినా సరే గొప్ప ప్రేమికులని లోకం ఎందుకు కీర్తిస్తుందో నాకు అర్థంకాదు."

చంద్రశేఖర్‌కి సుధ వాదంలో కొంత న్యాయం కనపడ్డా అది సహజ మైంది కాదనిపించింది. "ఇందాక నేనేదో వేదాంతం మాట్లాడా నన్నారే, అలాగే మీరిప్పుడు ఆ లౌకికాలూ త్యాగాలూ బోధిస్తున్నారు. జీవులన్నీ భూమ్యాకర్షణకి ఎంత బద్ధులో మనుషులు సంఘ ప్రభావానికి అంత బద్ధులు. వంశ పారంపర్యపు నమ్మకాలు- పెంపకాలు- చుట్టూ ధర్మాధర్మాల నీతిబోధలు నరనరాన జీర్ణించి మనుషుల్ని నడుపుతాయి. ఆ గాడిన పడి బతికే కోట్లమంది సామాన్యుల్లో దేవదాసొకడు. అతనికి ప్రకృతి సహజ మైనప్రేమ తెలుసుగాని - దాన్ని ఫలింప జేసుకోవాలంటే మానవ ప్రయ

త్నాలేం చెయ్యాలో తెలీవు, తెలిసినా సాహసం లేదు. 'అతను ఇంకో విధంగా ఎందుకు చెయ్యలేదు?" అని అడగటాని కెవ్వరికీ హక్కులేదు. అది అతనియిష్టం. అది అతని స్వభావం. కాదని మీరంటే మీరు కొంచెం కూడా శాస్త్రీయమైన ఆలోచనలకి విలువ ఇవ్వటం లేదని నేనంటాను.

"రచయితలు రెండు రకాలుగా రాస్తారు. కొందరు-మనుషు లెలా జీవించాలో చెప్తారు. కొందరు ఎలా జీవించకూడదో చెప్తారు. శరత్ రాసిందంతా రెండో రకంలోనే. 'దేవదాసు' చదివి పూర్తి చేసిం తర్వాత మన మనుషులు చాలా భారంగా అయిపోయి నిట్టూర్చి - "వాళ్ళిద్దరికీ పెళ్ళయితే ఎంత బావుండేది! పోనీ ఎక్కడికైనా పోయి సుఖంగా బ్రతికినా సంతోషించేవాళ్ళం" అనుకుంటాం. ఒక్కక్షణం అన్నీ అలా అనిపించాయంటే రచయిత మనకి చాలా మేలు చేశాడన్నమాట. ఏ రచనలో అయినా పాత్రలు చాలా వినయంగా బ్రతికి, సంఘ నీతికి ఆహుతి అయ్యాయంటే దాని వెనక సందేశం ఆ నీతిని ధిక్కరించీ మార్చుకునీ సుఖపడమనే. దేవదాసూ, పార్వతీ కలకత్తా పారిపోయి అక్కడ కాపురం పెడితే మనకి నిజంగా ఏమీ సానుభూతి కలగదు, "వెధవపని చేశారు. తప్పు కాదూ?" అనుకుంటాం. వాళ్ళ నాశనం మన కళ్ళారా చూస్తేనే సంఘ వికృత రూపం ఎలాంటిదో అర్థం అవుతుంది, ఏది తప్పో ఏది తప్పుకాదో అప్పుడు ఆలోచిస్తాం-అందుకే ప్రేమించిన వాళ్ళతో జీవించటమే లక్ష్యంగా పెట్టుకుని సాహసంగా లేచిపోయినట్టు కథలు రాసే రచయితలకి మర్యాద దక్కదు.

"అసలీ మర్యాదల్ని ధిక్కరించమని రాసేవాళ్ళు మళ్ళీ ఈ మర్యాదల్నే ఆశిస్తారా? మీరు ఎంతైనా చెప్పండి. ఇద్దరు మనుషుల మనసుల్లో పుట్టిన ప్రేమ స్థిరంగా నిలబడాలంటే ఆ ఇద్దరూ ముందు సంఘ ప్రభావాన్ని ఒదిలించుకోవాలి. దాంట్లో మునిగి తేలుతోన్నంత కాలం ప్రేమ జీవితంలో చాలా అవాంతరాలొస్తాయి. సాధారణంగా అవే నెగ్గి ప్రేమ ఓడిపోతుంది.

"దేవదాసు, పార్వతీ విడిపోయి దూరం అయ్యారు కాబట్టే వాళ

ప్రేమ అంత వృద్ధి అయింది గానీ పెళ్ళి చేసుకుని వుంటే మామూలు భార్యా, భర్తల్లాగే కీచులాటల కాపురం చేసేవాళ్ళు."

"అయితే ప్రేమించుకున్న వాళ్ళు విడిపోతేనే వాళ్ళ ప్రేమ నిలుస్తుందన్నమాట."

"చాలా మందికి అంతే."

"పోనీ నిలిచినన్నాళ్ళే నిలుస్తుంది. కొన్నాళ్ళే సుఖపడతారు. విడిపోయి మొత్తం జీవితాంతం నిరాశతో గడపటంకన్నా అదిమంచిదికాదూ!"

"ఎక్కడికక్కడి ఈ రాజీపడే గుణం పోయేట్టులేదు మనకి. మంచి చెడ్డలు వొదిలెయ్యండి. అసలు ప్రేమ గురించి ఆలోచిస్తే నాకో కథ జ్ఞాపకం వొస్తుంది. ముసలి రాజుగారికి రాచపుండు లేస్తే వైద్యులంతా చేరి దేవలోకం నుంచి ఏదో గొప్ప సువాసన వేసే పుష్పం తేవాలంటారు, చూశారా? అదిగో ఆ పుష్పంలాంటిది ప్రేమ, దానికోసం ఎందరు బయలేరితే ఏం? చివరికెవరో గొప్ప సాహసికుడు – ప్రాణాలకు కూడా తెగించినవాడు_దారి పొడుగునా కరుణతో ఎందరికో సహాయాలు చేస్తూ– తన ప్రేమతో ఎందరికో శాపవిమోచనాలు కలిగిస్తూ ధీరత్వంతో ఎన్నో ఘోర పరీక్షలకి తట్టుకుంటూ దేవలోకం చేరతాడు. దారి పొడుగునా చేసిన మంచి పనులవల్లే ఆ దేవపుష్పాన్ని తాకే అర్హత వొస్తుంది. అలాగే ప్రేమను పొందటానికికూడా అంత గొప్ప అర్హత కావాలి."

"సరే! జీవితం పొడుగునా ఏం పనులు చెయ్యాలో చెప్పండి ఆ అర్హత మీకోసం."

వెన్నెల పూర్తిగా సుధమీంచి జరిగి చంద్రశేఖర్ మీదికి వెళ్ళింది. జనం వొక్కొక్కరూ లేచి వెళ్తున్నారు. సుధ వాచీ చూసింది. తొమ్మిది కావొస్తోంది.

"ఏం చేద్దాం మనం? సినిమాకి వెళ్దామా?" అంది.

"వొద్దండీ. సినిమాలాటి అల్ప విషయాలకోసం పెద్దల మీద తిరగబడి కష్టాలు తెచ్చుకోవటం వివేకం కాదు" అంటూ లేచాడు చంద్రశేఖర్.

"సింహం నోట్లో మట్టికొట్టి వెళ్ళిపోవాల్సిందేనా ?" అంటూ సుధ కూడా లేచింది.

వెన్నెల్లో అంతదూరం చెట్లకిందనించి నడుస్తోంటే చాలా హాయిగా వుంది. ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. పార్కుగేటు దాటి రోడ్డుమీదికి జనంలోకి ఎలక్ట్రిక్ లైట్లకిందికి వొచ్చారు.

దారిలో చంద్రశేఖర్ చెప్పు కుట్టించుకున్నాడు. రూపాయిన్నర పెన్ను కొన్నాడు.

మళ్ళీ ఆ లెక్చరర్ సంగతి అడగాలని రెండు మూడుసార్లు అనుకున్నాడు గానీ అడగలేదు.

ఇంటికి చేరేసరికి పది దాటింది! సుధ తల్లి తలుపు తీసి -"భోం చెయ్యండి" అని గదిలోకి వెళ్ళిపోయింది. తండ్రి వీధి గదిలోనే సోఫా మీద పడుకుని వున్నాడు.

సుధ అన్నాలు పెట్టింది.

చంద్రశేఖర్ అన్నం కలుపుకుంటూ- 'చూశారా? పదిదాటినా మీ అమ్మగారేమీఅనలేదు అనవసరంగా ఆడిపోసుకున్నారుమీరు." అన్నాడు.

"పదకొండు దాటలేదు కాబట్టి" గ్లాసుల్లో మంచినీళ్ళు పోసి సుధ కూడా కూర్చుంది.

చంద్రశేఖర్ మాట్లాడించినా మాట్లాడే పద్ధతిలో కనపళ్ళేదు. ఎంచేతనో సుధ ఇంట్లో వున్నప్పుడు ఎక్కువ మాట్లాడదేమో అనిపించిందతనికి.

'అమ్మ ఇంకా అలాగే వుంది.' అంటోంది సుధ. చాలా దిగులు కలిగింది.

నాన్న బయట గదిలో పడుకున్నాడంటే ఇంకా అలాగే వున్నాడన్న మాట. ఆయనకి కోపం వొచ్చినప్పుడు చేసే పని అది.

చంద్రశేఖర్ భోజనం ముగించి లేస్తూ- "మీ దేవదాసు వ్యాసం వొకసారివ్వండి" అన్నాడు సుధ కొంచెం సేపటికి తలెత్తి చూసి- "అంత బాగుండదు ఏదో రాసేశాను" అంది నిరుత్సాహంగా నవ్వుతూ.

"ఫర్వాలేదు" అన్నాడు. సుధ లేచి వెళ్ళి పుస్తకాల అలమారు లోంచి ఒక నోట్ బుక్ తీసి అతనికిస్తూ— "ఉంచాలో చింపెయ్యాలో తేల్చెయ్యండి"—అని నవ్వి వెళ్ళిపోయింది.

అట్టమీద ఎగిరే పక్షులు చాలా అందంగా వున్నాయి. చాలా సేపు వాటినే చూసి కాయితం తిప్పాడు. అది రాసిన తారీఖు చూస్తే సంవత్సరం పైగానే అయింది —

"పార్వతికీ. దేవదాసుకీ పెళ్ళయితే వారి జీవితం ఎలా వుండేది" అని హెడ్డింగు. 'దేవదాసు' చదివినప్పుడు సుధ చాలా చలించిపోయి వుండాలి. లేకపోతే అంత పట్టుదలగా అంత ఆసక్తిగా అన్ని పేజీలు రాసివుండదు. దేవదాసుమీద సుధకి చాలా కోపంగా వున్నట్టు కనపడింది. చిన్నప్పుడు చేసిన అల్లరినికూడా తెగ విసుక్కుంది. అతని వెనకాల తిరిగిన పార్వతికి బుద్ధి లేదంది. చదువుకున్నా—పెద్దవాడైనా దేవదాసుకి జ్ఞానం రాలేదట. తలకాయలో సరుకులేని వాళ్ళు కలకత్తా వెళ్ళినా, లండన్ వెళ్ళినా వొక్కటేనట.

చంద్రముఖిని దేవలోకాని కెత్తింది. దేవదాసు వెంట వుండే ముసలి నౌకర్నికూడా చంద్రముఖి సరసనపెట్టి—? అసలు ప్రేమ అంటే వీరిదే—'ఆ మూర్ఖుడికి ఎంతమందినుంచి ప్రేమ దొరికితే ఏం లాభం? కాలదన్నుకుపోయాడు' అని మళ్ళీ దేవదాసునే తిట్టింది.

పార్వతి గురించి చాలా గొప్పగా అద్భుతంగా రాసింది. పార్వతి వ్యక్తిత్వానికి—ఆత్మాభిమానానికి నివాళులెత్తింది. ఎక్కడికక్కడ పార్వతి సాహసానికి అదిరిపోయింది. పార్వతి స్నేహితురాల్ని వెక్కిరించి— 'ఎందుకే మీరు అనవసరంగా గుప్పెళ్ళకొద్దీ పసుపూ కుంకాలు పాడు చేస్తారూ? ఎవర్ని భర్త అనాలో నీకు తెలుసునా? నాకు ముసలి జమీందారుతో పెళ్ళి అయితే ఏం? పెళ్ళిళ్ళు తంతు ప్రకారం అవుతాయి. నా అసలు భర్త మాత్రం దేవదాసే'—అన్నదని తెగ ప్రశంసించింది— 'చూడు దౌర్భాగ్యుడా! అలాంటి ప్రియురాలిని—అలాంటి అర్ధాంగిని—అలాంటి జీవన సహచరిని నీ మూర్ఖత్వంతో శాశ్వతంగా పోగొట్టుకున్నావు. నీ

రాక్షస తల్లిదండ్రుల్నీ-నీ బూజుపట్టినవంశం గొప్పనీ నీ జమీందారీబరువునీ వేలంవేస్తేమాత్రం పార్వతిని కొనగలవా?' అని మళ్ళీ దేవదాసునే తిట్టింది.

అన్ని తిట్లుతిన్న దౌర్భాగ్యుడిమీద ఆ సుధకికూడా చాలా జాలి కలిగింది చివరికి. —'పిచ్చివాడా! వొక జన్మ దూరం పెద్దదూరం కాదులే. వొచ్చే జన్మలో నువ్వు పార్వతి చేతుల్లో పడాలని నీకోసం నేనుకూడా ప్రార్థిస్తున్నాను.' అని ముగించింది—ప్రాణాలు బిగబట్టి వింటోన్న శరత్ బాబు సుధ తీర్పుకి తేలిగ్గా నిట్టూర్చివుంటాడు! కాని సుధ మర్చిపోయింది. కానీ దేవదాసు వచ్చే జన్మకి- చంద్రముఖికి వాగ్దానం చేశాడు. ఆ సంగతి జ్ఞాపకంవొస్తే—'చూశారా? అన్నీ ఇలాంటి పనులే చేస్తాడు. దరిద్రుడు. అని మళ్ళీ తిడుతుంది దేవదాసుని. పాపం ఇప్పటికే చాలా తిట్లు తిన్నాడు'

చంద్రశేఖర్ నోట్ బుక్ టేబుల్ మీదపెట్టి లైటార్పి పడుకున్నాడు. అతని ఆలోచనలన్నీ సుధచుట్టూ తిరుగుతున్నాయి.

సుధ పెరటివేపు మెట్లమీద కూర్చుని తల్లితో మాట్లాడాలని ప్రయత్నిస్తోంది. పద్మావతి ముభావంగా వున్నట్టు కనపడాలని పుస్తకం చదువుకుంటోంది.

"వెళ్ళి పడుకోరాదూ?" అంది ఆవిడ కొంతసేపటికి.

"నిద్రరావటంలేదూ? నువ్వింకా చదువుతావా?"

"ఈ పుస్తకం ఇచ్చెయ్యాలి రేపు."

"అసలేమైందమ్మా సాయంత్రం?"- ఆవిడ విని వూరుకుంది.

"నాన్న ఈ పూటకూడా అన్నం తినలేదా?"

రెండు ప్రశ్నలకీ ఆవిడ మాట్లాడలేదు.

సుధకి మళ్ళీ పలకరించే వుద్దేశంలేదు. అలాగే కూర్చుంది.

"కొత్తగా ఏమౌతుంది? ఎప్పుడూ వున్నదే"— అంది నిష్ఠూరంగా పద్మావతి కొంతసేపటికి.

"అదికాదు, అసలేమైంది?"

"ఈయన ఎందుకిలా తయారవుతున్నారో నాకు మతిపోతోంది.

నిజంగా పోనీ నేను చేసింది ఎంత అపరాధమో నువ్వే చెప్పు. శర్మగారికి ఆమధ్య చాలా జబ్బు చేసిందికదా? పాపం బోలెడు ఇబ్బందుల్లో వున్నాడు. చచ్చిపోతున్నాడన్న మనిషి ఎలాగో బతికి బట్టకట్టి మనుషుల మొహాలు చూస్తున్నాడు. ఇంటినిండా పిల్లాజల్లా ఎన్ని ఖర్చులుంటాయో చూడు. కొంచెం డబ్బు అప్పడిగాడు. అలాంటి పరిస్థితుల్లో అడిగితే ఎలా కాదంటాం? పైగా మనిషి చాలా మంచివాడు. రేపోమాపో ఎరియర్సు వొస్తాయి అందరికీ. ఆయనే తీర్చేస్తాడని జీతంలోంచి రెండొందలు ఆయన కిచ్చాను. దానికీ ఇంత రాద్ధాంతం—'వాళ్ళెగ్గొడితే ఏం చేస్తావు?' అంటూ ప్రశ్నించారు ఈయన. కిందటి నెల్లో శారదగారికిస్తే ఆవిడ వారం రోజుల్లో ఇచ్చెయ్యలేదూ? 'అస్తమానూ అందరికీ అప్పులివ్వటం కుదరదు' అని నాతో తగువు—ఆఫీసునించి రాగానే. సాటి మనుషుల్తో ఆ మాత్రం కష్టం సుఖం లేకుండా ఎలా వుంటాం సుధా? నేను సంపాదించాలేగానీ స్వతంత్రించి ఏమీ చెయ్యగూడదన్నమాట. ఆ మాటంటే ఇంతెత్తున లేచి.... అబ్బ! ఏం మనిషో" అంటూ కంఠం ఆగిపోయి ఏడ్చేసింది.

సుధ మనసు విలవిల్లాడింది.

కన్నబిడ్డకి తన కష్టం చెప్పుకుని తల్లి ఏడుస్తోందంటే....భరించలేక తలవొంచుకుని మోకాళ్ళమీద ఆన్చుకుని కూర్చుంది.

అమ్మ ఎంతో మంచిపని చేసింది. ఎంత దయగానో చేసింది. అసలు ఎందుకుచేసిందో నెమ్మదిగా తెలుసుకుని "అలాగా? దానికేముంది పద్మా? ఏం ఫర్వాలేదు." అంటే నాన్న! నాన్నకూడా అంత కిరాతకుడేం కాడు. ఆ పరిస్థితుల్లో తనుకూడా అలాగే చేస్తాడు. తను మాత్రం తన స్నేహితులకి అప్పులివ్వటంలేదూ? వాళ్ళ దగ్గర్నుంచి తీసుకోవటంలేదూ? అలాంటి లావాదేవీలన్నీ తనే చెయ్యాలి. భార్యకి స్నేహితులుండకూడదు. స్వంత వ్యవహారా లుండకూడదు. తను చేసే పనులమీదే తనకి గౌరవం కానీ, యింకో వ్యక్తి చేసే పనులమీదకూడా అలాగే గౌరవం వుండాలని ఛాలామందికి జీవితం పొడుగునా తెలీదు.

"శర్మగారికి అప్పుయివ్వటం—మానటం అమ్మ యిష్టం. ఎవరిష్ట ప్రకారం వాళ్ళకి చేసే హక్కుంది. ఒద్దనీ కాదనీ చెప్పటానికి నాన్న ఎవరు?"

"ఈయన రోటరీ క్లబ్బు కాదుగానీ—ముందు నా ప్రాణాలు పోతు న్నాయి. డబ్బురంధి ఎక్కువై పోయింది. గబగబా డబ్బు పోగుచేసి కారు కొనాలట—కారు!"

అవును. నాన్నకి రొటేరియన్ అయ్యాకే మరీ ఆడంబరాల పిచ్చి ఎక్కువై పోయింది. బోలెడు ఖరీదులుపెట్టి కొత్త సూట్లు కుట్టించాడు. కొత్త ఫర్నిచర్ తెచ్చాడు. ఫోను పెట్టించాడు. ఇక కారు కొనాలని విశ్వ ప్రయత్నం. అప్పటికిగానీ హోదా పూర్తి కాదు. పోనీ డబ్బుంటే కొను క్కోవచ్చు. దానికేం అభ్యంతరంలేదు. దేశంకోసం పేదలకోసం త్యాగాలు చెయ్యమని ఎవ్వరూ శాసించటంలేదు. భార్యకోసమైనా కొంత సహనం అక్కర్లేదా! తిట్టి—దండించి—పెత్తనంచేసి- డబ్బు కూడబెట్టి- కారుకొని అందులో తిరిగితే ఏం గొప్ప సుఖం వస్తుంది?

"రేపు శర్మగారికి చెప్పేస్తాను. ఎక్కడన్నాచూసి నా డబ్బు నాకు సర్దెయ్యండి బాబూ! ప్రాణాల మీదకొచ్చి పడింది, అని ఏదో అబద్ధం చెప్పి ఆ డబ్బు తెచ్చి ఈయన మొహాన్న పారేస్తేగానీ...." అంటోంటే సుధ చటుక్కున తల ఎత్తి —"ఛీ! ఛీ! అలా మాత్రం చెయ్యకు"- అని మొహం చిట్లించింది.

"మరి ఏం చెయ్యమంటావు?"

"ఏమీ చెయ్యక్కర్లేదు. ఆయనెప్పుడిస్తే అప్పుడు తీసుకో. ఇవ్వక పోతే వూరుకో. ఆ మధ్య స్మగుల్ టేప్‌రికార్డర్ తెస్తానని ఎవరో వొకాయన వెయ్యి రూపాయలు ఎగ్గొడితే నాన్నేం చేశాడు?"

"బాగుంది. అది ఆయన చేసినపని. నేను చేస్తే వూరుకుంటారా?"

"ఏం చేస్తాడు వూరుకోక? ఏం చేస్తాడమ్మా? కేకలేస్తాడు, తిడతాడు. లక్ష్యపెట్టకు."

"ఎన్నాళ్ళీ గొడవ ఇంట్లో?"

"ఎన్నాళ్ళేమిటి ? ఎవరి మూర్ఖత్వం వాళ్ళకి తెలిసేదాకానూ! అసలు ఇలాంటి విషయాల్లో నువ్వెందుకు పట్టుదలగా వుండవో నా కర్థంకాదు. స్వేచ్ఛకోసం చేసే యుద్ధాలు ఏళ్ళ తరబడీ, యుగాల తరబడీ సాగుతాయి. దేశాలకైనా అంతే. వొక్క మనిషికైనా అంతే.''

''ఛీ! ఛీ! వెధవ బ్రతుకైపోయింది"—అని నిట్టూర్చింది పద్మావతి సుధకి తండ్రిమీద బాగా కోపం వచ్చిందని ఆవిడకి అర్థమైంది. లేకపోతే సుధ ఎప్పుడూ అంత నిర్మొహమాటంగా మాట్లాడదు.

తీరా కడుపులో బాధంతాచెప్పి ఆ పిల్లతో సలహా చెప్పించుకున్నాక కొంచెం చిన్నతనం అనిపించింది పద్మావతికి—

ఏం స్వేచ్ఛా....ఏం యుద్ధం! పిచ్చిమాటలు. సంసారాలు వెలగబెట్టినవాళ్ళకి బుద్ధీ జ్ఞానం వుండాలిగానీ....ఈయన రోజూ పోట్లాడుతూ వుంటే ఎవరు పడగలరు?....రేపు కాకపోయినా రెండు రోజులు పోయాక న్నా అడగాలి శర్మగార్ని—అనుకొని పుస్తకం మూసి—"పద పడుకుందాం"—అంటూ లేచింది.

సుధ చంద్రశేఖర్ పడుకున్నగదిలోకి వెళ్ళింది. అతను నిద్రపోతున్నాడు. చొక్కా మార్చుకోలేదు. కొత్తపెన్ను జేబులోంచి తొంగిచూస్తూ చీకట్లో మెరుస్తోంది. అది తీసి టేబుల్‌మీదపెట్టి ఫేన్‌వేసి వెళ్ళిపోయింది.

సుధకి నిద్ర పట్టటంలేదు. తల్లి చెంపలమీద జారే కన్నీళ్ళు ధగధగా మెరుస్తున్నాయి.

'ఛీ! ఛీ! ఏం జీవితం!' అని ఎవరన్నా ఏడ్చారంటే వాళ్ళకి అంత దుఃఖం కలిగించిన వాళ్ళని ఏం చెయ్యాలి ?

'ఏమి జన్మం బేమి జీవనమూ ...' అంటూ పుట్టినందుకు సిగ్గుపడుతూ....పాడుతూ—అడుక్కుంటూ ...రోజూ వొస్తాడొక బిచ్చగాడు. అతనికి అంత కష్టం కలిగించేది ఎవరో చెప్పమంటే ? మామూలే 'నా కర్మతల్లీ!' అంటాడు. అమ్మా నాన్నాకూడా ఎవరి కర్మకి వాళ్ళు వగస్తూ వుంటారు. వొకప్పుడు అదృష్టం అనుకున్నదంతా కర్మలోకి దిగింది.

రోడ్డువార కుళ్ళు కాలవ వొడ్డున చింకి పీలికలతో శవాకారంగా

వున్న కురూపి బిచ్చగాణ్ణి చూపించి – 'ఇరవై సంవత్సరాల కిందట వీరు గొప్ప రాజాధిరాజులు. ప్రపంచాధినేతలు. సౌందర్య ప్రభువులు. సువర్ణ రథాలలో పయనించినవారు. హంసతూలికాతల్పాలపై శయనించినవారు.' అంటే నమ్మశక్యంగా వుంటుందా?

"అరె! ఇప్పుడిలా అయ్యాడేం?"

"అయిపోయారు."

"ఎందుకయిపోయాడు? ఆ రాజ్యాలూ, ఆ సిరిసంపదలూ, ఆ సౌందర్యాలూ అన్నీ ఏమైపోయాయి?"

"పోయాయి."

"ఎలా పోయాయి?"

"ఎలాగో పోయాయి."

ఎలా నమ్ముతాం? .... అదే నిజం అయితే నమ్మకేంచేస్తాం?— అయినా అవన్నీ భౌతిక సంపదలు. పోతే పోవచ్చును. ఆత్మసంపద— అనురాగ సంపదకూడా పోతే మనుషులకేం మిగుల్తుంది?

ఆ బిచ్చగాళ్ళకన్నా దురదృష్టవంతులు అయిపోయారు అమ్మా నాన్నా. ఆ ప్రేమ రాజ్యాలన్నీ ఏం చేసుకున్నారో.! ఆ సంతోషాలన్నీ. జీవితంమీద ఆ ఆశలన్నీ ఎలా పోగొట్టుకున్నారో....! ఆ కొత్తరోజుల్లో- ప్రపంచాన్నే ధిక్కరించిన ధీరుల్లాగ-రెక్కలు చాచుకుని ఎగిరే పక్షుల్లాగ —ఆకాశంలో విహరించే మబ్బుల్లాగ—ఆ మొహాల్లో–ఆ కళ్ళల్లో ఎంత మెరుపు! ఎంత కాంతి! ఎంత ఆనందం!—ఎంతెంతో అందమైన ఉద్యాన వనాల్లో—నదీతీరాల్లో—పడవ షికార్లలో—పున్నత సౌధాలముందు— సూర్యాస్తమయాలలో—ఎన్నెన్ని రకాల ఫోటోలు! నెమలి సింహాసనం మీద రాణి మల్లే కూర్చున్న అమ్మ–అప్పుడు నిజంగా వొక ప్రేమసామ్రాజ్యానికి రాణియే. ఆ మధుర స్మృతులన్నీ కాయితాలమీద పొదిగి దాక్కున్నాయి. మళ్ళీ మళ్ళీ కొత్త ఫోటోలు లేనేలేవు.

అమ్మకి ఇష్టమైన వాళ్లెవరన్నా వొస్తే ఆ ఆల్బమ్స్ తీసి చూపిస్తూ

వుంటుంది. చూసేవాళ్ళ కళ్ళలో అసూయ జాడలు సృష్టించేంత అద్భుతంగా వుంటాయి ఆ ఫోటోలు. 'ఇవన్నీ మీ పెళ్ళిరోజులల్లోవేగా ? తర్వాతవేం లేవేం ?' అని ఎవ్వరూ అడగరు. ఎవరన్నా అడిగితే మాత్రం—'ఏవిటోనండీ శ్రద్ధ పోయింది' అంటుంది అమ్మ. 'ఏవిటోనండీ ప్రేమ పోయింది' అనెయ్యరాదూ ?

ప్రేమలు తప్పకుండా పోతాయి. అలా పోయినప్పుడు భరించటం ఎలాగ? అందుచేత దానిమీద ఏమీ ఆశపెట్టుకోకూడదు. ఈసారి రాజారావుగారికి నిర్మొహమాటంగా చెప్పెయ్యాలి – 'చూడండి సార్ ! ఈ ప్రేమలూ అవీ చిన్నపిల్లలు ఆడుకునే రబ్బరు బుడగల్లాంటివి. వాటి రంగులుచూసి మురిసిపోతారేగానీ వాటి నెంత మృదువుగా ఎంత జాగ్రత్తగా రక్షించుకోవాలో పిల్లలకు తెలీదు. తెలిసినా లాభంలేదు. ఎప్పుడో అప్పుడు అవి పేలి తీరాల్సిందే. పేలడం బుడగల ధర్మం. పేలగొట్టడం పిల్లల ధర్మం. పిల్లలకన్నా మనం ఏమీ జ్ఞానులంకాము. వాళ్ళ ఆట బుడగలకన్నా మన ప్రేమలు దృఢమైనవికావు. మీకూ-మీపెళ్ళికీనమస్కారం అని చెప్పెయ్యాలి నయం, ఇంకా వొప్పుకున్నాను కాను.

*　　　*　　　*

తెల్లారిందగ్గర్నించీ సుధ తండ్రి వెంకట్రావు కొంచెం నవ్వు మొహంతో కనిపించాడు అందరికీ. చంద్రశేఖర్‌కి వుద్యోగం గురించి ఎవర్నో కలుసుకోమని వివరాలన్నీ చెప్పాడు. ఎవరూ పిలవకుండానే టిఫిన్‌కోసం వచ్చి పేపరు చదువుతూ టేబుల్‌దగ్గిర కూర్చున్నాడు.

సుధ చంద్రశేఖర్‌ని కూడా పిలిచి ఇద్దరికీ ఇడ్లీలుపెట్టి తనుకూడా కూర్చుంది—నాన్నని కడుపులో మిషను కేకలేసి పంపింది కావున్ను. అప్పుడప్పుడూ అలగటం మంచిదే. ఆకలన్నా తెలుస్తుంది. అసలు అలిగి తిండి మానేసిన వాళ్ళకి పదిరోజులవరకూ ఏమీ వండకూడదు – 'అలిగే హక్కు నీకుంది. నీ హక్కుని మేం రక్షిస్తాం. నీ టిఫిన్లూ, కాఫీలూ, భోజనాలూ అన్నీ బంద్‌చేశాం ?' అని చెప్పాలి.

"ఆ కారప్పొడి ఇలా అందించు."

సుధ ఆ పని చేసింది.

ఇడ్లీలనిండా నెయ్యిపట్టిస్తు — "ఏమ్మా! నిన్న సుందర్రావు గారు కారెక్కమంటే యెక్కనన్నావట" అని జవాబు చెప్పమన్నట్టు చూశా డాయన కూతుర్ని. సుధకి నిన్న సంగతి జ్ఞాపకం ఒచ్చి—

"సుందర్రావుగారో, మందర్రావుగారో ఆయ నెవరో నాకు తెలీదు" అంది.

"నన్నెరుగుదు నని చెప్పారటగా ?"

"నిన్నెరిగితే?—నిన్నెరిగిన వాళ్ళందరి కారులూ ఎక్కమంటావా నన్ను ?" అని కోపం తెచ్చుకుంది.

చంద్రశేఖర్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"అబ్బ ! అదికాదమ్మా ! వానలో అంత తడిసి రాకపోతే ఆయన కార్లో డ్రాప్ చేస్తానంటే...."

"ఊరుకో నాన్నా! నీకు మరీ కార్లపిచ్చి ఎక్కువ అవుతోంది. నా కిష్టంలేదన్నాక ఆయన నీకుచెప్పటం ఏమిటి? నువ్వు నన్ను అడగడం ఏవిటి ? సిల్లీ! – నువ్వూ కారు కొంటావు కావున్ను. – నీ కార్లో కూడా నన్నెప్పుడూ ఎక్కమని అడక్కు."

"ఓహో! నీ కారు నువ్వే కొనుక్కుంటావా ?"

"ఏం కొనుక్కోలేనా ? నీపాటి ఉద్యోగం నేనూ చేస్తాను."

"చాలా పెద్దదాని వయిపోయా వన్నమాట."

"పెద్దవాళ్ళు చిన్నవాళ్ళవుతోంటే–మరి చిన్నవాళ్ళు పెద్దవాళ్ళు గాక ఏం చేస్తారు ?"

కూతురు జవాబు లెప్పుడూ ఆయనకి అలవాటే. మురిపెంగానే వున్నాయి. పైకిమాత్రం కోపం ప్రదర్శిస్తూ చంద్రశేఖర్‌ని చూసి — "చూడవోయ్ ! మా అమ్మాయి తీరు. నువ్వెప్పుడన్నా "పెద్ద వాళ్ళకి ఇలా ఎదురు తిరిగి మాట్లాడావా? పిల్లల్ని కనీ, పెంచీ పెద్దవాళ్ళని చేసేది

ఇందుకేనా? ఆ మాత్రం విశ్వాసం వుండొద్దూ?"— అని ఫిర్యాదు చేశాడు.

చంద్రశేఖర్ నవ్వి వూరుకున్నాడు.

"విశ్వాసం కుక్కల లక్షణం అని చెప్పరాదూ మీరు?" అని సుధ శేఖర్‌ని చూసింది.

"నీ కీ తలతిక్క పోవాలి సుమా!" అన్నా డాయన కొంచెం అవమానపడి నవ్వుతోనే.

"థాంక్స్ నాన్నా! తల వంచుకోవటానికి పర్మిషన్ ఇచ్చావు."

వంటింట్లోంచి కూతురు మాటలన్నీ వింటోన్న పద్మావతి ముసి ముసి నవ్వులు నవ్వుకుంటోంది.

చంద్రశేఖర్ మాత్రం పూర్తిగా ఆశ్చర్యంలో మునిగాడు.

* * *

"మనుషుల సంస్కారంలో తప్ప నాకు ప్రేమలో నమ్మకం లేదు మాష్టారూ!" అంది సుధ కొంచెం మొహమాటపడుతూ.

"అంటే?" అన్నాడు రాజారావు అర్థంకానట్టు. అర్థం కాలేదు కూడా. ఇద్దరూ చిట్టడవి పార్కుకే వొచ్చారు.

పెళ్ళి గురించీ, ప్రేమ గురించీ ఏమీ ఆలోచించ కూడదని సుధ చాలాసార్లు నిర్ణయాలు చేసుకుంది. ముందు చదువుకొాక బ్రేక్ వెయ్యాలి. తర్వాత ఏదో విధంగా బ్రతుకు తెరువు చూడాలి. ఆ తర్వాత ఏమో! అంతవరకూ జరగాలి ముందు—అనుకుంటూ వుంటుంది.

రాజారావు సుధ విషయంలో ఎక్కువ ఆసక్తి చూపించాడు. సుధ తన నిర్ణయానికి వ్యతిరేకంగా కొంత ఆలోచనల్లో పడింది.

"మీ రన్నదేమిటో నాకు అర్థం కాలేదు" అన్నాడు రాజారావు.

సుధ కొంత ఆలోచనలోంచి బయటపడింది. "ఏదో అన్నాను గానీ, నాకూ అర్థం కావటంలేదు మాష్టారూ! — మనం ఎంతో మందిని చూస్తూ వుంటాం. ఎంత గొప్పగా ప్రేమించి, పెళ్ళి చేసుకున్న వాళ్ళయినా చాలా మామూలు భార్యా, భర్తల్లాగే బ్రతుకుతూ వుంటారు.

మామూలు కుంటుంబాల్లో వుండే అన్నిరకాల సాంప్రదాయాలూ ఈ ప్రేమించుకున్న దంపతుల మధ్యకూడా వుంటాయి. అలాంటి పెత్తనాలే, అలాంటి బానిసత్వాలే, మళ్ళీ అన్నీ అలాంటి కష్టాలే. యధావిధిగా భర్తల పెత్తనాలూ, లేకపోతే భార్యల రాక్షసత్వాలూ అంతా మామూలే. వొకాయన ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడండీ. ఈ పిల్లనితీసికెళ్ళి తల్లి పెత్తనం కింద పెట్టాడు. ఆవిడకి కోడలిమీద చాలా కక్షగా వుంది, కట్నాలూ, కానుకలూ లేకుండా కొడుకుని వల్లో వేసుకుందని. కోడలికి ఇంట్లో బండ చాకిరీ తప్ప దేనికీ పెత్తనం లేకుండా చేసింది. కొడుకు మాతృదేవి ముద్దుచేష్టలన్నీ చూస్తూ వూరుకున్నాడు. పైగా ఒర్చుకోమని గీత బోధ చేశాడు భార్యకి. ఇప్పటికీ ఆ సంసారం అలాగే వుంది" అని వూరుకుంది సుధ.

రాజారా వేమీ మాట్లాడలేదు। సరిగ్గా అతని పరిస్థితి అలాంటిదే. తల్లికి కట్నాల ఆశ చాలా ఎక్కువ. అతనికి ఆ వుద్దేశంలేదు. సుధని పెళ్ళి చేసుకోవాలంటే అతని తల్లి వొప్పుకుంటుందని నమ్మకం లేదు. ఆ పెళ్ళికి మాత్రం ఎలాగో సాహసం చేసినా తర్వాత పరిస్థితి కొంతన్నా వర్ణించినట్టే వుంటుంది. "మరి ఎవరుమాత్రం ఇంకేం చెయ్యగలరు చెప్పండి? మనకే ఆ పరిస్థితి వొస్తే—ప్రతి చిన్నవిషయానికీ తల్లిదండ్రుల్ని తప్పు పడుతూ వుంటామా? కొంతకాలం ఓర్చుకుంటే నిజంగానే అలాంటి కుటుంబాలు వొక దారికి వొస్తాయి? నేనేదో చాదస్తంగా మాట్లాడుతున్నాననుకోకండి" అని నవ్వా డతను.

సుధకి ఆశ్చర్యం కలిగిగా ఏమీ వెల్లడించకుండా—"నేను చెప్పిన కోడలు ఆ మధ్యెప్పుడో ఆత్మహత్య ప్రయత్నాలు చేసిం దన్నారు. మళ్ళీ చేస్తే మీకు చెప్తాలెండి. అప్పుడు నిజంగానే వొకదారికి వొస్తుంది ఆ కుటుంబం!" అని నవ్వింది.

"మీరు నన్ను అపార్థం చేసుకున్నట్టున్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలూ ఎంత వొద్దనుకున్నా కొంతన్నా మనం పాటించక తప్పదు."

"ఇంక వెళ్దామా?" అని లేచి నిలబడదామనిపించింది సుధకి. రాజారావుమీద సుధ కెన్నడూ దురభిప్రాయం లేదు. ఇప్పుడు ఏర్పడటం కూడా ఇష్టంలేదు. ఆయన మంచి లెక్చెరరు. స్నేహ పాత్రుడు. తనకి తెలిసిన పాటి అల్పవిషయాలు ఆయనకి తెలీవని అనుకోకూడదు! చంద్రశేఖర్‌తో వాదించినట్టు ఈయనతో మాట్లాడకూడదు. మాష్టారుకి ఎక్కడా కష్టం కలగకుండా మాట్లాడుకోవటం ఇద్దరికీ మంచిది.

"సుధా! మీ సందేహా లేమిటో నాకు అర్థం కావటంలేదు"-అన్నాడు రాజారావు నిరుత్సాహంగా. అతను సుధకి చాలా విషయాలు చెప్పా లనుకున్నాడు. సుధ మొదట్లోనే 'నాకీ ప్రేమల్లో నమ్మకం లేదు మాష్టారూ!' అనటంతోనే పరిస్థితంతా తారుమారైంది.

"ప్రేమలో నమ్మకం వుండటం ఏమిటి? లేకపోవటం ఏమిటి?" అన్నాడు ఆ సంగతే గుర్తొచ్చి.

"ప్రేమ అనేది కొన్నాళ్ళు వుండి, పోయే ఆకర్షణే అయితే – ఆ మాత్రం ఆకర్షణ ఎవర్ని చేసుకున్నా వుంటుంది కదా కొత్త రోజుల్లో? అందులోనే సుఖం వుంది అనుకుంటారే గానీ ఆ సుఖం ఏమీ అనుభవించరుగా అనిపిస్తుంది మాష్టారూ నా కెప్పుడూ."

"అందరూ అలాగే వుంటున్నారా ?"

"అలా వుండనివాళ్ళు వాళ్ళ సంస్కారంవల్ల వాళ్ళ వున్నత మనస్తత్వాలవల్ల సుఖపడుతున్నారే గానీ ప్రేమవల్ల నే మాత్రంకాదు?"

రాజారావు మాట్లాడలేదు.

సుధ కొంచెం వుత్సాహంగా – "పోనీ అదంతా పోనివ్వండి మాష్టారూ! కాస్సేపు ఇం కేదన్నా మాట్లాడుకుందాం. మొన్న నేనూ చంద్రశేఖర్ అనే ఆయనా ఇక్కడ ఈ చెట్టుకిందే చాలాసేపు కూర్చున్నాం. ఆ రోజు వర్షం పడి నేలంతా తడి తడిగా వుంది. ఇది పార్కు అంటే ఆయన చస్తే నమ్మలేదు."

"ఎవ రాయన!" అప్రయత్నంగానే అడిగాడు రాజారావు,

"ఏదో ఇంటర్వ్యూకోసం వొచ్చారు. సెలెక్ట్ కాలేదు లెండి.— మాష్టారూ! ఒకఅమ్మాయి ఇద్దరు అబ్బాయిల్ని ప్రేమిస్తే ఏమౌతుందండీ?"

అదిరిపడ్డాడు రాజారావు.

"చాలా ఆశ్చర్యంగా వుంది కదండీ! నాకూ అలాగే అనిపించింది. ఈ మధ్య ఏదో పత్రికలో కథ చదివాను, వొక అమ్మాయిని యిద్దరు అబ్బాయిలు ప్రేమిస్తారు. వొక అబ్బాయి ఉత్తరం రాస్తాడు. ఒక అబ్బాయి స్వయంగా అడుగుతాడు. వాళ్ళిద్దరికీ రెండో వ్యక్తి అభిప్రాయం తెలీదు? ఆ అమ్మాయి చాలా సంఘర్షణలో పడిపోతుంది...."

రాజారావు అడ్డొచ్చి— "తన కెవరిష్టమైతే వాళ్ళనే నిర్ణయించుకో రాదూ?" అన్నాడు.

"అదే యిబ్బంది. ఆ అమ్మాయికి ఇద్దరితోటీ బాగా స్నేహం వుంది. ఇద్దరి స్వభావాలూ మంచివే. ఇద్దరూ చదువుకున్న వాళ్ళే! ఇద్దరూ అందమైనవాళ్ళే. వొకబ్బాయి చక్కగా పాటలు పాడతాడు, వొకబ్బాయి అద్భుతంగా బొమ్మలు వేస్తాడు. పాటలుపాడే అబ్బాయి కొంచెం కోపిష్టి, ఆవేశపరుడు. బొమ్మలు గీసే అబ్బాయికి ఎక్కువ శాంతం. ఎప్పుడూ ఊహల్లో తేలుతుంటాడు. ఈ తేడా తప్ప, ఎవరితో అయినా జీవితం బాగానే వుంటుందని ఆ అమ్మాయికి అనిపిస్తుంది. పోనీ ఎవర్నో ఒకర్నే ఎంచుకుందాం అని అటు మొగ్గితే ఆ రెండో వ్యక్తిని ఒదులుకుంటోన్నం దుకు మనసు విలవిల్లాడుతుంది. ఆ అమ్మాయికేం చెయ్యాలో తెలీక చాలా దిగులు పడుతూ వుంటుంది...."

"ఇద్దర్నీ పెళ్ళి చేసేసుకుంటే సరి" అన్నాడు రాజారావు మొహం చిట్లించి.

"నిజంగా ఆ అమ్మాయికి ఆ ఊహే ఒస్తుంది. ముందు తనే భయపడి రానురాను తన సందేహాలన్నీ తర్కంతో ఒదిలించుకుని ఇద్దర్నీ అడగాలని నిశ్చయించుకుంటుంది."

రాజారావు భూతాల కథ వింటోన్నట్టు "అడిగిందా?" అన్నాడు భయంగా చూస్తూ.

ఆ కథ సుధ ఎక్కడా చదవలేదు. వాళ్ళ క్లాస్‌మేట్ సుశీలకి ఇంచుమించు అలాంటి ఇబ్బందే వొచ్చింది. వొకబ్బాయి మేనత్తకొడుకే. ఇంకో అబ్బాయి క్లాసుమేటు. సుశీల తలిదండ్రులు బాగా చదువుకున్న వాళ్ళు. తండ్రి కొంతకాలం అమెరికాలో వుండి వొచ్చాడు. ఆయనకి, ఆవిడకి కూడా స్నేహితులు చాలా ఎక్కువ. సుశీల ఎంతోమంది మొగపిల్లలతో స్నేహాలు చేసేదట చిన్నప్పటినుంచీ. పెళ్ళి వ్యవహారం వొచ్చేటప్పటికి ఇద్దరి మీదా ప్రేమతో చాలా బాధపడింది.

"ఏం చెయ్యమంటావే సుధా?" అని సలహా అడిగినప్పుడు-'ఇద్దర్నీ చేసుకో' అంది సుధ. అలాంటి దేశం ఎక్కడన్నావుందా అని ఇద్దరూ ఆలోచించారు. అది జీవితం కాబట్టి సుశీల వొక్క వ్యక్తినే నిర్ణయించుకుంది. కానీ ఆ సంఘటన మీద సుధకి చాలా రోజులు ఎడతెరిపిలేని ఆలోచనలొచ్చాయి. ఒకరకంగా సుశీలకన్నా సుధే ఎక్కువ బాధపడింది. ఆ రోజుల్లోనే సుధకి వొక కథ రాయాలనిపించి కొంతవరకూ రాసింది. ఎలా ముగించాలో తోచలేదు. ఇద్దర్నీ పెళ్ళి చేసుకున్నట్టు రాయటానికి ధైర్యంలేదు. అలా జీవించటానికి సుశీల ఇష్టపడ్డా అవతలవాళ్ళిద్దరూ ఇష్టపడరు. ఇష్టపడితే తర్వాత మళ్ళీ వాళ్ళకి ఇతర స్త్రీలమీద ప్రేమ కలిగినప్పుడు సుశీల ఇష్టపడాలి. మళ్ళీ ఆ స్త్రీలకి ఇంకొరిమీద ప్రేమ కలిగినప్పుడు....అదంతా ఎక్కడ అగుతుంది?—అర్థంకాలేదు. ఎందుకు ఆగాలి? అదికూడా అర్థంకాలేదు. ఇద్దరు భార్యలతో జీవించే భర్తలుంటారుగానీ, ఇద్దరు భర్తలతో జీవించే భార్య లుండరు నాగరీక ప్రపంచంలో. ఏ స్త్రీ కన్నా భర్తగాక ఇంకో పురుషుడితో సంబంధం వుందంటే అది రహస్య సంబంధం కిందే లెక్క.

"ఏంచేసింది ఆ అమ్మాయి ఆఖరికి?" అన్నాడురాజారావుఆతృతగా.

"ఇద్దరు మొగాళ్ళతో సంబంధాలుండే ఆడవాళ్ళ గురించి మనం వింటోనే వుంటాం కదా మాష్టారూ!" -- అని ఎదురడిగింది సుధ.

"అయితే?"

"రహస్య సంబంధాలు వొప్పుకుంటారు. అ ఇద్దరు మొగాళ్ళూ ఆమెతో పబ్లిగ్గా బ్రతకటానికి వొప్పుకోరు ఎందుచేత?"

"మన సమాజం ఇంకా అంత చెడిపోలేదు."

సుధకి ఈసారి బాగా ఆశ్చర్యం కలిగింది.

"సమాజాన్ని చెడగొట్టాలని ఎవరికి సరదా వుంటుందండీ? ఇన్ని కోట్లమంది జీవితాల్లో ఎవరికైనా కొన్ని కొత్త సమస్యలు వస్తే సమాజం వాటిని కూడా సానుభూతితో పరిష్కరించాలి కదా!"

రాజారావు తన అయిష్టాన్ని చాలా స్పష్టంగా వెల్లడిస్తూ — అస లేం జరిగిందో కథ సంగతి చెప్పండి"—అన్నాడు విసుక్కుని.

అతని అభిప్రాయాలు ఎలాంటివి అయినా .... తను చాలా ఆసక్తిగా మాట్లాడుతోన్నవిషయాన్ని నిర్లక్ష్యంచేసి విసుగు ప్రకటించటం సుధకి చాలా కష్టం కలిగించింది. చంద్రశేఖర్ అయితే ఈ విషయాన్ని చాలా సహనంగా తర్కించేవాడు. అయినా ఈ విషయం రాజారావుగారికి అంత కోపం తెప్పించేట్టు వుందేమో!

"అన్ని కథల్లాగే అదీ అయింది చివరికి. కానీ ఆ అమ్మాయి కొంతవరకూ తన ప్రయత్నాలు తను చేసింది. బొమ్మలువేసే అబ్బాయిని ముందు అడిగింది — 'నువ్వంటే నా కెంత ఇష్టమో అతనంటే కూడా అంత ఇష్టమే. ముగ్గురం కలిసివుందాం' అంది. అతనికి ఈ అమ్మాయిని వొదల్లేనంత ప్రేమ. వొప్పుకున్నాడు.

"వొప్పుకున్నాడా?" అని అదిరిపడి — "మరి రెండోవాడు!" అన్నాడు రాజారావు.

"రెండో అతన్ని కూడా అలాగే అడిగింది. వినీ వినగానే మండిపడ్డాడు. తిట్టి వెళ్ళిపోయాడు."

"మంచిపని చేశాడు" అని తేలికపడ్డాడు రాజారావు.

ఆ కథ అలా ముగించాలని సుధ కెంతమాత్రం లేదు. సుశీల పాత్రకి మానసిక సంఘర్షణ భరించలేక మతి చలిస్తే....? లౌకికజ్ఞానం లేని ఆ స్థితిలో ఆమె ఎలాంటి రహస్యాలూ, మర్మాలూ లేకుండా ఇద్దరి మీదా తన ప్రేమ ఎంత గాఢమో తన ప్రవర్తనతో మాటలతో స్పష్టం

చేస్తే...? మొదట్లో అవి పిచ్చిమాట లనుకున్నా రాను రాను వాటి సత్యం ఆమె స్నేహితుల కిద్దరికీ అర్థమౌతుంది. ఆమె మంచిమనిషి కావటానికి సంవత్సరం పైగా పడుతుంది. ఆ కాలంలో ఆ స్నేహితులిద్దరూ చాలా దగ్గిరౌతారు. ముగ్గురూ కలిసి జీవించటానికి యిష్టపడతారు. కానీ అది చట్టసమ్మతంకాదు. సంఘ సమ్మతమూకాదు. వొకరికి హాని జరగని విషయాల్లో ఎవరి సమ్మతం వారికేగానీ ఇతర సమ్మతాల లక్ష్యం వుండకూడదు—ఎప్పటికైనా ఆ పిచ్చికథ పూర్తిచేస్తే అలాగే చెయ్యాలని వుంది. ఎవరికీ నచ్చకపోయినా సరే. ఎంతమంది తిట్టినా సరే, చంద్రశేఖర్‌కి చెప్పలే దీ సంగతి. అతనికి నచ్చాలి తప్పకుండా.

ఇద్దరూ మాటలు మర్చిపోయినట్టు కూర్చున్నారు. ఇద్దరికీ చాలా నిరుత్సాహంగా వుంది. రాజారావు పెళ్ళి సంగతులూ – తర్వాత పెట్టబోయే సంసారం సంగతులూ చాలా మాట్లాడా లనుకున్నాడు. చెప్పా లనుకున్న దేమిటో గుర్తురాలేదు.

అప్రయత్నంగా అనాలోచితంగా అన్నాడు—

"మనం నలుగుర్నీ కాదని ఏ పనీ చెయ్యలేం"—అంత సేపు మౌనం తర్వాత అతనా మాట లనడం తన కథ గురించే అని అర్థమై.

"చెయ్యలేమా! చెయ్యకూడదా!" అని అడిగింది సుధ.

"చెయ్యలేకపోయిం తర్వాత ఇక ఏదైతేనేం?"

"ఎవరైనా చెయ్యగలిగితే?"

"తర్వాత బాధపడతారు. మీ కథలో అమ్మాయిని తర్వాత అడిగితే 'అప్పుడేదో బుద్ధి తక్కువగా ఆలోచించాను. ఇద్దరిమీద ప్రేమ ఏమిటి?' అంటుంది."

"అన్నంత మాత్రాన బుద్ధిమంతురా లైందని అర్థంకాదు. తనకి చాలా సహజంగా, నిర్మలంగా కలిగిన అనుభూతుల్ని చంపుకుని సంఘ భయంవల్ల నీతికి అనుకూలంగా మారిం దన్నమాట." అని ఒక్కక్షణం ఆగి—"పుస్తకాల్లో చదివేవిషయాలు తప్ప నాకేం తెలీ వనుకోండి.

అందరూ సంఘం,సంఘంఅంటారు. లేకపోతేరాస్తారు. ఆ లెక్కలప్రకారం మనం సంఘానికి ఒక రూపం తయారుచేస్తే అది బాగా యిరుకు జైలు లాంటిదేమో అనిపిస్తుంది నాకు. అందులో గాలీ, వెల్తురూవుండవు. కాళ్లూ చేతులూ ఆడవు. తల ఎత్తలేం. ఎప్పుడూ కుంచించుకుని శరీరమంతా ముడుచుకుని తల ఒంచుకుని—దానికి వినయం అని పేరు పెట్టుకుని ఎన్ని తరాలుగానో బతికిస్తున్నాం. ఆ వినయం, విధేయతా తెలీని ఏ మూర్ఖుడికో ఆ జైలుగోడలు బద్దలు కొట్టాలని బుద్ధిపుడుతూ వుంటుంది సాహసించే బయటికిపోతాడు. అందుకేనేమో మాస్టారూ సంఘం వెనక ఎప్పుడూ సంఘధిక్కారం కూడా వుంటుంది" అని రాజారావు మాటలకోసంఆగింది.

"అతను ఏమీ అనలేదు. ఏం అనుకున్నాడో అర్థంకాలేదు. నిజం గానే రాజారావు స్పష్టంగా ఏమీ అనుకోలేదు. ఆలోచనలు స్తంభించి, లోపలంతా శూన్యం అయింది. అసలు ఈరకంగా కాదు, అతను సుధతో మాట్లాడాలనుకున్నది. మొదట్లో ఆమెను తను చూచినప్పటినుంచీ ఏమేమి ఆలోచించాడో, ఇద్దరూ వొక జీవితం ఎలా గడపా లనుకున్నాడో, తన తల్లికి అయిష్టమైనప్పటికీ ఎలా నచ్చజెప్పా లనుకుంటున్నాడో—ఆమెదగ్గిర కోడలిగా సుధకి ఎంత సహనం వుండాలో....ఇంకా చాలా....తను కాలేజీ పరిచయాలతో ఎరిగిన సుధకీ ఈ అమ్మాయికీ ఏమీ పోలికే లేనట్టువుంది.

ఎంత పోలిక లేకపోయినా ఈ సుధ గురించే తను ఎప్పట్నించో ఆలోచించేది.

పౌర్ణమి చాలా దగ్గిర పడిందేమో, వెన్నెల చాలా కాంతిగా, అందంగా వెలుగుతోంది. గాలి బాగా చల్లబడి చలి పుట్టిస్తోంది. సుధ పైటచెంగు భుజాలచుట్టూ కప్పుకుంది.

"వెళ్దామా ?" అన్నాడు రాజారావు.

"పదండి"—అని లేచింది.

ఇద్దరూ ఆకులసందుల్లోంచి పడే వెన్నెలనీడల్లోంచి నడుస్తున్నారు.

రాజారావు సుధ చెయ్యి పట్టుకున్నాడు. సుధ ఆగింది. అతను చాలా

దగ్గరగా నిలబడ్డాడు. జీవితంలో ఆ అమ్మాయిని వొదులుకోకూడదు అని పించింది ఆ క్షణం. "ఏం ఆలోచిస్తున్నారు?" అన్నాడు చాలా మృదువుగా.

"ఏం లేదండీ"! అంది.

"మీరంటే నా కెంతో ఇష్టం" అనబోయాడు. తర్వాత?

ఆ ఇష్టాన్ని కూడా అధిగమించిన సంశయం కలుగుతోంది. ఈ విషయంలో తొందరపడకూడదు. నెమ్మదిగా ఆమె చెయ్యి వొదిలిపెట్టాడు- "మీకు చాలా కష్టం కలిగించినట్టున్నాను" అన్నాడు.

"లేదండీ నేనలా అనుకోను."

గేటుదాటి విడిపోయేముందు—"మళ్ళీ కలుద్దాం సుధా!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

సుధ—రాజారావు గురించే ఆలోచిస్తూ నడుస్తోంది. ఎంతకాలం నించో తన విషయంలో ఆసక్తి చూపిస్తోన్న మనిషి చాలా నిరుత్సాహంగా అయ్యాడు. ఎంచేతో? తన మాటలు నచ్చలేదేమో! ఈయన యెవర్నన్నా పెళ్ళి చేసుకుంటే ఆవిడ ఎలా మాట్లాడాలో పాఠాలు చెప్తారేమో—ఆ కారులో అమ్మాయి ఎంత బాగుందో! ఎవరికోసమో ఎదురు చూస్తోన్నట్టుంది. ఆ బిచ్చగాళ్ళని అంత చీదరించుకుంటుం దెందుకు? నిజమే, మొహంమీద చేతులు పెడుతున్నారు. విసిగిస్తున్నారు. దాన ధర్మాలుచేసి వాళ్ళ కష్టాలు తీర్చలేం. మరి ఏం చెయ్యాలి?—మొహం నిండా అంత అసహ్యం ఎందుకు? అద్దాలు ఎత్తుకుంటోంది, వాళ్ళమీద నుంచి గాలి రాకుండా. వాళ్ళ గోలనించి సుఖంగా వుండటానికి. ఆ అమ్మాయికి అద్దాల కారుంది.

ఆ వొచ్చే అతనే కావున్ను, అవును. అతనే పళ్ళ బుట్ట లోపల పెట్టిస్తున్నాడు.

"ఏంటి బావా! ఇంతాలస్యం చేశావు? వీళ్ళంతా నన్ను పీక్కు-తింటున్నారు" అంటోంది ముద్దుగా. అబద్ధం. వొక్క పైసా అన్నా ఇవ్వలేదు.

"సారీ డియర్! ఒక ఫ్రెండ్ కనిపిస్తే...." అని ఆమె భుజం నిమురుతూ "ఇచ్చాను కదటోయ్" అంటున్నాడు కూలిమనిషితో.

7]

"సాలా దూరంనించి తెచ్చినాను బాబూ! ఇంకో అయిదు పైసలు పడెయ్యండి."

"ఇరవై పైస లన్నావు. ఇచ్చాను. ఇంకేమిటి?"

"అవును బాబూ! సాలా దూరం...."

"వెళ్ళవోయ్...."

కారు కదిలింది. ఆ అమ్మాయి అతని భుజాల మీదికి వొరిగింది.

వాళ్ళిద్దరూ ప్రేయసీ ప్రియులన్నమాట. అచ్చం సినిమాల్లో మల్లే వున్నారు. అందంగా, షోగ్గా. అవునుగానీ ప్రేమ అంటే ప్రియుడి మీదో ప్రియురాలిమీదో మాత్రమే వుంటుందా? జీవితంలో .... ఇతర వ్యక్తుల మీద, ఇతర సందర్భాలలో వుండదా?

వొక వ్యక్తి వున్నా డనుకుందాం. తనకి లాభించే పనులు తప్ప ఇతర్లకేమీ సహాయం చెయ్యడు. తనకి అందుబాటులో వున్న వాళ్ళని పీడిస్తాడు. రిక్షా ఎక్కి ఐదుపైసలకి లోభిస్తాడు. స్వభావంలో ఏమీ ప్రేమా, దయా ఎరగని అతనికి వొక స్త్రీ మీద మాత్రం వున్నతమైన ప్రేమ కలుగుతుందా!—ఆ కారులో అబ్బాయి ఆ అమ్మాయితో ఏం చెప్తూ వుంటాడో! 'నీ కోసం త్యాగాలు చేస్తాను' అంటాడు కావున్ను.

మొన్న సత్యవతిగారు సుబ్బుల్ని బతిమాలుతోంది- ఎక్కడన్నా పనిమనిషి వుంటే చూసిపెట్టమని. ఆవిడ దగ్గిర ఏ పనిమనిషీ నిలబడదు.

"కడుపునిండా కూడు పెట్టకపోతే ఇంటెడు చాకిరీ ఎవరు చేస్తారమ్మా?" అని వెటకారం చేస్తోంది సుబ్బులు వెనకాల.

"సత్యవతిగారు చాలా మంచిది. పిల్లలంటే ప్రాణం, భర్తంటే ప్రాణం, అంటుంది అమ్మ. తన పిల్లలకోసం తన భర్తకోసం ప్రాణం పెడితే ఎవరికి మంచి? అయినా తన కళ్ళముందు చాకిరీచేసే మనిషికి అన్నం పెట్టాలనే ప్రేమలేని మనిషికి ఇంకా ఎవరెవరిమీదో ప్రేమ కలుగుతోంది అంటే నమ్మడం బాగాలేదు. అలాంటివన్నీ మామ్మలు రివాజు ప్రేమలేగానీ....ఏవిటో అంతా గందరగోళం; ఆలోచనలు. ఎవర్ని అడిగినా చెప్పరు.

"మాష్టారికి కోపమే వొచ్చేసింది. చంద్రశేఖర్‌కిచెప్తే ఏమంటాడో!

*  *  *

సుధ ఇంటికి వొచ్చేసరికి పద్మావతి చంద్రశేఖర్‌తో ఏవో పెళ్ళి విషయాలు మాట్లాడుతోంది. కొంతసేపు వింటే తెలిసిన సంగతి — ఆ పెళ్ళిళ్ళు ఎవరికో కాదు. చంద్రశేఖర్‌కే.

సుధ అక్కణ్ణించి వెళ్దాం అనుకుంటూంటే—"లలిత ఫొటో వుండాలే మన దగ్గిర. ఎక్కడుంది?" అంది పద్మావతి.

"చూస్తాను" అని సుధ లోపలికి వెళ్ళి వెదికి ఒక కవరు తెచ్చింది. "మీ రనలు ఫొటో చూడక్కర్లేదు. పిల్ల చాలా అందంగా వుంటుంది," అని నవ్వి కవరు అందించబోయింది. అతను తీసుకోలేదు. తన కిప్పుడు పెళ్ళి ఉద్దేశం లేదని అతను మొదటే స్పష్టంగా చెప్పాడు. అయినా పద్మావతి అంత నిరుత్సాహపడలేదు. "టేబుల్ మీద పెట్టు సుధా! తర్వాతెప్పుడన్నా చూస్తారులే" అంది.

లలితకి బాగా కట్నం యిస్తారు. అల్లుడికి ఉద్యోగంకూడా యిప్పిస్తారు. పిల్లకూడా అందమైంది. చదువుకున్నది—ఈ విషయం అంతా చాలా స్పష్టంగానే చెప్పిందావిడ. చంద్రశేఖర్ ఏమీ మాట్లాడలేదు.

"నీకు వర్ణాంతరం చేసుకోవటం అంటే ఏమన్నా అభ్యంతరం వుందా? మీ పెద్దవాళ్ళేమన్నా అడ్డుపెడతా రంటావా?" అందావిడ విషయం కొంత మార్చి.

"అలాంటిదేం లేదులెండి. పెద్దవాళ్ళెలాగూ అడ్డుపెడతారు. అది ఎప్పుడూ జరిగేదేకదండీ" అన్నాడు.

"నువ్వు కాస్త నచ్చచెపితే వాళ్ళుకూడా ఏమి అనరులేవోయ్. ఈ రోజుల్లో ఇవన్నీ ఎవరు పట్టించుకుంటున్నారు? ఏ తిండి దగ్గరో కొంచెం యిబ్బంది వచ్చినా ఎవరో ఒకళ్ళు సర్దుకోవచ్చు. నీ కిష్టం లేకపోతే ఆ అమ్మాయే వాళ్ళ కూరలు మానేస్తుందిలే."

"ఎవరి సంగతి?" అంది సుధ.

"శకుంతల."

"ఏం? తనే ఎందుకు మానేస్తుంది? — నువ్వు చెప్పేది ఎలా వుందంటే—'మనలో మనకి పోట్లాట లెందుకు? సామరస్యంగా పోదాం. నేను చెప్పినట్టే చేద్దాం, అన్నాట్ట ఒకాయన" అంది సుధ నవ్వులాటలో పెట్టి.

"సర్లే! నువ్వు కాసేపు వూరుకుందూ!" అని పద్మావతి మళ్ళీ పెళ్ళి కబుర్లు ఎత్తింది—"ఎమ్మే పాసయిందోయ్. ఉద్యోగంకూడా చేస్తోంది రెండేళ్ళనించీ పిల్ల చక్కగా వుంటుంది. మంచి కుర్రాడు దొరికితే ఏ కులం అయినా చేసెయ్యా లనుకుంటున్నారు వాళ్ళ నాన్నగారు" అని వూరుకుంది.

"ఎమ్మే చదివి ఉద్యోగంచేస్తోన్న పిల్లకి చుట్టాలు సంబంధాలు వెతకటం—నాన్నగారు పెళ్ళిచెయ్యటం ఏమిటండీ?" అందా మనుకున్నాడు.

రెండు సంబంధాలకీ తాను సుముఖంగా లేకపోవటంతో అసలే ఆవిడ నిరుత్సాహంగా వుంది. కూతురు హాస్యానికీ విసుక్కుంది. ఇక తన తెలివి ప్రదర్శించడం తెలివిగలపనికాదు.

"అర్జంటేం లేదనుకో, రెండురోజులు ఆలోచించుకునే చెప్పు. మళ్ళీ రావటం ఎందుకు? పిల్లల్నిచూసే వెళ్ళవొచ్చును."

"అసలు నాకు ఉద్యోగమే లేదుకదండీ" అని నసిగాడు.

"ఉద్యోగం ఇప్పిస్తారు కదటోయ్" అంది ఆవిడ ఉత్సాహంగా. అతనేం మాట్లాడలేదు.

కొంతసేపు ఆవిడే పిల్లల అందచందాలూ, గుణగణాలూవర్ణించి—"మంచి సంప్రదాయంగల కుటుంబాలు. ఎవర్ని చేసుకున్నా సుఖపడతావు" అని నొక్కి చెప్పి లేచి వెళ్ళిపోయింది. తన వెనకాలే కూతుర్ని పిలిచి—"లలిత ఫొటో అతనికి చూపించు. తప్పకుండ వొప్పుకుంటాడు" అని నెమ్మదిగా చెప్పింది.

చంద్రశేఖర్ గదిలోకి వెళ్ళి ఏదో పత్రిక తిరగేస్తూ కూర్చున్నాడు. సుధ కవరు తీసుకెళ్ళింది.

"ఈ ఫొటో మా అమ్మ మీకు తప్పకుండా చూపించమంది" అని కవరు అందించబోయింది.

చంద్రశేఖర్ తలెత్తి ఆశ్చర్యంగా చూస్తూ "మీరుకూడా ఇలా చెయ్యటం ఏం బాగాలేదు. నేనేదో హీరోనైనట్టు ఆ ఆడపిల్లలు కన్నెత్తి చూడ్డానికి కూడా అర్హులు కానట్లు ప్రవర్తించడం నాకే సిగ్గుగావుంది. నాకిప్పుడు పెళ్ళి చేసుకునే ఉద్దేశమే లేనప్పుడు ఆ ఫొటో చూడటం—బాగుందనో, బాగులేదనో పేర్లు పెట్టడం ఎందుకు? మీ అమ్మగారికి మీ రేదో చెప్పండి. లేకపోతే నేను చూడనన్నాననే చెప్పండి"-అన్నాడు.

సుధ మాట్లాడలేదు.

"మీ అమ్మగారు ప్రేమించే పెళ్ళిచేసుకున్నారు కదా! మనల్ని మాత్రం కట్నానికో, వుద్యోగానికో ఆశపడి ఎవరో కుదిర్చిన పెళ్ళిళ్ళు చేసుకోమంటారేం! మనకి ప్రేమించే మనసులు లే వనుకుంటున్నారా?"

"అవిణ్ణే అడక్కపోయారా?" అంది సుధ అతని చేతిలోంచి తీసుకున్న పత్రిక తిరగేస్తూ.

రెండు రోజులకి కూడా చంద్రశేఖరం ఏమీ చెప్పేట్టు కనపళ్ళేదు పద్మావతికి.

మూడో రోజు సాయంత్రం టిఫిన్ వేళకి టేబుల్ దగ్గిర వొక కొత్తమ్మాయి ప్రత్యక్షమైంది.

"శకుంతలండీ! కొంచెం పనిమీద వొచ్చింది" అని పరిచయం చేసింది పద్మావతి.

శకుంతల వొస్తోన్న సంగతి సుధకి కూడా తెలీదు. తెలిస్తే చంద్రశేఖర్‌కి తెలిసేదే.

శకుంతల జార్జెట్ మీద జరీ పువ్వులచీర కట్టుకుని ఎక్కువ ముస్తాబు చేసుకునొచ్చింది. ఎక్కువ సిగ్గు ప్రదర్శించకుండా సుధ తోటీ. పద్మావతి తోటీ బాగానే మాట్లాడుతోంది—'కంఠం చక్కగా వుంది.' అనుకున్నాడు చంద్రశేఖర్. అంతకన్నా అత నేమీ ఆలోచించలేదు.

శకుంతలమాత్రం అతన్ని తరిచి తరిచి చూసింది. అందచందాలెలావున్నా తన భర్త అయ్యే వ్యక్తికి పెద్ద ఉద్యోగం వుండాలని ఆమె కోరుకుంటూ వుంది. పెళ్ళికాగానే ఉద్యోగం మానేసి అతనితో వెళ్ళిపోవాలి అనుకుంటోంటే ఈయనకి ఉద్యోగమే లేదు. మంచి బట్టలన్నా వేసుకోలేదు.

శకుంతల మొహంలో ఎక్కువ ఇష్టం కనపళ్ళేదు సుధకి — "ఈ మధ్య ఏమన్నా సినిమాలు చూశావా శకుంతలా?" అని అడిగింది సుధ.

"అనుభవ్ చూశాను, చాలా బాగుంది - నువ్వు చూశావా?" అని శకుంతల అడిగింది.

"చూశాను. నాకేం నచ్చలేదు."

"నచ్చలేదూ? భలేదానివే అంత బాగుంటే.... ఏం నచ్చలేదూనీకు?"

"ఏమీ నచ్చలేదు. అందులో సమస్యలన్నీ అర్థం పర్థంలేని సమస్యలు. వొళ్ళు మండింది చూస్తోంటే."

"మనుషులు అలాంటి సమస్యల్లోనే కొట్టుకుంటూ వుంటారు?" అంది పద్మావతి.

"కొట్టుకోనియ్యి. మనం జాలి పడక్కర్లేదు" అంది సుధ. శకుంతల చంద్రశేఖర్ సాక్ష్యం తీసుకోవాలని—

"మీరు చూశారాండీ? బాగాలేదూ?" అంది.

చంద్రశేఖర్ కొంచెం తటాపటాయించి — "చూడ్డానికి బాగానే వుందిగానీ—పోనివ్వండి, ఇంకేమన్నా మాట్లాడండి" అన్నాడు.

శకుంతల కొంచెం నవ్వి వూరుకుంది.

కాఫీ లవగానే అతను గదిలోకి వెళ్లి పోయాడు.

శకుంతల పద్మావతి వెనకే వంటింట్లోకి వెళ్ళి - "అదేంటి పిన్నీ? అలా వున్నాడేం?" అంది.

"ఎలా వున్నాడు?" అని నవ్వి - "చాలా మంచి వాడమ్మా! చిన్నప్పట్నుంచీ మెరిట్ స్కాలర్‌షిప్స్‌తో చదివాడు.

"టెర్లిన్ బట్టలవీ వేసుకో డనుకుంటాను. కొంచెం ఇబ్బంధిలో

వున్నాడుగా వుద్యోగంలేక, పోనీ నువ్వే కుట్టిస్తే సరి" అని హాస్యమాడిం దావిడ.

"అబ్బే! అందుక్కాదు." అని నసుగుతూ నిలబడింది శకుంతల.

టేబుల్ మీద గిన్నెలు పట్టుకుని సుధ లోపలి కొచ్చేప్పటికి-"అస లతను వొప్పుకుంటాడా లేదా అని నేను సందేహిస్తోంటే నువ్వు కూడా సణుగుతున్నావూ?" అని మందలిస్తోంది పద్మావతి.

"వొప్పుకోడూ? ఎందుకొప్పుకోడూ?" అంది శకుంతల ఆశ్చర్య పడుతూ.

"ఉద్యోగం చేసే ఆడవాళ్ళని మొగాళ్ళు కొందరు వొప్పుకోరు. పోనీ అతనికి వుద్యోగం వొచ్చాక నువ్వు మానెయ్యి" అంది పద్మావతి.

"ఛీ! ఛీ! అతను అలాంటివాడు కాదమ్మా!" అంది సుధ అడ్డొచ్చి.

"మరైతే ఎందుకిష్టం లేదూ?" అంది శకుంతల చీర కుచ్చెళ్ళు సర్దుకుంటూ.

"అడగరాదూ నువ్వెళ్ళి?" మధ్యవర్తులెందుకూ? స్వయంగా మాట్లాడరాదూ?" అంది సుధ.

"వొద్దొద్దు. నువ్వొస్తావని అతని కసలు ముందు చెప్పలేదు. కొంచెం మొహమాటం మనిషి. తర్వాత నేనే అడుగుతాలే మాట్లాడే వుద్దేశం వుంటే మళ్ళీ రావచ్చు" అని అభ్యంతరం పెట్టింది పద్మావతి.

శకుంతలకి పూర్తిగా నీరసం వొచ్చింది. ఇలాంటి సంబంధం తప్పి పోతే నష్టమేమీ లేదు. భర్త అనేవాడు భార్యకి చీరలు కొని నగలు చేయించి ముద్దు ముచ్చట్లు చూడాలిగానీ - తనే అతనికి బట్టలు కుట్టించా లిట! బాగానే వుంది - అనుకుని లేచింది. తన చీరమీద సుధ ఏమీ ఆసక్తి చూపించకపోతే "ఈ చీర నీకు నచ్చలేదా? మొన్న ఫస్టునాడు కొన్నాను. తొంభై రూపాయలు" అంది.

"అంత ఖరీదా వొక్క చీర?" అని ఆశ్చర్యపడింది సుధ.

"నా దగ్గిర నూట ఏభై రూపాయల జార్జెట్ ఇంకోటి వుంది. ఈ సారి కట్టుకొస్తాను. వెళ్తాను పిన్నీ."- అని చెప్పి వెళ్ళిపోయింది.

ఆ రోజు చంద్రశేఖర్‌కి కూడా ఏమీ వుత్సాహంగా లేదు. రెండో ఇంటర్వ్యూలో కూడా అతను సెలెక్ట్ కాలేదు. అతనే కాదు. అసలు ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళు ఎవరూ సెలెక్టు కాలేదు. ఇంటర్వ్యూలు రివాజుగా జరిగి ముగిసింది నాలుగు రోజుల కిందట. ఆ ఉద్యోగం ఎవరి కొచ్చిందో చంద్రశేఖర్‌కి తెలీదు.

శకుంతల వెళ్ళిపోయిం తర్వాత సుధ ఖాళీ చేసుకుని అతని దగ్గిరికి వొచ్చింది- 'దిగులు పడకండి. ధైర్యంగా వుండండి' అని ఓదార్చటం కృత్రిమ అభినయం అనిపించింది. విచారించే విషయానికి విచారించక పోతే, సంతోషించే విషయానికి సంతోషించటం కూడా చేతకాదు—

"మనం కాస్సేపు బయటికి వెళ్దాం రండి" అన్నాడు చంద్రశేఖర్.

"అమ్మ సినిమాకి వెళ్తోంది. పక్కింటావిడ కబురు పంపితే వొస్తానని చెప్పింది. మనం-అంటే నేనే అనుకోండి-కొంచెం వంట చెయ్యాలి యీ పూట. మీరుకూడా వంటింట్లోకొచ్చి కూచుని, అదే మన పార్కు అనుకుంటే సరిపోతుంది" అని నవ్వింది.

"ఎంతమాట! అది పార్కుకన్నా గొప్పది. కడుపు నిండిన తర్వాతే పార్కులూ, షికార్లూ, సరే! అలాగే చేద్దాం" అని ఆమోదించాడు.

"మీరు నిజంగా ధైర్యంగా వున్నట్టున్నారే! బాగా విచారించమని ప్రోత్సహించటానికి వచ్చాను."

"ఒస్తే వొచ్చారు. నిరాశపడకండి. మీరు ధైర్యంగా వుండండి."

సుధ నవ్వుతూ వెళ్ళింది తల్లి పిలిస్తే. పద్మావతి ఏమేం కూరలు వొండాలో — ఏ కూరలో అల్లం వెయ్యాలో-ఏ కూరలో కొబ్బరి వేయాలో పదిసార్లు చెప్పి, గేటుముందుకు వొచ్చిన పక్కింటివాళ్ళ కారెక్కి వెళ్ళిపోయింది.

సుధ వీధి తలుపు వేసి వొచ్చి వంటింట్లో ఈజీ ఛెయిర్ వేసి చంద్రశేఖర్‌ని పిలిచింది.

"ఇప్పుడు కార్యక్రమం ఏమిటి?" అంటూ వొచ్చాడతను.

"మీరు ఏదన్నా చదువుతూ కూచోండి లేకపోతే మాటలు చెప్పండి. నేను వంట ప్రారంభిస్తాను. మధ్యలో కాసేపు ఇంటర్వెల్ ఇచ్చుకుని కాఫీలు తాగుదాం" అంటూ పైటచెంగు బొడ్లోదోపి, కత్తిపీట ముందు వుల్లిపాయలు పోసుకుని కూర్చుంది సుధ.

చంద్రశేఖర్ గాభరాపడి—"ఆగండి. ఆగండి. అసలీ ప్రోగ్రాం ఎంతసేపు ?" అని అడ్డొచ్చాడు.

"సుమారు మూడుగంటలు. పది నిమిషాలు అటో ఇటో."

"ఇవెందుకు? అవే వేద్దాం. మూడుగంటల పదినిమిషాలు. ఇప్పుడు మీరు వంటచేస్తారన్నమాట. వొక గంటయ్యాక అప్పటికి తయారైనవి తినేసి మళ్ళీమొదలుపెట్టాలి. ఇక ఈవంట ఈ యుగాంతానికి ముగిసేదారి లేదు. నేనిప్పుడే వాకౌట్ చేస్తున్నాను" అని కుర్చీలోంచి లేచా డతను.

అప్పటికే ఉల్లిపాయలు పొగరుపడి ఏడుపు మొహంపెట్టి-"మరేం చెయ్యమంటారు? పప్పుచారు పెట్టాలి. దోసకాయపచ్చడి చెయ్యాలి. పొట్లకాయ వేయించాలి. ఇంకేదో చెప్పిందండీ — ఎందులోనో కొబ్బరి కూడా వెయ్యమందండీ!" అని జ్ఞాపకం తెచ్చుకోటానికి ప్రయత్నించింది.

"మన కడుపుల్లో వేసెయ్యొచ్చు లెండి. అది క్లిష్టసమస్యేం కాదు. ముందు మీరు చెప్పిన ఐటమ్స్ అన్నీ తగ్గించేసి అరగంటలో వంట అయిపోయి బయటపడే విధానం చూడండి."

"అరె! అరగంటలో వంటా ? వంట అరగంటలోనా ?"

"లేకపోతే మూడుగంటలు చేస్తే ఐదువేలమంది సంతర్పణకి వండచ్చు."

"ఏవిటీ ? వొక్క మనిషే !"

"ఆఁ వొక్క మనిషే."

"తింటానికే !"

"మహా కమ్మగా తింటానికే. మీరు లేచి కుర్చీలో కూచోండి. నేను చేసేస్తాను అర గంటలో."

"ఏవిటీ? మీకు వంటొచ్చా?"

"మీకుమాత్రం వొచ్చా? ఒచ్చినవాళ్ళు మూడు గంటల పది నిమిషాలు వంట చేస్తారా?"

"అబ్బ: ఆ పదినిమిషాలూ మీరే కలిపారు. మీరింక మాట్లాడకండి. ఎలాగో చేసేస్తాను."

"అదేం కుదరదు. ముందు మీరు ఆ కూరగాయలన్నీ దాచేసి పప్పుచారు వొక్కటి చెయ్యండి. సరిపోతుంది."

"అమ్మ తిడుతుందండీ!"

"ఫ్యూడల్ మెంటాలిటీ మీద వుపన్యాసం ఇచ్చెయ్యండి. ఆడవాళ్ల గంటలకొద్దీ వంటిళ్ళలో మగ్గడం బానిస లక్షణం అని ఘోషించండి."

"ఘోషిస్తా గానీ—చిన్న సందేహం. వంటిళ్ళలో మగ్గకూడదు. సౌ డైనింగ్ హాల్లో పెట్టుకు వంటచేస్తే?" అని నవ్వబోయి మళ్ళీ వుల్లిపాయ ఘాటుకి ఏడుపు మొహం పెట్టింది.

"మీరలా దుఃఖపడటం నేను చూడలేను. మీరింకో పనిచెయ్యండి. నేను కోసి ఇస్తా"అని బీరువామీదనించి చాకు తీసుకున్నాడు చంద్రశేఖర్.

సుధ అది వూళ్లాక్కుని – "యిది బ్రెడ్డు కోసేదిలెండి" అని దూరంగా పెట్టింది.

చంద్రశేఖర్ యింకో చాకు తీసుకున్నాడు. అదికూడా వూళ్ళాక్కుని—"ఇది బ్రెడ్డుకి వెన్నరాసేది లెండి" అని అదికూడా దూరంగా పెట్టింది. ఇంకో చాకు పళ్ళు కోసేది. ఇంకోటి పెన్సిళ్ళు చెక్కేది.

"అమ్మ ఉల్లిపాయలు ఏదో చాకుతో కోసేది చెప్మా?"అని ఆలోచన్లో పడి చివరకి—అమ్మ ఉల్లిపాయలు కత్తిపీటతోనే కోస్తుంది" అని తీర్మానించింది సుధ.

చంద్రశేఖర్‌కి కోపంవచ్చి—"అమ్మతో ఆగారేం? అమ్మమ్మఎలా కోసేదో గుర్తులేదూ? ఇంకా వెనక్కి వెళ్ళండి. మన పూర్వీకులు వుల్లిపాయలు రాళ్ళతో చితకగ్గొట్టుకొనేవారేమో. లేకపోతే అసలు వుల్లి

పాయలు లేకుండానే సాంబారు పెట్టుకునేవారేమో? అందుచేత మీరు ఎవరి పద్ధతి ప్రకారం వంటచేస్తారో చూసుకోండి — ఎంత వెనక్కి వెళ్తే అంత ప్రశస్తం. ఇప్పు డర్థమౌతోంది నాకు. అందుకే మనవాళ్ళు వేదాలో, వేదాలో అని గోలపెడతారు వెనక్కి తిరిగి." — అని బ్రెడ్ కోసే చాకు తీసి వుల్లిపాయలు నరకడం మొదలు పెట్టేశాడు.

సుధ కిక్కురు మనకుండా బియ్యం కడగటంలో పడింది.

చంద్రశేఖర్‌కి కూడా కళ్ళలోంచి జలజలా నీళ్ళొచ్చి — వుల్లిపాయలు పొట్టు తియ్యకుండా వొండే పద్ధతి చరిత్రలో ఎక్కడా లేదా? అని విసుక్కున్నాడు.

"నేను చరిత్ర స్టూడెంట్‌నికాదు. ఫిలాసఫీ" అంది కోపంగా సుధ.

"ఐ. సీ., ఓ. కె., ప్రొసీడ్" అని కళ్ళు గట్టిగా మూసుకుని వుల్లిపాయ కసిగా నరకబోయి వేలు నరుక్కుని ఆర్తనాదం చేశాడు.

చివరికి రక్తపాతంతో—'అన్నం' అనే వొక్క మెత్తటి తెల్లటి పిండి పదార్థంతో వంట ముగిసింది. ఇద్దరూ గబగబా బయటికి వొచ్చారు వొంటింట్లోంచి. "తలుపు లేసి తాళం పెట్టెయ్యండి. నాకు నమ్మకంలేదు. మీరు మళ్ళీ వంటక్రియప్రారంభిస్తారు"అన్నాడు చంద్రశేఖర్‌భయపడుతూ.

"ఇంక చెయ్యను. ప్రామిస్" అని మాట ఇచ్చింది సుధ.

ఇద్దరూ సబ్బుల్తో ఉల్లిపాయవాసన చేతులూ, మొహాలూకడుక్కుని మంచినీళ్ళుతాగి అలసట తీర్చుకునిఇంటిముందుమొక్కల్లో కూర్చున్నారు.

"వంట చెయ్యటం కష్టమే అనుకుంటాను" అని కొంచెం పశ్చాత్తాపం వెలిబుచ్చాడు చంద్రశేఖర్.

"అర గంటలో చెయ్యటం మరీ కష్టం. వొప్పేసుకోండి" అని వొత్తిడి చేసింది సుధ.

వొప్పేసుకుని—"మన అమ్మలు ఎంత త్యాగధనులండీ! వాళ్ళు కూడా వేళ్ళు కోసుకుంటారా? మా అమ్మకి ఎన్ని ఏళ్ళున్నాయో. లెక్కపెట్టాలి ఇంటికెళ్ళి'' అని ఆతృతపడ్డాడు.

కథా నిలయం
60 241
శ్రీకాకుళం

ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది

"ఎప్పుడు వెళుతున్నా రేమిటి?''

"రేపు వెళ్తాను."

"మా నాన్నేమన్నారు?''

"ఇప్పటికి దయచెయ్య మన్నారు. మళ్ళీ ఏదన్నా వస్తే కాకితో కబురంపుతామన్నారు.''

"అయితే మీకు దొంగనోట్ల వ్యాపారం తప్పేట్టులేదు. అందుకే శకుంతల్ని పెళ్ళి చేసుకోరాదూ? పోనీ లలితని....''

చంద్రశేఖర్ చాలా సీరియస్‌గా అయిపోయి "మీరింకెప్పుడూ హాస్యానికి కూడా అలా మాట్లాడకండి'' అన్నాడు.

సుధ తెల్లబోయింది—"హాస్యానికి కాదండీ! నిజంగానే అంటున్నాను. డబ్బున్న వాళ్ళు కట్నాలిస్తే యేం? ఆడపిల్లలకి ఆస్థిలో వాటాయిస్తే అంత డబ్బు రాదూ?'' అంది.

ఈసారి చంద్రశేఖర్ తర్కానికి దిగి "ఆస్తిలో వాటా వొస్తే దానిమీద సర్వహక్కులూ ఆ పిల్లకే వుంటాయి. కట్నం అనేది పూర్తిగా ఆమె భర్తకి చెందుతుంది. ఆమెని పెళ్ళి చేసుకున్నందుకు లంచంగా తీసుకుంటాడు. అతని అజ్ఞానంవల్ల ఆ డబ్బుమీద పెత్తనం భార్యకి యిస్తే ఇవ్వవచ్చును గానీ, ఇవ్వవలసిన అవసరం మాత్రంలేదు. ఇంత పెద్ద తేడా పెట్టుకుని కట్నానికీ ఆస్తిలోవాటాకీ తేడా లేదంటున్నారు మీరు. వంటింట్లోకి వెళ్ళాక తెలివి తేటలన్నీ పూర్తిగా నశించినట్టున్నాయి.'' అని వివరించాడు.

"మీరూ వొచ్చారుగా నా వెనకాల?'' అని నవ్వింది. మళ్ళీ ప్రశక్తిమార్చి-'' పోనీ వాళ్ళివ్వాలనుకున్నది ఆ అమ్మాయికే ఇస్తారు. మీరు కట్నం తీసుకున్నామని అనుకోకండి. మీకు ఉద్యోగం దొరుకుతుంది. మానాన్న మీకోసం ప్రయత్నాలు చెయ్యటంలేదూ? అలాగే వాళ్ళూ చేస్తారు. తప్పేముంది? మీ ఇబ్బందులన్నీ పోయి హాయిగావుంటారు ఆలోచించి తర్వాత అమ్మకి ఉత్తరం వ్రాయండి'' అని ముందు ఆలోచనలేని

చిన్నపిల్లలకి నచ్చ చెప్తోన్నట్టు చూసింది. సుధకి ఆ రకం పెళ్ళి మాటలు మాట్లాడ్డం ఇష్టంలేదు, ఒకవేళ అవే అతనికి నచ్చి వాటి గురించి ఆలోచించి యిష్టపడి పెళ్ళి చేసుకుని ఉద్యోగం తెచ్చుకుని స్థిరపడతాడేమో అని సందేహించింది.

చంద్రశేఖర్ చాలా అవమానపడ్డట్టు మొహం పెట్టి "మీరిలా మాట్లాడుతున్నారంటే నేను నమ్మలేక పోతున్నాను"- అని ఆశ్చర్యపడి- "మీతో పరిచయ మయ్యాక మీరింత లోక రివాజుగా అందరూ మాట్లాడే మాటలు మాట్లాడ్డం నే నెప్పుడూ వినిలేదు" అన్నాడు.

"పెళ్ళి చేసుకోవటం బ్రతుకుదెరువు కోసమా? అని ఒకసారి మీరు అసహ్యించుకోలేదూ? ఆస్తి ఒస్తుందనో- ఉద్యోగం దొరుకుతుందనో - భార్య జీతం తెస్తుందనో పెళ్ళిచేసుకుంటే అది మాత్రం ఏమౌతుంది? కట్టు గుడ్డలు తప్ప ఏమీలేని పేదపిల్లని పెళ్ళిచేసుకోమని సలహా యిస్తే నేను చాలాసంతోషించేవాణ్ణి. శకుంతలగారికి వుద్యోగం లేకపోయినా ఆ రెండో అమ్మాయికి ఆస్థి లేకపోయినా ఈ పెళ్ళికబుర్లు జరగవుగా? అసలు మనిషి కోసంగాక మనిషి చుట్టూవున్న అవకాశాల కోసం పెళ్ళి చేసుకునే అల్పుణ్ణి అనుకుంటున్నారా నన్ను? మీకుండే ప్రేమలూ, ఇష్టాలూ, ఆదర్శాలూ పేద వాళ్ళకేమీ వుండవనుకుంటున్నారా?" అని అతను చాలా కష్టపెట్టుకుని మాట్లాడుతోంటే సుధ సిగ్గు పడిపోయింది. ఏమీ మాట్లాడలేక పోయింది. పరిస్థితి అనుకోని విధంగా అయినందుకు చాలా విచారించింది. కానీ చంద్రశేఖర్ అభిప్రాయాలు అంత సంస్కార వంతంగా వున్నందుకు మనసులో చాలా ఆనందం కలిగింది. మాట్లాడకుండా వూరుకుంటే అతను తన పశ్చాత్తాపం గ్రహిస్తాడేమోనని దోషిమల్లే కూర్చుంది.

కొంతసేపు మౌనంగా గడిచింది! గాలికి అతని తలమీద పారిజాతం కొమ్మలు వూగి జలజలా పువ్వులు రాల్చి గాలినిండా పరిమళం నింపాయి. చంద్రశేఖర్ లేచి నిలబడ్డాడు.

సుధ అప్రయత్నంగా అతని చెయ్యి పట్టుకుని "అంత కోపమే?" అని నవ్వింది,

"వొక వుత్తరం రాయాలి. జ్ఞాపకం వొచ్చింది."

"నేనూ రాయాలి. పది రోజుల్నుంచీ జ్ఞాపకం వొస్తోంది నాకు."

"అయితే మీ ఉత్తరం అర్జంటుకాదు. మీరు కూర్చోండి. మీ అర్జంటు వుత్తరాన్ని ఇప్పుడెవరూ విమానం మీద పట్టుకెళ్ళటంలేదు కూర్చోండి ముందు" అని చెయ్యిపట్టుకు లాగింది.

చంద్రశేఖర్ నవ్వి లేచిన చోటే కూర్చున్నాడు. "నిజంగా మీ కోపంతో నన్ను హడలగొట్టారండీ!"

"పేదవాళ్ళకి కోపం కూడానా? ఏనాడో సామెత కూడా చెప్పారు"

"ఆ సామెతల వ్యవహారం నాకు తెలియదుగానీ మీ పేదతనం మీ బట్టలదీ, చెప్పులదీ అని నేను మొదట్లోనే అనుకున్నాను, కారుల్లో, మేడల్లో తిరిగేవాళ్ళలో అనేకమంది ఎంత నిరుపేదలో మీకూ తెలుసు. నిజంగా నా మాటల్తో మీ కంత కష్టం కలిగించానా? నన్ను నమ్మకండి. నే నెప్పుడూ మిమ్మల్ని అంత తక్కువఅంచనా వెయ్యలేదు. మీరే నన్ను ధనగర్వంతో మిడిసిపడే వాళ్ళ రకంలో చేర్చి చాలా అవమానించారు."

చంద్రశేఖర్ ఏమీ అనలేదు.

"ఇంకాకోపమేనా? రేపు మీరెలాగూ వెళ్ళిపోతున్నారు. ఈ వొక్క రోజూ ఇలా అయిపోవలసిందేనా?" అని నవ్వి విచారం వెలిబుచ్చిందిసుధ.

చంద్రశేఖర్ నవ్వి కోపం లేదని రుజువు చేశాడు.

"సరే! ఇప్పుడు చెప్పండి. మీకెలాంటి పిల్లకావాలి? అలాంటి పిల్ల నా కెక్కడన్నా తారసపడితే మిమ్మల్ని కలుసుకోమని మీ ఎడ్రసిస్తాను."

"మీ రుణం నేను వుంచుకోను. నేనూ ఆ పనే చేస్తాను. మీ కెలాంటి అబ్బాయి కావాలో చెప్పండి" అన్నాడు.

"మీ కింకా తెలియదా? నేను పెళ్ళి చేసుకోను."

"ఎంచేతా?"

గేటుముందు కారు ఆగింది. పద్మావతి దిగింది.

"అమ్మ వొచ్చేసింది. ఎందులోనో అల్లం వెయ్యమందండీ?" అని ఖంగారు పడింది సుధ.

సుధ కంగారుపోయేట్టు వుచితమైన సలహా ఇవ్వలేనందుకు కొంచెం విచారించాడు చంద్రశేఖర్.

పద్మావతి వంటింట్లోకి వెళ్ళి దాని స్వరూపము అంతా గ్రహించి— "అయితే నువ్వు కూరలేమీ చెయ్యలేదన్న మాట. మంచిపని చేశావు." అని చాలా క్లుప్తంగా కోప్పడి విశాలమైన హృదయంతో క్షమించేసింది.

'అమ్మకి సినిమా ఎంత బాగా నచ్చిందో ఆ మధుర స్మృతుల ముందు ఈ క్షుద్ర విషయాలు పట్టించుకునే స్థితిలో లేదు. బతికేం దేవుడా'- అని సంతోషించి-"మా అమ్మ తిట్టలేదండీ! నా సంతోషం మీ కూ్కడా పంచిపెడదామని వొచ్చాను. లేవండి. పచ్చడి భోజనానికి రండి," అని పిల్చి వెళ్ళిపోయింది.

భోజనాల దగ్గిర సుధ తండ్రి బాగా విసుక్కుని-"వంట చేసి పడేసి సినిమాకి పోకూడదూ?" అన్నాడు.

పద్మావతి మాట్లాడలేదు.

సుధ ఏదో సంజాయిషీ చెప్పాలనుకుని మళ్ళీ నచ్చక మానేసి ఆలోచనల్లో పడింది.

చంద్రశేఖర్ తొందరగా భోజనం ముగించి గదిలోకి వెళ్ళి పోయాడు.

పడుకోబోయే ముందు పద్మావతి కూతుర్ని పిల్చి— రెండు వందల రూపాయల నోట్లు అందిస్తూ— "తీసికెళ్ళి మీ నాన్న మొహాన్న పారెయ్యి ఆ పూనకం దిగుతుంది." అని ఇవ్వబోయింది.

"శర్మగార్ని అడిగావా?" అని ఆశ్చర్యంగా అడిగింది సుధ.

"నే నడగలేదు. ఆయనే ఇచ్చారు."

సుధకి అసహ్యం వేసి "నువ్వే ఇచ్చి క్షమాపణ చెప్పుకో. అంత సిగ్గులేని పని నా చేత కాదు" అని గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

* * *

సుధగారికి —

రైలు కదిలి ప్లాట్ ఫారం మీద మీరు తెల్లచీరతో దూదిపింజెమల్లే

దూరంలో కలిసిపోయాక—నేను చాలా నిరుత్సాహంగా వొకమూల బల్ల మీద జనం రద్దీలో మీ ఆలోచనలతో కాలం గడిపేశాను.

మీరు మంచి మనసుతో నాతో చేసిన స్నేహం-మీ వున్నత స్వభావం మీ మాటలూ ఎప్పటి కప్పుడు నన్ను సంభ్రమంలో ముంచుతున్నాయి.

రైలు కదిలేముందు - "మళ్ళీ ఎప్పుడొస్తారు?" అని మీ రడిగితే నేను మాట్లాడలేకపోయాను. అది నిర్లక్ష్యం అనుకున్నారేమోనని తర్వాత భయపడ్డాను. కానీ, మీ రలా అనుకున్నట్టు కనపడలేదు. నేను జవాబు చెప్పకపోయినా కోపం తెచ్చుకోనట్టు నవ్వి వూరుకున్నారు.

ఈ వుత్తరం చదివి నేను చాలా సాహసం చేశా ననుకుంటారేమో! మీ రంటే నాకు కలుగుతున్న ప్రేమే మీకూ, నాకూ వున్న కొన్ని అంతరాల్ని దాటించి ఈ సాహసం చేసే అర్హత కలిగించింది అనుకుంటున్నాను.

మీకు ప్రేమలో నమ్మకం లేదని అనేకసార్లు అనడం విని విచారించాను. ఆ నమ్మకం కలిగించే వ్యక్తి ఎప్పుడైనా జీవితంలో తారసపడవొచ్చునని కూడా మీరు అనుకోవడం లేదు.

మీ కీ లోకంలో ఎక్కడైనా ప్రేమ దొరకవచ్చును గానీ మీ రనే సంస్కారం దొరకదు. ఎందుకంటే అది ఈ సంఘానికే లేదు. ఈ దేశానికే లేదు. ఒక విధంగా ప్రపంచానికే లేదు.

పశులకీ, జంతువులకీ కష్టాలుంటే అవి వొకరు విధించినవి కావు. ఒకరు తీర్చగలిగేవీ కావు. మనుషుల కష్టాలు మనుషులు కలిగించుకునేవే. ప్రపంచమంతా కొందరిని దరిద్రంలో-ఆకలిలో మగ్గబెట్టే విధానాలు-స్వలాభాల కోసం చేసే యుద్ధాలు - అజ్ఞానంతో తెచ్చుకునే జబ్బులు — కాళ్ళకి బంధాలు వేసే నీతులు—మతాలూ—దేవుళ్ళు—అసూయలు—అహంకారాలు—వొకటేమిటి? సమస్త మానవ సమస్యలన్నీ చాలా నేర్పుగా చాకచక్యంగా తెలివిగా ఆలోచించి మానవులు తయారు చేసుకుంటున్నవే. వాటిని వొదుల్చుకునే మార్గాలు వున్నాయేమో వెదకరు. వెదికితే అవి కనబడితే — ఎవరైనా చూపిస్తే — వాటిని ఆమోదిస్తే — లోకం నీతులనీ—

సంఘాలనీ—మతాలనీ—దేవుళ్ళనీ వొదిలేసి—మనుషులు దుఃఖాలూ—కష్టాలూ – దరిద్రాలూ – అసమానత్వాలూ—యుద్ధాలు—రోగాలూ—పోయి చెడిపోతారని. సమానత్వంతో – జ్ఞానంతో—ఆరోగ్యంతో స్వేచ్ఛతో నాశనమౌతారని.

ప్రపంచానికి సంస్కారం లేదంటే మీకు నా మాటల్లో నమ్మకం కలగక పోవచ్చును.

లక్ష్మణరావుగారి "అతడు—ఆమె" చదివారా? బహుశా మీరు చదివివుండరు. మన విమర్శకాగ్రేసరులు వారి ఆస్థాన రచయితల భజన తప్ప—ఎక్కడ ఏ మెరుపు—ఎక్కడ ఏ అందం—ఏ కాంతి కనపడతాయో చూడలేరు. ఈ పుస్తకానికి ఎవ్వరూ తమ వ్యాస పరంపరలో చోటివ్వక మీ దృష్టికి వొచ్చివుండదు. నేనుకూడా వొక పుస్తకాల పురుగు మిత్రుడు పోరటంవల్ల చదివాను. అందులో వొక చిన్న విషయం చెపుతాను.

కన్యాశుల్కం నాటకాన్ని వుదాహరణగా తీసుకుని రచయిత మానవ సమాజాన్ని— దాని చుట్టూ ముసిరే దుష్టశక్తుల్నీ మనకి ఎంతో స్పష్టంగా అర్థమయ్యే విధానంలో చెప్పాడు.

బుచ్చెమ్మ ఎవరోకాదు. మానవ సమాజం. అది వొక దేశానికే కాదు. ప్రపంచ మానవ సమాజం. ఈ సమాజం బుచ్చెమ్మలాగే వుత్త అమాయకత్వంతో బేలతనంతో శారీరకంగా మాత్రం వొక దశకి ఎదిగింది. బుచ్చెమ్మకి తనని గురించి ఆలోచనలేదు. విద్యలేదు. చైతన్యం లేదు. ఆమె పూర్తిగా తల్లిదండ్రుల అధికారంలో బానిస. ఈ అగ్నిహోత్రావధాన్లూ. వెంకమ్మలే మానవ సమాజాన్ని పీడించే మతోన్మాదులు. అభివృద్ధి నిరోధకులు. బుచ్చెమ్మ తల్లిదండ్రులకి బుచ్చెమ్మ సుఖంగానీ ఆనందంగానీ అక్కరలేదు. బుచ్చెమ్మని అమ్మినప్పుడు వొచ్చే డబ్బూ, జీవితాంతం—బుచ్చెమ్మచేసే చాకిరీ కావాలి. బుచ్చెమ్మకి చదువుగానీ—బుచ్చెమ్మ జీవితంలో ఇంకో పురుషుడి ప్రవేశాన్నిగానీ—ఆమె ప్రకృతి సహజంగా బ్రతకటాన్నిగానీ వొప్పుకోరు. ఆమె జీవితం ఆ విధంగానే అంతమైపోవాలని ఆజ్ఞాపిస్తారు.

బుచ్చెమ్మ వ్యతిరేకించదు. పాటిస్తుంది. నమ్ముతుంది. తన అభి

వృద్ధిని ఎవరో నిరోధిస్తున్నారనీ, లేకపోతే తను ఇంకా సహజ సుందర మైన మార్గాలలో బ్రతకవొచ్చుననే బుచ్చెమ్మకి తెలీదు. అందుచేత తన దురదృష్టానికి తన కర్మనే నిందించుకుని చాలా వినయంతో తల్లిదండ్రులకీ, పెద్దలకీ అణుకువగా లొంగివుంటుంది.

మతోన్మాదు లెప్పుడూ సమాజ సౌఖ్యం ఆలోచించరు. మహా అజ్ఞానంలో మూఢత్వంలో కలిగిన పిచ్చి ఆలోచనల్ని గొప్పచేసి సమాజాన్ని ఆ నమ్మకాల సంకెళ్ళతో బంధిస్తారు. చిటికెనవేలు కదపటానికికూడా స్వేచ్ఛ ఇవ్వరు. శాస్త్రజ్ఞానాన్నిగానీ, హేతువాదాన్నిగానీ వొప్పుకోరు. సమాజానికి ఏది అత్యవసరమో – ఏది ఆరోగ్యమో – ఏది సుఖప్రదమో ఆలోచన పోనివ్వరు. స్వేచ్ఛావాయువులు పీల్చక, సూర్యకిరణాలు తాకక, కటిక చీకటిలో–ఇరుకులో అనారోగ్యంలో సమాజం కుళ్ళడం ఆరంభమైనప్పుడు పోరుగింటి అగ్నిహోత్రావధాన్లుకూడా వొచ్చి పీఠాలెక్కి తాళాలూ, చిడతలూ అధికం చేస్తారు. చివరికి చచ్చిన సమాజ శవ సంస్కారానికి దైవస్తుతితో–మంత్రఘోషతో ఆర్భాటాలతో బయల్దేరి కప్పెట్టాలనో, తగలెట్టాలనో కుమ్ములాటలో లీనమౌతారు.

అగ్నిహోత్రావధానుల, వెంకమ్మల చాటున బుచ్చెమ్మగతి అంతే. అంత నిస్సహాయ స్థితిలోవున్న ఆమె జీవితంలోకి గిరీశం ప్రవేశిస్తాడు. ఎవరతను? ఎటువంటివాడు? ఏ దృష్టితో ప్రవేశించాడు? బుచ్చెమ్మనిచూసి ఆమె సౌందర్యాన్నీ–యౌవనాన్నీ దోచుకోవాలని వలలు పన్నిన దోపిడీ దారు గిరీశం. అతనికి విద్యలేదు. సంస్కారంలేదు. అవినీతి పరుడు–అయోగ్యుడు. ఆత్మగౌరవంలేదు. సంఘ గౌరవమూలేదు. దగాతో వంచనతో రోజులు గడుపుకోవటమే అతని లక్ష్యం. బుచ్చెమ్మమీద అతనికి ప్రేమలేదు. ఆమె గడిపే జీవితంమీద నిజమైన కరుణలేదు. ఆమె శ్రేయస్సూ, అభివృద్ధీ అతని కక్కరలేదు. ఆమెని సుఖపెట్టాలనీ–ఆనందపెట్టాలనీ అతని ఆలోచనకాదు. ఆమె శరీరాన్ని దోచుకోవాలి. ఆమెని వీలైనంత నాశనం చెయ్యాలి. ఆమె గతికి ఆమెని వొదిలెయ్యాలి. గిరీశం చేతుల్లో అలాంటి పరిస్థితి పట్టింతర్వాత ఇక బుచ్చెమ్మకి అవినీతి జీవితంతప్ప వేరే మార్గంలేదు. అకాలవృద్ధాప్యంతో-

కుదరని రోగాలతో అంద వికారంతో– బుచ్చెమ్మ జీవితం దుఃఖంతో ముగిసిపోతుంది.

దోపిడీదారుల చేతుల్లో మానవ సమాజానికి పట్టే గతి కూడా అదే. స్వార్థపరులకి సమాజ క్షేమం అక్కర లేదు. సమాజాన్ని వుద్ధరించాలనీ, మానవ సమస్యలు పరిష్కరించాలనీ దోపిడీదారు ఆలోచించడు. గిరీశం బుచ్చెమ్మని భవిష్యత్తు గురించి కలల్లో తేల్చినట్టు–దోపిడీదారుసమాజాన్ని ఫలించని ప్రణాళికల మత్తులో వాగ్దానాల్లో–కట్టబోయే ఆనకట్టలూ–పెట్టబోయే కర్మాగారాలూ–కలగబోయే సౌభాగ్యాలూ కళ్ళముందు మెరిపించి ఎప్పుడూ భవిష్యత్తుమీద ఆశలో నమ్మించి వుంచుతాడు ఈ నమ్మకాలనించి బయటపడే వివేకం–శక్తి సమాజానికి వుండవు.

బుచ్చెమ్మ జీవితాన్ని ఇంకో మలుపుకి తిప్పిన వ్యక్తి సౌజన్యారావు. ఆమెని విడో హోములోనే వుంచి ఏ మెట్రిక్యులేషన్ వరకో చదివించి–ఆమెకి కొంచెం ఆస్తివుంది కాబట్టి దాన్ని ఇప్పిస్తే–ఆమె జీవితం వొక వొడ్డుకి చేరింది అనుకుంటాడు.

మనం ఎప్పుడైనా గుళ్ళోకి వెళ్ళినప్పుడు పూజారి చిన్న గరిటెతో చెంబులో నీళ్ళు మన అరిచేతి గుంటల్లో పోసి తాగమంటాడు చూశారా? సరిగ్గా అలాంటిదే ఈ సంఘ సంస్కారం. ఆ నాలుగు నీటి బొట్లుతో దాహం తీరడం ఎంత నిజమో ఈ సంస్కరణ మితవాదంతో మానవుల కష్టాలు తీరడం అంత నిజం.

సౌజన్యారావుకూడా సంఘపు విలువల్నే నమ్ముతాడు. వాటిని ప్రశ్నించడు. అందులో నిజానిజాలు గుర్తించడు. అగ్నిహోత్రావధాన్లుకి వితంతు వివాహం వింతగా కనపడితే, సౌజన్యారావుకి వేశ్యా వివాహం వింతగా కనపడుతుంది. అంతే తేడా. సంస్కర్తలెప్పుడూ సమాజంకన్నా ఒక్క అంగుళం మాత్రం ముందు వుంటారు. తమకన్నా ముందుపోయే వారిని భ్రష్టులనీ, తమకన్నా వెనకపడ్డ వారిని చాదస్తులనీ–తమతో సమానంగా నడవటమే జ్ఞానమనీ ఘోషిస్తారు. మధురవాణి అతి సహజమైన లోకజ్ఞానంతో అడిగిన ప్రశ్నలకి జవాబులు చెప్పలేక–వాటి మూలకార

ణాలు ఆలోచించక-పలాయనవాదం పఠించమని సలహా ఇస్తాడాయన. గీతా ప్రదానాలూ—రక్షా బంధనాలూ—శ్రీకృష్ణ ప్రేమలూ సమాజాన్ని రక్షించ వని సంస్కర్తలెరగరు. ఈ ఈగ సంస్కర్తల్ని దున్నపోతు సంఘం ఎప్పటి కప్పుడు తోకతో ఈడ్చికొట్టి తన మా నాన్న తను బురదలో ఆనందిస్తూ పడుకుని వుంటుంది. మతోన్మాదులైనా, దోపిడీదారులైనా మితవాద సంస్కర్తలైనా — సమాజాని కేమీ వుపకరించని తిరోగమన శక్తులే. బుచ్చెమ్మ మెట్రిక్యులేషన్ చదువుతోటి — తలదాచుకునే పెళ్ళి తోటీ — లేసు అల్లికల్తోటీ — సంతృప్తి పడ్డదంటే యిక ఆమెని ఏ శక్తీ రక్షించలేదు. ఆమె వొక వ్యక్తిత్వం సంపాదించుకుని — స్వేచ్ఛగా — సుఖంగా సంస్కారవంతంగా జీవించే దశకి చేరాలి. బుచ్చెమ్మ తన గత జీవితానుభవాల్ని తరిచి చూసుకుని తన శ్రేయస్సు తనే యోచించుకుని ఆత్మధైర్యంతో తన ప్రగతికి అడ్డుపడేవాళ్ళని ధిక్కరించి నిలబడి నప్పుడే ఆమె జీవితం సార్థకం అవుతుంది.

మానవసమాజం గత చరిత్ర చూసుకుని—భవిష్యత్తు కేది అవ సరమో గ్రహించుకుని విప్లవ భావాలతో పీడితశక్తులమీద తిరగబడి జయించినప్పుడే—విముక్తి. ఆ స్థాయికి చేరని సమాజంలోగానీ—వ్యక్తుల్లో గానీ మనం—ప్రేమా—దయా — సంసారంవంటి మానవత్వపు విలువల్ని ఎంత ఆశిస్తామో అంత నిరాశపడతాం. మీరు తీవ్రంగా కోరుకునేవి మానవత్వపు విలువలే అయితే వీటిని నేర్పగల సమాజాన్ని సృష్టించు కోండి, అంతవరకూ వాటిని కలలోకూడా ఆశించవొద్దు.

లక్ష సందేహాలతో—భయాలతో—గత జీవిత—ప్రభావాలతో ఇప్పుడే విడో హోములో చేరిన బుచ్చెమ్మ స్థితిలో వుంది మన సమాజం. ఈ సమాజంనించి నాబోటి వొక వ్యక్తిని విడదీసి ఆ వ్యక్తి ఆలోచనల్లో—అభిప్రాయాల్లో—ప్రవర్తనలో సంస్కారం లేదంటున్నారు మీరు. దానికి బాధ్యత ఆ వ్యక్తిది అవునో, కాదో ఆలోచించమంటున్నాను నేను. మీ అశాస్త్రీయమైన ఆదర్శ శిఖరాలు మీ కళ్ళముందే కూలిపోయినప్పుడు దుఃఖపడవొద్దని హెచ్చరిస్తున్నాను.

నేను డబ్బులేని పేదవాణ్ణి. డబ్బువున్న పేదవాళ్ళనిచూసిన మీరు నా కోసం కొంచెమైనా సానుభూతితో ఆలోచిస్తారని నాకు తెలుసు. నేను వుద్యోగంకోసం మీ వూరు వచ్చానన్నది నిజం కాదనిపిస్తోంది ఇప్పుడు. మీ మనసులో కొంచెం చోటు సంపాదించి—మీ ఆలోచనలు కొన్నయినా నావేపు తిప్పుకుని మీరుచేసే ప్రేమపరీక్ష ఇంటర్వ్యూకే ఒచ్చానని పిస్తోంది.

నా జీవిత మార్గం నా కెప్పుడూ స్పష్టంగా లేదు. బ్రతుకు తెరువు కోసం ఏ తప్పుడుదారులు పడతానో—స్వభావం ఎదురుతిరిగి కక్షతో యే వుద్యమంలో వురుకుతానో తెలీదు. లోకంలో మామూలు భార్యలకోసం భర్తలు చూపే అహంకారంతో మిమ్మల్ని నేను రక్షించాలనీ,పోషించాలనీ, నా నీడలో మీ అస్తిత్వం మాయం చెయ్యాలనీ నే ననుకోవటం లేదు.

మీరు చెప్పిన కథలో ఆ దివ్య ప్రేమపుష్పం అందుకునే మార్గాలేమిటో అని చాలా ఆలోచిస్తున్నాను. సుధగారూ! ఈ ఉత్తరంలో మీకు నేనేమైనా అర్థమయ్యానా ?

మీకు బాహ్యంగా తెలిసిన చంద్రశేఖర్‌ని గాక మీ ప్రేమ సౌధం ముందు ఆశతో నిలబడ్డ చంద్రశేఖర్‌ని గుర్తించారా ?

"మూసిన తలుపుల ముందు బిక్ష అడగడం నాకు చాతకాదు" అన్నాడొక కవి. పిచ్చివాడు, బిచ్చగాడు ఒస్తాడని తలుపులు తీసి వుంచుతారా ? అతని దీనాలాపాలు విని దయదలచి తలుపులు తియ్య వచ్చునే ! నా ఆర్తనాదాలు మీకు వినబడుతున్నాయా? - ఎవరు వారు ?" అని మీరు లోపల్నించి అడగండి——నే నిట్లా చెపుతాను :

చంద్రశేఖర్‌ని.
మీ ప్రేమ భిక్షకోసం నిలబడ్డాను.
కాదంటే మిమ్మల్ని విసిగించను.
ఈ సౌధం ముందునుంచి వెళ్ళిపోతాను."

ఆ ఉత్తరం సుధ చదువుకొన్ననాడే ఈ ఉత్తరం చంద్రశేఖర్‌కి ందింది ;

"ప్రియమైన చంద్రశేఖర్ !....

మీరు ఎక్కిన రైలు కదిలి ప్లాట్‌ఫారం వొదిలి వెళ్ళిపోతోన్న క్షణాల్లో నా కేమనిపించిందో తెలుసా? మీరు దిగే రైలు వొచ్చి ఆగి-మీ కోసం నేను ఆతృతగా వెదుకుతోంటే - మీరు నవ్వుతూ ఎదురుపడితే.... అనిపించింది.

మీరు వెళ్ళిపోయారు. ఈ రెండురోజులూ నేను ఇంట్లోవున్నా. కాలేజీలో వున్నా. ఎక్కడ ఏ స్నేహితుల్తో మాట్లాడుతోన్నా ఆలోచనలన్నీ మీ మీదే. మీరు వెళ్ళిపోతే నాకింత దిగులుగా వుండడం నాకే ఆశ్చర్యంగా వుంది—"మీతో మాట్లాడాలి. అర్జంటుగా ర"మ్మని మీకు టెలిగ్రాం ఇవ్వాలనిపిస్తోంది నిమిష నిమిషం.

ఎప్పుడైనా హఠాత్తుగా గదిలోకి వొస్తే టేబుల్‌దగ్గర మీరు చదువుకుంటూ కనపడతారేమోనని అప్పుడప్పుడూ వొచ్చి చూస్తున్నాను. తపస్సుచేసి దేవుళ్ళని చూడ్డం నిజమైతే నేను రాత్రింబవళ్ళూ మీ గురించే ఆలోచించి, ఆలోచించి మిమ్మల్ని చూడగలుగుతాను.

మీరు వెళ్ళింది మొదలూ నా ఆత్మలోంచి వార్తలు—సందేశాలు—ఆజ్ఞలు బయల్దేరుతున్నాయి—మీకు ఉత్తరం రాయమని.

మీరు మా ఇంటికి రావడం — నా భవిష్యత్తునంతా మార్చిన సంఘటన అనిపిస్తోంది. నేనేం పుణ్యం చేసుకుంటే మీరు మాయింటికి వొచ్చే అదృష్టం కలిగిందో అనిపిస్తోంది. మీరే రాకపోతే నేను ఏ రాజారావు గారితోనో—ఏ రంగారావుగారితోనో మాట్లాడి— వాదించి—అసంతృప్తిపడి చాలా నిరాశతో రోజులు గడుపుతూవుండేదాన్ని. ఎందరో భార్యాభర్తల్ని, ఎందరో కుటుంబీకుల్ని నిత్యం చూస్తూవుంటాం. ఏ దాంపత్యంలోనూ కాంతి కనబడదు. వొకర్ని చూడ్డమే వొకరికి ఆనందంగా తేజస్సుతో వెలిగే మొహాలు కనపడవు. అలాంటి గతే నాకూ పడుతుందనే దిగులు ఇన్నాళ్ళూ, నా ఆలోచనలకీ— విశ్వాసాలకీ ఆనకట్టలు పడ్డాయి. నా ప్రశ్నలకీ, సందేహాలకీ జవాబులు దొరుకుతున్నాయి.

మీతో ఈ కొన్నాళ్ళ స్నేహంలోనే నాకు అద్వితీయమైన ఆనందం కనబడింది. భాష తెలియని ఏ ప్రాచీన శిలాశాసనంలోనో ఒక్క "కొమ్ము"—ఒక్క "తలకట్టు"—ఒక్క "అక్షరం'' అర్థమైనప్పుడు మిగిలినదంతా చదివి మానవుల పుట్టుపూర్వోత్తరాలు గ్రహించాలని శాస్త్ర వేత్తలకు కలిగే ఆరాటం కలుగుతోంది.

కారడవుల్లో దారి తప్పిన బాటసారికి సుదూరంలో దీపాలతో వెలిగే వొకే ఒక భవనం కనపడి—దాని ద్వారాలు వోరగా తెరిచివుంటే ఎవరి అనుమతీ లేకుండా లోపలికి ప్రవేశించాలనీ, అందులో ఆశ్రయం పొందాలనీ కలిగే అత్యాశ కలుగుతోంది.

ప్రేమ అనే దివ్య ఆకాశసౌధపు లోపలి సుందరమైన గదుల్లో ఏం చిత్రాలున్నాయో – ఏం అద్భుతాలున్నాయో – ఎంతటి మహత్యా లున్నాయో తెలుసుకోవాలనే సంభ్రమం కలుగుతోంది.

పువ్వులు పూసే తోటల్లో – సెలయేళ్ళు ప్రవహించే కొండల్లో— నక్షత్రాలు మెరిసే ఆకాశంలో – మనం ఇద్దరమే జీవించడం వూహిస్తు న్నాను. ఏ స్త్రీ—పురుషులైనా ఇలాంటి కలలే కంటారేమో! ఇవి ఎంత సహజమో, అంత క్షణికమేమో అని మనసు నిండా భయం.

జీవితంలో ఎవరి అనుభవాలు వారివేనా? ఎవరి శ్వాస వారిప్రాణాలు నిలుపుతోన్నట్టు ఎవరి కలలు వార్ని నడుపుతాయా? మీరు వింటే ఏమం టారో! నే నిలా మీకు వుత్తరం రాస్తోంటే నాకూ చాలా ఆనందంగా వుంది. ఈ ఆనంద తరంగాలు నా వూహా సరస్సులో ప్రయాణం చేసి ఈ ఉత్తరం చదివినప్పుడు మీ మనస్సుని కూడా తాకుతాయనే అను కుంటున్నాను.

నా అనుమతి లేకుండా రాజారావుగారు తొందరపడి నా చెయ్యి పట్టుకుని సందేహించి వొదిలేశారు. చాలా అప్రయత్నంగా నేను మీ చెయ్యి పట్టుకుని మీ స్పర్శతో కొత్తదారుల్లోకి చూపు తిప్పాను.

చీకటి ఆకాశంలో తళుక్కున మెరుపు మెరిసినట్టు మీరు వొచ్చి వెళ్ళిపోయారు. నా వూహల్నీ, కలల్నీ కాయితాల మీదికి తర్జుమా

చెయ్యడం కొత్తగా నేర్చుకుంటున్నాను. ఈ పిచ్చి వుత్తరం చూసి—"సుధ ఇంతేనా?" అనుకోకండి. ఈ అక్షరాలలో నన్ను నేను వ్యక్తం చేసుకో గలిగే చాతుర్యంలేదు నాకు. ఈ కలల్లో సుధని — ఈ ఆశల్లో సుధని — సుధలో సుధని అర్థం చేసుకోండి.

నా ఆలోచనలన్నీ మీ చుట్టూనే తిరుగుతాయంటే — మనుషులకి ప్రేమ చాలదనీ—బియ్యం, చింతపండూ వంటి క్షుద్ర పదార్థాలు కూడా కావాలనే నగ్నసత్యాలు గుర్తొచ్చి—ఈ సంవత్సరంతో నా ఎమ్మే అయి పోతే, నాకైనా వుద్యోగం దొరికితే—అనే బాధాకర విషయాలమీద కూడా కొన్ని ఆలోచనలు ఖర్చుపెడుతున్నాను.

రోజూ పోస్టులో వెళ్ళే లక్షలాది సామాన్య వుత్తరాలలో అందక పోయినా ఫరవాలేదని చెత్త వుత్తరాలలో ఈ వుత్తరం కలిసి అదృశ్యం కాకుండా—పోస్టు బంట్రోతులు స్వయంగా మిమ్మల్ని కలిసి చాలా భద్రంగా మీకే వినతిపత్రం అందించే మార్గాల్లో దీన్ని పంపుతాను.

ఇలాంటి వుత్తరాలు నేను మీకు నా జీవిత పర్యంతమూ రాయ గలిగితే!

నా ప్రేమ ఎన్నటికీ ఆరనిదీ — మాయనిదీ — చలించనిది అయితే,

మీ స్నేహం కోసం
మీ ప్రేమ కోసం
మీ సహచర్యం కోసం
నిత్యమూ ఎదురుచూసే
'సుధ'ని
మీ సుధ నేనా?

(డిసెంబరు 72; జనవరి 73లో ఆంధ్రజ్యోతి; వారపత్రికలలో మొదటిసారి)

— : : —